నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక




సోమవారం 30.03.2020 | కరీంనగర్ | షష్ఠి
• సంపుటి 9 • సంచిక 275 • వెల. రూ. 6.50 | పేజీలు : 12

సూర్యోదయం: 6.10, సూర్యాస్తమయం: 6.23, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం షష్ఠి మంగళవారం తె.ఝా. 3.15 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: రోహిణి సాయంత్రం 5.18 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 7.42 నుంచి 9.14 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.53 నుంచి 12.42 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.09 నుంచి 3.56 వరకు, వర్జ్యం: ఉదయం 8.38 నుంచి 10.22 వరకు, తిరిగి రాత్రి 11.14 నుంచి అర్ధరాత్రి 12.56 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



## రాష్ట్రంలో కరోనా పరిస్థితి

| | |
|---|---|
| మొత్తం కేసులు | 70 |
| మరణాలు | 1 |
| వ్యాధి నయమైనవారు | 11 |
| చికిత్స పొందుతున్నవారు | 58 |
| క్వారంటైన్‌లో | 25,937 |

## డిశ్చార్జి.. ఏ రోజు ఎందరు?


| | | | |
|---|---|---|---|
| మార్చి 30 | 1,899 | ఏప్రిల్ 4 | 1,453 |
| మార్చి 31 | 1,440 | ఏప్రిల్ 5 | 914 |
| ఏప్రిల్ 1 | 1,461 | ఏప్రిల్ 6 | 454 |
| ఏప్రిల్ 2 | 1,887 | ఏప్రిల్ 7 | 397 |
| ఏప్రిల్ 3 | 1,476 | | |

* ఇప్పటికే క్వారంటైన్ టైం పూర్తయినవారు 14,556



## స్పెయిన్‌లో ఒక్కరోజే 5,564 కేసులు

ప్రపంచంలో కేసులు
7,11,264
మొత్తం మరణాలు
33,562





'నన్ను క్షమించండి. కరోనాతో కొందరు చనిపోతారు. అది జీవితం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కార్ల తయారీ ఫ్యాక్టరీని మూయలేం'
- బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సొనారో

## ఢిల్లీలో 23 తాజా కేసులు

దేశంలో కేసులు
1,024
మరణాలు: 27

# కొంచెం నయం తొలగని గండం

- రాష్ట్రంలో కరోనావైరస్ కదలిక ఆగిపోయింది
- అయినా మహమ్మారి ముప్పపొంచే ఉన్నది
- ఏ క్షణం ఎలా మారుతుందో తెలియదు
- ప్రజలందరికీ తీవ్రమైన క్రమశిక్షణ అవసరం
- ప్రభుత్వానికి అన్నిరకాలుగా సహకరించాలి
- లాక్‌డౌన్‌పాటిస్తే తక్కువనష్టంతో బయటపడతాం
- వైద్య సిబ్బందితో ప్రత్యేక పూల్ ఏర్పాటుచేస్తున్నాం
- దుర్మార్గపు ప్రచారాలుచేస్తే కఠిన చర్యలు తప్పవు
- 11 మందికి కరోనా నయం.. నేడు డిశ్చార్జి
- నేటినుంచి పూర్తికానున్న క్వారంటైన్ సమయం
- ఏప్రిల్ 7 వరకు దశలవారీగా ఇంటికి పంపిస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కరోనా మహమ్మారి క్రమంగా కట్టడి అవుతున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. అయితే.. గండం నుంచి పూర్తిగా బయటపడినట్లు కాదని.. ఏ క్షణం ఎలా మారుతుందో తెలియదని అన్నారు. ప్రజలంతా చాలా తీవ్రమైన క్రమశిక్షణతో లాక్‌డౌన్ పాటించి ప్రభుత్వానికి సహకరిస్తే తక్కువ నష్టంతో బయటపడుతామని పేర్కొన్నారు. గాంధీలో చికిత్స పొందుతున్న కొవిడ్-19 పాజిటివ్ రోగుల్లో 11 మందికి పూర్తిగా నయమైందని.. వారు సోమవారం డిశ్చార్జి అవుతారని చెప్పారు. వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తీవ్రంగా కష్టపడుతున్నారని కొనియాడారు. కరోనాపై దుర్మార్గపు ప్రచారాలు చేస్తున్నవారిపై కఠినాతి కఠినంగా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. శవాలపై పేలాలు ఏరుకొనే చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. విపత్కర సమయంలో దేశమంతా ఏకమవుతుందన్నారు. కరోనా, ధాన్యం కొనుగోలు అంశాలపై ఆదివారం ప్రగతిభవన్‌లో జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రసంగం ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 70. ఇందులో ఒక వ్యక్తి డిశ్చార్జి అయ్యారు. ఆదివారం అతనితో ప్రధానమంత్రి మోదీ కూడా మాట్లాడారు. తనకు గాంధీ దవాఖానలో చికిత్స బాగా జరిగిందని, వైద్యులు, ఇతర సిబ్బంది బతుకడానికి ఆత్మస్థైర్యం ఇచ్చారని అతను ప్రధానితో చెప్పారు. ఈరోజు మరో శుభవార్త.. చికిత్సలో ఉన్న వారిలో 11 మందికి నెగెటివ్ వచ్చింది. అంటే బీమారీ పోయింది. గాంధీ దవాఖానలో వీరు కోలుకొన్నారు. ఫైనల్ రిపోర్ట్‌లో నెగెటివ్ వస్తేగానీ ఎవరినీ డిశ్చార్జి చేయరు. ఇందుకు కొన్ని విధివిధానాలుంటాయి. పాజిటివ్, నెగెటివ్ పరీక్షలు చేయాలి. శరీరంలో వైరస్ ఉన్నదా? లేదా? అని పరీక్షిస్తరు. తర్వాత ఛాతి ఎక్స్‌రే తీస్తరు. ఏమాత్రం రిస్క్

మిగతా 2వ పేజీలో



ఆదివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు రాష్ట్ర ఐపీఎస్ అధికారుల ఒకరోజు వేతనం చెక్కును అందిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు.

## సీఎం సహాయనిధికి విరాళాల వెల్లువ

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో ప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం ఆర్థికసహాయం ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయనిధికి ఒకరోజు వేతనం ఇవ్వనున్నది. సీఎంఆర్‌ఎఫ్‌కు తమ ఒకరోజు వేతనం రూ.60 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొంటూ విద్యావాలంటీర్ల సంఘం ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు అంగీకారపత్రం అందజేసింది. హెరిటేజ్ సంస్థ తరఫున రూ.30 లక్షలు ఇవ్వనున్నట్టు ఎండీ నారా భువనేశ్వరి తెలిపారు. 3

## ధాన్యం సేకరణకు 30 వేల కోట్లు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతి గింజనూ కొంటాం
- రైతులు ఆందోళన చెందవద్దు
- గిట్టుబాటు ధరకే కొనుగోళ్లు
- ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు
- కూపన్లవారీగా ధాన్యం సేకరణ
- బీహార్ కూలీలను తీసుకొస్తాం
- మన పండ్లను ఇక్కడే అమ్ముదాం
- వలస కూలీలు మా బిడ్డలే.. తలా 12కిలోల బియ్యం, రూ.500
- ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో యాసంగిలో పండే ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఒక్క గింజను కూడా రైతులు బయట అమ్ముకోవాల్సిన అవసరం ఉండదని భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని కొంటామని స్పష్టంచేశారు. మార్కెట్‌యార్డులను మూసివేశామని, గ్రామాల్లోనే ధాన్యాన్ని కొంటామన్నారు. ఆదివారం సాయంత్రం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం అమ్మకాలకు సంబంధించి రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న సాగుచేశారని, ఇందులో 40 లక్షల ఎకరాల్లో వరి వేశారని తెలిపారు. ఈసారి 14.50 లక్షల టన్నుల మొక్కజొన్న, 1.05 కోట్ల టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశమున్నదని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఇది రికార్డు దిగుబడి అని చెప్పారు. నిజానికి మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్లో ధరలేదని

మిగతా 2వ పేజీలో



## 11 మంది నేడు ఇంటికి

- ఇది రాష్ట్రానికి శుభవార్తే
- వైద్యసిబ్బందికి అభినందనలు
- ట్విట్టర్లో మంత్రి కేటీఆర్

'గాంధీ దవాఖాన ఐసొలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్న 11మందికి కరోనా పాజిటివ్ నుంచి నెగెటివ్‌గా వచ్చింది.. వారికి కరోనా నుంచి విముక్తి లభించింది. ఇది రాష్ట్రానికి ఒకింత శుభవార్తే. కరోనా వైరస్ బాధితుల చికిత్స కోసం కింగ్‌కోఠి దవాఖాన సిద్ధంగా ఉన్నది. అధునాతన సౌకర్యాలతో ప్రత్యేకంగా 350 పడకలతో సిద్ధంచేశాం.. హైదరాబాద్‌లో మరో నాలుగు ప్రత్యేక దవాఖానలను కూడా పూర్తిగా కరోనా చికిత్స కోసమే సిద్ధం చేస్తున్నాం.' 3

## హైదరాబాద్ వైద్యులు మంచోళ్లు

- భయాన్ని పారదోలి చికిత్స చేశారు
- కోలుకొనేలా ధైర్యాన్ని నింపారు
- తెలంగాణలో కరోనా నుంచి కోలుకున్న రామ్ గంపతేజ వెల్లడి
- ప్రధాని 'మన్‌కీబాత్'లో ప్రశంసలు
- శుభాకాంక్షలు తెలిపిన నరేంద్రమోదీ

4



స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆదివారం ఢిల్లీ - యూపీ సరిహద్దు వద్దకు చేరుకున్న వలస కార్మికుల చేతులపై శానిటైజర్ చల్లుతున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

## జిల్లాలు లాక్‌డౌన్

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

- వలస కార్మికుల సంచారాన్ని నియంత్రించండి
- ఇప్పటికే వెళ్లినవారిని క్వారంటైన్‌లో ఉంచండి
- కార్మికుల నుంచి ఇంటి కిరాయి వసూలుచేయరాదు
- బలవంతంగా ఖాళీ చేయించేవారిపై చర్యలు

**వలస** కార్మికుల సంచారాన్ని నియంత్రించేందుకు జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులను మూసివేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి స్వస్థలాలకు బయలుదేరిన కార్మికులకు స్క్రీనింగ్ నిర్వహించి 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచాలని స్పష్టం చేసింది. లాక్‌డౌన్‌ను సమర్థంగా అమలుచేయాలని, నగరాల మధ్య, జాతీయ రహదారులపై జనసంచారం లేకుండా చూడాలని కోరింది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు స్వయంగా బాధ్యతలు తీసుకుని ఈ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని కేంద్రం ఆదేశించింది. వలస కూలీలకు వారు పనిచేస్తున్న చోటునే భోజనం, వసతి సదుపాయం కల్పించాలని సీఎస్‌లు, డీజీపీలకు సూచించింది. 5

# కదిలితే కష్టమే

## జిల్లాల్లో మూడంచెలతో ప్రత్యేక వ్యూహం

- హైదరాబాద్‌లో ప్రత్యేక కాల్‌సెంటర్లు..22వేల క్వారంటైన్ ఇండ్లకు జియోట్యాగింగ్
- ముద్రపడినవారు బయటకు రాకుండా చర్యలు.. వారి ఫోన్లలో ప్రత్యేక యాప్
- బయటతిరిగితే సమాచారం ఇవ్వండి.. ప్రజలకు పోలీసుల సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొంటున్నప్పటికీ.. కొందరు యథేచ్ఛగా బయట తిరుగుతూ ఇతరులకు ప్రమాదకరంగా మారుతున్నారు. ఇలాంటివారిని కట్టడి చేసేందుకు తెలంగాణ పోలీసులు ప్రత్యేక వ్యూహాన్ని సిద్ధంచేశారు. హైదరాబాద్ నగరంలో కాల్‌సెంటర్ల ద్వారా హోం క్వారంటైన్ అయినవారి సమాచారాన్ని సేకరించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లుచేశారు. జిల్లాల పరిధిలో కమ్యూనిటీ, విలేజ్ ఆఫీసర్, పోలీస్‌వాచ్ పేరిట మూడు దశల్లో నిఘా పెట్టారు. కమ్యూనిటీ వాచ్‌లో హోం క్వారంటైన్ అయినవారి ఇండ్ల పక్కన ఉండేవారి ఫోన్ నంబర్లను పోలీసులు సేకరిస్తారు. ఎవరైనా హోం క్వారంటైన్ నుంచి బయటకు వస్తే సమాచారమివ్వాలని వారికి సూచిస్తున్నారు. విలేజ్ ఆఫీసర్ పేరిట గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వీపీవోలు రోజుకొకసారి హోం క్వారంటైన్ అయినవారి ఇండ్లను తనిఖీ చేస్తున్నారు. ఇక పోలీస్‌వాచ్‌లో భాగంగా ఒక ప్రాంతంలోని 15 మంది హోం క్వారంటైన్ అయిన వారి ఇండ్లను ఇద్దరు కానిస్టేబుళ్లకు అప్పగించారు. వీరు తమకు అప్పగించిన ఇండ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తూ హోం క్వారంటైన్ అయినవారిపై నిఘా కొనసాగిస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని కమిషనరేట్లలో కొవిడ్-19 ప్రత్యేక కాల్‌సెంటర్లు ఏర్పాటుచేశారు. ఈ కాల్‌సెంటర్లకు ఎలాంటి సమాచారం అందినా పోలీసులు అప్రమత్తం అవుతున్నారు

### హెచ్‌ఎండీఏ పరిధిలోని కాల్ సెంటర్లు

| | |
|---|---|
| హైదరాబాద్ | 040-23434343 |
| సైబరాబాద్ | 9490617440 |
| | 9490617431 |
| రాచకొండ | 9490617234 |

### కరోనా కట్టడిలో సాంకేతికత సాయం

కరోనా వైరస్‌ను లెక్కచేయక తిరుగుతున్న వారిని గుర్తించేందుకు సాంకేతికతను

మిగతా 4వ పేజీలో




విదేశాల నుంచి వచ్చి క్వారంటైన్‌లో ఉన్న మహిళ చేతిపై ముద్ర వేసిన చిత్రం



## కనిక పరిస్థితి విషమం!

బాలీవుడ్ సింగర్ కనిక కపూర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. నాలుగోసారి నిర్వహించిన పరీక్షల్లోనూ ఆమెకు కరోనా పాజిటివ్ వచ్చినట్టు వైద్యులు తెలిపారు. దీనిని బట్టి కనిక శరీరం చికిత్సకు ప్రతిస్పందించడం లేదని ఆమె కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. 5



## తొలి రోగి గుర్తింపు

కరోనా వైరస్ తొలుత ఎవరికి సోకిందన్న విషయం బయటపడింది. చైనాలోని వుహాన్‌లో ఉన్న హువనాన్ చేపల మార్కెట్‌లో వ్యూ గ్యూజియాన్ (57) అనే మహిళకు తొలుత ఈ వైరస్ సోకింది. నెల రోజుల చికిత్స తర్వాత ఆమె కోలుకున్నారు. 5

లాక్‌డౌన్-డే 7

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 37.2°c | 23.6°c | మెదక్ | 38.7°c | 20.3°c |
| కరీంనగర్ | 38.0°c | 23.0°c | ఆదిలాబాద్ | 38.2°c | 22.2°c |
| వరంగల్ | 37.5°c | 22.5°c | నిజామాబాద్ | 38.5°c | 25°c |
| రంగారెడ్డి | 37.0°c | 23°c | మహబూబ్‌నగర్ | 39.4°c | 24.8°c |
| నల్లగొండ | 39.2°c | 24°c | ఖమ్మం | 40°c | 26°c |



ఆదివారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్‌రెడ్డి కూడా ఉన్నారు.

# ..తొలగని గండం

మొదటిపేజీ తరువాయి...

తీసుకోరు. అందుకే అన్ని పరీక్షలు చేసి జబ్బులేదని తేలితేనే డిశ్చార్జి చేస్తరు. ఇప్పుడు 11 మంది ఫైనల్ రిపోర్టులో నెగెటివ్ వచ్చింది. వీరు సోమవారం డిశ్చార్జి అవుతున్నారు. ఇంకా చికిత్సలో 58 మంది మిగులుతారు. వీరందరూ కూడా మంచిగా ఉన్నారు. 76 ఏండ్ల ఒక్క వ్యక్తికి మాత్రం కిడ్నీ, ఇతర ఆరోగ్యస మస్యలున్నాయి. ఇతనితోపాటు అందరూ కోలుకొని డిశ్చార్జి అవుతారని నమ్మకమున్నది.

### వైరస్ దిగుమతికి ఆస్కారం లేదు

ప్రస్తుతం మన రాష్ట్రంలోకి కొత్తకేసులు వచ్చి చేరే అవకాశం చాలా తక్కువ. ఎందుకంటే అంతర్జాతీయ విమానాలు బంద్‌చేయించినం. పోర్టులు కూడా బంద్ అయినవి. అందుకే అంతర్జాతీయంగా వ్యాధి వచ్చి మనమీద పడే ప్రమాదం లేదు. పాజిటివ్ వచ్చినవాళ్లు స్థానికంగా అంటిస్తే తప్ప కొత్త కేసులు రావు. కరోనా అనుమానితులందర్నీ తీసుకొచ్చాం. కొత్తగూడెంలో దాదాపు 200 మందిని తెచ్చాం. కొందరు కొత్తగూడెం దవాఖానలో ఉన్నారు. ఆ దరిద్రులు ఆంధ్రలో పెండ్లిళ్లకు పోయి వచ్చారు. ఈ సమాచారాన్ని ఏపీ ప్రభుత్వానికి ఇచ్చాం. మరికొందరిని కరీంనగర్‌లోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో సీరియస్ అబ్జర్వేషన్లో ఉంచినం. అందుకే కొత్తకేసులు రావద్దని ఆశిద్దాం. భగవంతుడిని ప్రార్థిద్దాం

### గుంపు కట్టకపోవడమే ఆయుధం

లాక్‌డౌన్ ప్రకటించి భారతదేశం వాళ్లు కొంత తెలివిగల్ల పనిచేసినరని అంతర్జాతీయ మ్యాగజైన్లలో మెచ్చుకొంటున్నరు. ఎందుకంటే మనది పేదదేశం. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. ఉండాల్సినంత బలంగా వైద్యవసతులు లేవు. అయినా వ్యాధి వ్యాప్తి నియంత్రణకు లాక్‌డౌన్ చేయడమే ఆయుధం. గుంపులుగా చేరకుండా చూడటమే సరైన అస్త్రం. ఆ ఆయుధాన్ని సరిగ్గా వినియోగించుకున్నందున అవుటాఫ్ డేంజర్‌గా ఉన్నదని మెచ్చుకొన్నరు. ముఖ్యంగా 130 కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో సమస్య పెరుగనిస్తలేరు. తెలివిగల పనిచేస్తున్నరని అంతర్జాతీయంగా మెచ్చుకొంటున్నరు. అన్నింటిరీత్యా భగవంతుడి దయవల్ల బయటపడాలి. అందుకే ప్రజల్ని మరోసారి కోరుతున్నా... ఈ గండం నుంచి పూర్తిగా బయటపడేవరకు మనకున్న ఒకే ఒక ఆయుధం.. గుంపులుగా చేరకపోవడం, స్వీయ నియంత్రణ పాటించడం, లాక్‌డౌన్ కచ్చితంగా పాటించడమే. వైద్యాధికారులు, పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించడమే. ఇదే మన చేతుల్లో ఉన్న ఆయుధం. దీనిని ప్రయోగించినం. విజయవంతంగా ఉన్నం. వ్యాధికి మందు లేదు. దేశానికి ఉండాల్సిన వైద్య మౌలిక వసతులు లేనందున ఈ ఆయుధాన్ని సరిగ్గా వినియోగించుకోవాలి.

## దేవుడు కరుణిస్తే.. ఏప్రిల్ 7 నాటికి జీరో..



విదేశాల నుంచి వచ్చినవారికికానీ, వారితో కాంటాక్టు ఉన్నారనే అనుమానంతో కానీ, మొత్తం 25,937 మందిని ప్రభుత్వ వైద్య పర్యవేక్షణలో పెట్టుకొన్నం. మనం నిర్దేశించుకొన్న కటాఫ్ తేదీనుంచి వీరిని గుర్తించినం. ఇందులో చాలామందికి క్వారంటైన్ సమయం పూర్తి కావస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 5,746 బృందాలు నిరంతరం జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారుల ఆధ్వర్యంలో వారిని పర్యవేక్షిస్తున్నాయి. ఫోన్‌ద్వారాగానీ, వ్యక్తిగతంగా వారి దగ్గరికి పోయి వారిని పర్యవేక్షిస్తున్నరు. ఇప్పటికే 14,556 మంది క్వారంటైన్ పూర్తయింది. మిగిలినవారికి మార్చి 30 నుంచి వరుసగా క్వారంటైన్ పూర్తవుతుంది. దాని తర్వాత వారికి పర్యవేక్షణ అవసరంలేదు. ఏప్రిల్ ఏడోతేదీ వరకు వారందరి క్వారంటైన్ టైం అయిపోతుంది. అంటే మొత్తం జీరోకు వస్తుంది. మార్చి 30న 1899 మందికి, 31వ తేదీన 1440, ఏప్రిల్ 1నుంచి ఏడో తేదీ వరకు వరుసగా 1461, 1887, 1476, 1453, 914, 454, 397 మందికి క్వారంటైన్ సమయం ముగిసిపోతుంది. ఏప్రిల్ ఏడు తర్వాత మన దగ్గర కరోనాకు సంబంధించిన వ్యక్తి ఉండడు. ఆ లోపు దవాఖానలో చికిత్స పొందుతున్నవాళ్లల్లో 30 నుంచి 35 మంది వరకు డిశ్చార్జి అవుతరు. పది నుంచి పన్నెండు మంది మాత్రమే ఉంటరు. కొత్త కేసులు వచ్చి చేరకపోతే ఇదీ మన రాష్ట్ర పరిస్థితి.

### డేంజర్ వైరస్.. అందుకే అలర్ట్

దక్షిణ కొరియాలో ఒకే ఒక వ్యక్తి కరోనా బారినపడ్డాడు. అతనికి జబ్బు ఉన్నదని కూడా తెల్వదు. వాళ్లు లెక్క తీస్తే ఆ ఒక్కని ద్వారా చాలామందికి వచ్చింది. సూది మొన మీద కొన్ని కోట్ల కరోనా వైరస్ క్రిములుంటయట. అది అంత డేంజరస్ క్రిమి. అంత స్మాల్, షార్ప్‌గా ఉంటది. అందుకే ఒకవ్యక్తి ద్వారా అంతగా సోకింది. తగు జాగ్రత్తగా ఉండటమే తెలివైన పని. అందుకే ఈ గండం దాటేవరకు ప్రజలు మనం బాగున్నమని అనుకోవద్దు. ఏ క్షణంలో ఏ గండం వస్తదో తెల్వదు. చాలా చాలా తీవ్రమైన క్రమశిక్షణ అవసరం. కచ్చితంగా పాటించాలి. ఇప్పటివరకు మంచి సహకారమందిస్తున్నారు. వైరస్ మూవ్‌మెంట్ కట్ అయింది. అన్నిరకాలుగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. హోం క్వారంటైన్‌లో ఉన్నవాళ్లను రోజుకు రెండుసార్లు పర్యవేక్షిస్తున్నరు. దానిని కొనసాగించాలని కలెక్టర్లకు ఆదేశించాం. ప్రజలు కూడా సహకరించాలి. తక్కువ నష్టంతో బయటపడే అవకాశం ఉన్నది. మనల్ని మనం నష్టపెట్టుకోకుండా లాక్‌డౌన్‌ను పాటిద్దాం.

### వైద్యసిబ్బందితో ప్రత్యేక పూల్

కరోనా వైరస్ ఎక్కడ ఆగిపోతుందో మనకు తెల్వదు.. ఎంతదూరం యుద్ధం ఉంటదో తెల్వదు. ఎప్పుడు విస్ఫోటంలా విజృంభిస్తుందో కూడా అంతుచిక్కకుండా ఉంది.. కాబట్టి చాలా అప్రమత్తంగా ఉండాలి. దానికోసమే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఒక ప్రకటన కూడా ఇచ్చారు. కామన్ డాక్టర్స్ పూల్, నర్సెస్ పూల్, ల్యాబ్ టెక్నీషియన్స్ పూల్, ఇతర వైద్య సిబ్బంది పూల్‌లను రెడీగా ఉంచుకోవాలి. వంద మంది డాక్టర్లు అవసరమనుకుంటే 130 మందిని అందుబాటులో ఉంచుకోవాలి. దీనికోసం అందరినీ రిక్రూట్ చేయలేము. ఒక పూల్ తయారుచేసి వారిసేవలు వినియోగించుకుని వారికి డబ్బులు చెల్లిస్తాం. అందుకే డాక్టర్ల కోసం, నర్సుల కోసం యాడ్ ఇచ్చారు. 60ఏండ్ల లోపు వయసు, తగిన అర్హతలు ఉన్నవారిని, అవసరమైతే పీజీ విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, మెడికల్ గ్రాడ్యుయేట్స్ కూడా తీసుకుంటాం. ఈ కష్ట సమయంలో సేవాభావం కలిగినవారందరూ ముందుకురావాలి.

### విపత్తులో యావత్ దేశమొక్కటైతది

నేను కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు తమిళనాడులో సునామీ వచ్చింది. నాకు ఎవరూ చెప్పలే. నేను సుమోటోగా నిర్ణయం తీసుకుని 300 డాక్టర్లను, రెండు ప్రత్యేక విమానాలను పెట్టి, మెడిసిన్స్‌ను ఇచ్చి పంపించిన. నన్ను ప్రధాని అభినందించారు. ఇవన్నీ డబ్బా కొట్టుకుంటామా. దేశంలో విపత్తువస్తే యావత్తు దేశం ఒక్కటై కొట్లాడుతది. చాలా పెద్ద లాస్. మొదటికే మోసం వచ్చేటట్టు ఉన్నది. రూ.12 వేల కోట్లు తెలంగాణకు రావాలి. మార్చి 15నుంచి అల్లికి అల్లి.. సున్నకు సున్నా ఉన్నది. ఎక్సైజ్, పెట్రోల్, జీఎస్టీ బంద్ కదా. అందుకే ఎమ్మెల్యే జీతాలు కూడా బంద్ పెట్టాల్సి వస్తుందో తెల్వదు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కోత విధించాల్సి వస్తే విధించాలి కదా. ఎవరూ అతీతులు కాదు. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో భాగం కాదా? కష్టమొస్తే అందరం పంచుకోవాలి. మనం సంక్షోభంలో ఉన్నాం. విపత్తు వచ్చినప్పుడు తగిన విధంగా ఎదుర్కోవాలి. అందరూ తగ్గించుకోవాలి. రెండు బుక్కలు తినేటోళ్లు, ఒకే బుక్క తినాలె. నాలుగు శాకలు తినేవాళ్లు, రెండే తినాలె. ఈ గండం గట్టెక్కే దాకా అందరమూ నియంత్రణ పాటించాలి. అందరూ కాంప్రమైజ్ అయితే సమాజం నడుస్తది. విరాళాలు ఇచ్చేవారికి శతకోటి దండాలు. రాష్ట్ర ప్రజలను కాపాడుకోవాలి కాబట్టి కొంత మొండిగా ఉండాల్సి వస్తున్నది.



### రిస్క్ ఉన్నా ఈటల పనిచేస్తున్నారు

వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ రోజుకు మూడు, నాలుగుసార్లు సమీక్షలు చేస్తున్నరు. రిస్క్ తీసుకుని దవాఖానలను సందర్శిస్తున్నరు. నేను వస్తానంటే.. ఎందుకు అని గచ్చిబౌలిలో ఆరువేల బెడ్ల దవాఖానను ఆయనే పర్యవేక్షించారు. నిత్యం బులెటిన్ విడుదలచేస్తూ ప్రభుత్వమే వాస్తవాలను చెప్తున్నది. ఇటీవల రెండ్రోజుల్లో 20 కేసులు పెరిగితే ప్రభుత్వం దాయలేదు. శనివారం ఒక శవానికి పరీక్షచేస్తే పాజిటివ్ వచ్చింది. అతడు ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో చనిపోకపోయినా ఆ విషయాన్నీ దాచలేదు. ప్రభుత్వమే బాధితుల లెక్క చెప్తున్నప్పుడు, అనవసర ప్రచారం ఎందుకుచేస్తున్నారు? ఒకవేళ వ్యాధి వ్యాపిస్తే ప్రజలను మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తాం. దీనికెవరూ అతీతం కాదు. బ్రిటన్ ప్రధాని, కెనడా ప్రధాని భార్యకూ వచ్చింది.

### రాష్ట్రం స్థిమితపడాలె

కరీంనగర్ ప్రస్తుతం బాగానే ఉన్నదని కలెక్టర్, పోలీస్ కమిషనర్ చెప్పారు. కొద్దిరోజుల్లో వారి క్వారంటైన్ టైం అయిపోతుంది. కరోనా తగ్గుముఖం పడుతున్నదని చెప్పడంలేదు. ఇప్పటినుంచి కొత్తకేసు రాకుంటే సేఫ్‌గా ఉంటుందని చెప్తున్నా. మనది చాలా పెద్దదేశం, అంతా మంచిగనే ఉన్నదనుకుంటే తెల్లారేసరికి వచ్చిందనుకో, మళ్లా అంటుకుంటే పెద్ద పంచాయితీ. కాబట్టి రాష్ట్రంగా మనం కొద్దిగా స్థిమితపడాలె. తర్వాత దేశం స్థిమితపడాలె. లక్షణాలుంటే వైద్యులు చెప్తారు. ఏది ఉన్నా దయచేసి తొందరగా బయటపడాలని దేవున్ని కోరుకుందాం. అందరికన్నా ఎక్కువగా నేనే కోరుకుంటున్నా. కానీ తగ్గేంతవరకు నియంత్రణలో ఉండాలి, వేరేగతి లేదు.

### దుర్మార్గ ప్రచారాలపై కఠినచర్యలు

ఇప్పుడు ప్రజలు అందిస్తున్న సహకారం పూర్తిస్థాయిలో కొనసాగాలి. అదేసమయంలో సోషల్ మీడియాలోగానీ, ఇతర మాధ్యమాల్లోగానీ దుర్మార్గమైన ప్రచారాలు చేసేవారికి భయంకరమైన శిక్షలుంటాయి. ఆ శిక్షలు ఎట్లుంటాయో చూపిస్తా. మేమే గొప్పవాళ్లమని కొందరు మూర్ఖులు అనుకొంటారు. వారు చేసేదానికి వందరెట్లు శిక్ష అనుభవిస్తారు. దేశం, ప్రపంచమే అల్లకల్లోలమవుతున్న విపత్కర పరిస్థితుల్లో ఇలాంటి దిక్కుమాలిన, చిల్లర ప్రచారాలు ఎందుకు చేయాలి? అలాంటివారికి అందరికన్నా ముందు కరోనా సోకుతుంది. ఆ దుర్మార్గులకు సోకాలి కూడా. ఎందుకు ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నారు? ప్రశాంతంగా ఉన్న వారిని మానసికంగా హింసిస్తున్నారు.

### చిల్లర రాజకీయాలొద్దు

కేంద్రప్రభుత్వం వేరే, రాష్ట్రప్రభుత్వం వేరే ఉండదని సీఎం చెప్పారు. తాము 12కిలోల బియ్యం ప్రకటించామని, కేంద్రం కొంత తక్కువ ప్రకటించినంత మాత్రాన వారేం తక్కువ కాదన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ఇలాంటి శవాల మీద పేలాలు ఏరుకునుడు వద్దని సూచించారు. 'ఒకవేళ మా దగ్గర డబ్బులు నిండుకున్నాయి. ఏం చేస్తం. ప్రధాని, ఆర్బీఐ గవర్నర్‌తో మాట్లాడి, రూ.10వేల కోట్ల ఓడీ కావాలని కోరి తీసుకుంటం. ప్రజలను చంపుకోం కదా. సమయ సందర్భాలను బట్టి, పరిస్థితులనుబట్టి, అందరం సమన్వయంచేసుకుని పనిచేస్తం. అవసరముంటే ప్రధానితో మాట్లాడుతం. నేనుకూడా మాట్లాడిన. మందులు అవసరమవుతాయి, వెంటిలేటర్లు అవసరమవుతాయి. ఓ రాష్ట్రంలో ఎక్కువ కావచ్చు. ఓ రాష్ట్రంలో తక్కువ కావచ్చు. అన్ని కలిపిచేస్తం' అని చెప్పారు.

## సీఎం కేసీఆర్ సార్ సెల్యూట్

### అరవై ఏండ్లు



అరిగోస పడ్డ తెలంగాణ బిడ్డలను ఏకంచేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. ప్రత్యేక రాష్ట్రం సాధించి ఆత్మగౌరవ బావుటా ఎగురవేశారు. నేడు తెలంగాణ అన్నింటా ఆదర్శంగా దూసుకెళ్తుండటాన్ని చూసి నాడు కేసీఆర్ పిలుపుతో ఉద్యమంలో పనిచేసిన నాలాంటి కార్యకర్తల గుండెలు సంతోషంతో ఉప్పొంగుతున్నాయి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ.. ఎలాంటి విపత్తునైనా తెలివిగా, తెగువతో ఎలా ఎదుర్కొని నిలిచి గెలుస్తుందో కరోనా పోరాటంతో మరోసారి నిరూపించుకుంటున్నది. ముందుచూపు, ఆత్మవిశ్వాసం అన్నింటికంటే ఎక్కువ నా అనే పట్టింపు (అదే కన్న తండ్రికి ఉండే వెలకట్టలేని ప్రేమ).. కరోనా వైరస్ విజృంభించిన నాటినుంచి నేటివరకు అనేక సందర్భాల్లో ప్రెస్ ద్వారా ప్రజలను మెప్పించారు. వారిలో విశ్వాసం నింపారు. ఏదీ కొరత లేకుండా చూశారు. మరోవైపు రైతుల పంటలపై శ్రద్ధ పెట్టారు. ఇలా బహురూపాల్లో తెలంగాణను ఫలవంతమైన మేటి రాష్ట్రంగా నిలుపడం బాపు కేసీఆర్‌తో తప్ప మరెవ్వరితో కాదన్నది ఎవరైనా ఒప్పుకోవాల్సిన సత్యం. అనునిత్యం తెలంగాణ ప్రయోజనాలను మాత్రమే ఆలోచించే (కన్నతండ్రి) సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిది.

– మాదాసు శ్రీనివాస్,
గజ్వేల్ టీఆర్‌ఎస్ నేత

### లోకం పోకడ



సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు పోస్ట్ చేస్తున్నాడు.. కరోనా సోకిన పేషెంట్‌వున్న రూంలో తోసేయండి డాక్టర్!

# ధాన్యం సేకరణకు 30 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

కొన్నిచోట్ల 1200, మరికొన్నిచోట్ల 800కు అమ్ముతున్నారని.. ఇది ప్రమాదకరమని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనడానికి మార్క్‌ఫెడ్‌కు రూ.3200 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.25 వేల కోట్లు సమకూర్చామని చెప్పారు. వడ్లు కొనేందుకు అవసరమైన నిధుల కూర్పుకు సంబంధించిన ఫైలుపై సంతకంచేశానని తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవని, ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదని.. ఇంతటి కఠిన పరిస్థితుల్లో కూడా రైతులకు ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో ధాన్యాన్ని అమ్ముకోవాలని ఈ నిధులిచ్చామని చెప్పారు. ఏ రాష్ట్రంలో కూడా ఇంత స్థాయిలో ఏర్పాట్లు చేయడంలేదని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### గ్రామాలకు హార్వెస్టర్లు

రాష్ట్రంలో వరిని కోయడానికి ఐదు వేల హార్వెస్టర్లు ఉన్నాయని ఇవి కూడా ట్రాక్టర్ మౌంటెడ్ హార్వెస్టర్లని సీఎం కేసీఆర్ తెలిపారు. సాధారణ రోజుల్లో తమిళనాడు నుంచి 1500 హార్వెస్టర్లు అదనంగా వచ్చేవని.. ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. ట్రాక్టర్ మౌంటెడ్ హార్వెస్టర్లను బిగించడం రైతులవల్ల కాదని, బిగించేవారు పట్టణాల్లో ఉన్నారని.. వీరిని గ్రామాలకు తిరుగడానికి అనుమతించాలని కలెక్టర్లు, పోలీసులకు సూచించామని సీఎం వెల్లడించారు. వీటికి సంబంధించిన స్పేర్ పార్టుల దుకాణాలను కూడా తెరిపించాలన్నారు. స్థానికంగా దొరక్కపోతే, హైదరాబాద్‌లో ఎక్కడున్నాయో తెలుసుకొని వాటిని జిల్లాలకు పంపించాలని సూచించారు. రాబోయే ఆరేడు రోజుల్లో హార్వెస్టర్లను బిగించే బృందాలు గ్రామాలకు వెళ్లి హార్వెస్టర్లను సిద్ధంచేస్తారని పేర్కొన్నారు.

### బీహార్ కూలీలను రప్పిస్తాం

మన రాష్ట్రంలోని రైస్‌మిల్లుల్లో 95 శాతం బీహార్ వాళ్లు పనిచేస్తున్నారని సీఎం కేసీఆర్ అన్నారు. హోలీ పండుగకు రాష్ట్రానికి వెళ్తారని, కోతల ముందు మళ్లీ వస్తారని, చాలామంది బీహార్‌కు వెళ్లారని వివరించారు. ధాన్యం కొనుగోలు నుంచి కస్టమ్ మిల్లింగ్‌కు పంపించడం, అక్కడి నుంచి గోదాంకు పంపించడం వంటి పనులను బీహార్ కూలీలు చేస్తారని, ఇప్పుడు వాళ్లు ఇక్కడ లేరన్నారు. వీరిని రప్పించేందుకు బీహార్ సీఎస్‌తో మన సీఎస్ మాట్లాడుతున్నారని, అవసరమైతే ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేస్తామని తెలిపారు.



## ఇతర రాష్ట్రాల వారూ మా బిడ్డలే

బయట రాష్ట్రాల వాళ్లు మన రాష్ట్రంలో పనిచేసే వివిధ రకాల కూలీలు ఉన్నారని సీఎం కేసీఆర్ తెలిపారు. నివేదికల ప్రకారం దాదాపు 12,436 బృందాలు ఉండగా, వీటిలో 3.35 లక్షల మంది ఉన్నారని వివరించారు. జార్ఖండ్, ఒడిశా, బీహార్, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చారని, వీరంతా ఇటుక బట్టీలు, హోటళ్లతోపాటు వివిధ పనులు చేస్తారని చెప్పారు. ఎక్కువగా రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్‌లో ఉన్నారని, ఆ తర్వాత పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ ఇండస్ట్రీల్లో ఉన్నారని, రామగుండంలో కూడా ఉన్నారని, వీరందరికీ కూడా ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం లేదా గోధుమపిండి ఇస్తామని, ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు లేకున్నా రూ.500 నగదు ఇస్తామన్నారు. ఎట్టిపరిస్థితుల్లో ఒక్కరు కూడా ఆకలితో ఉండరాదని చెప్పారు. వాళ్లను కూడా ఆదుకుంటామని, ఆపదలో మన దగ్గర పనిచేస్తున్నారని, వాళ్లను తెలంగాణ రాష్ట్ర డెవలప్‌మెంట్ పార్ట్‌నర్లుగా చూస్తామని సీఎం కేసీఆర్ చెప్పారు. రకరకాల పునర్నిర్మాణాల్లో ఇతర ప్రాంతాల కూలీలు భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో బాగుండాలని, రియల్‌ఎస్టేట్ ఉండాలంటే ఎవరు వచ్చినా మనం కడుపులో పెట్టుకుని కాపాడుకోవాలన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా మంచినీటి వసతి, భోజనం, మెడికల్ కేర్ కూడా తీసుకుంటామని, అవసరమైతే మ్యారేజ్ హాళ్లలో భోజనం పెట్టాలని చెప్పినట్టు పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిక్షేపంగా ఇక్కడే జీవించవచ్చని భరోసా ఇచ్చారు. వారికేమైన సమస్యలు, ఇబ్బందులుంటే స్థానిక ఎమ్మెల్యేలనుగానీ, కలెక్టర్లనుగానీ, మున్సిపల్ అధికారులనుగానీ, సర్పంచులనుగానీ సంప్రదిస్తే వారికి కావాల్సిన వసతులు కల్పిస్తారని, వారు ధైర్యంగా ఉండాలని చెప్పారు.

## నియంత్రిత విధానం పాటించాలి

రైతులు మొక్కజొన్నను నియంత్రిత విధానంలో కొనుగోలు కేంద్రాలకు సరఫరాచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. రైతులు ఏరోజు పంట తీసుకొనిరావాలో తేదీలను తెలుపుతూ కూపన్లు ఇస్తారని, ఆ ప్రకారమే రైతులు పంటలను తీసుకొనిరావాలని కోరారు. ఐదారు రోజుల్లో రైతులకు కూపన్లు అందిస్తారని చెప్పారు. కూపన్ల పంపిణీలో ఏఈవోలు ప్రధానపాత్ర పోషించాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో ప్రతిగింజను ప్రభుత్వమే కొంటుందని, ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తామన్నారు. మార్కెట్‌యార్డులను మూసివేశామని, మార్కెటింగ్‌శాఖలోని 850 మంది సిబ్బంది గ్రామాల్లోనే ఉండి నియమిత విధానంలో ధాన్యాన్ని కొంటారని తెలిపారు. ఒకే దగ్గర ఎక్కువమంది గుమికూడవద్దనే ఉద్దేశంతో గ్రామాల్లో ధాన్యం కొనాలని నిర్ణయించినట్లుచెప్పారు. అందరూ ఒకేసారి వచ్చి పడితే ప్రమాదమన్న ఉద్దేశంతోనే కూపన్లను పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన తేదీలకు ముందు వస్తే వెనక్కి పంపిస్తారని స్పష్టంచేశారు. మార్కెట్‌యార్డులకు పెద్ద ఎత్తున రైతులు వస్తే వ్యాధి అంటుకొంటే గ్రామాల్లో గందరగోళ పరిస్థితి నెలకొంటుందని, ముఖ్యంగా ఖమ్మం, ఏనుమాముల మార్కెట్లకు వేలసంఖ్యలో వస్తారని, ఇలా వస్తే ప్రమాదమన్న ఉద్దేశంతో గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి ధాన్యాన్ని కొనే ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. మూడు నాలుగురోజుల్లో అధికారులు ప్రణాళికను సిద్ధంచేస్తారన్నారు. మొత్తం 45 రోజులపాటు పంటను కొంటారని, రైతులు వచ్చేటప్పుడు పాస్‌బుక్, బ్యాంకు ఖాతా పుస్తకాన్ని తీసుకొని రావాలని పునరుద్ఘాటించారు. పంటకు సంబంధించిన డబ్బులు అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు.



### కంచెలు తీసేయాలి

లాక్‌డౌన్ నేపథ్యంలో పట్టణాలకంటే, గ్రామాల్లోనే ప్రజలు క్రమశిక్షణతో ఉన్నారని సీఎం కేసీఆర్ చెప్పారు. గ్రామాలకు కంచెలు వేసుకొని క్రమశిక్షణ పాటిస్తున్నారని ప్రశంసించారు. గ్రామాల్లో కరోనా లేదని ప్రకటించారు. అవసరమైన మేరకు మార్కెట్ సిబ్బంది, కాంటాలు, నిత్యావసరాలు రావడానికి వీలుగా కంచెలు తొలిగించాలని సూచించారు. గ్రామ సరిహద్దుల్లో గంగాళాల్లో నీళ్లుపోసిపెట్టి కాళ్లుచేతులు కడుక్కొని వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇప్పుడు కూడా కంచెలు అలాగే ఉంచుతామంటే కుదురదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుబంధు సమితులు సమన్వయంచేసుకోవాలని, అత్యవసరంగా సమావేశం ఏర్పాటుచేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటుచేసినట్టు ధాన్యం ఎలా అమ్ముకోవాలనే విషయాలు చర్చించాలని చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో తెల్లకార్డున్న కుటుంబాలకు రూ. 1500ల చొప్పున బ్యాంకులో వేస్తున్నారని, బియ్యం స్థానికంగా ఇస్తారని తెలిపారు. బియ్యం ఇవ్వాలంటే బియ్యం వ్యాన్లను రానివ్వాలని సీఎం కేసీఆర్ సూచించారు. జాగ్రత్త చాలా మంచిదేనని, దానిలో పట్టువిడుపులు ఉండాలని, అవసరమైతే శానిటైజర్లు పెట్టాలని చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు కోటీ ఐదు లక్షల టన్నుల ధాన్యం కొనాలంటే 70 నుంచి 75 లక్షల గోనె సంచులు కావాల్సి ఉందని, అవి బెంగాల్ నుంచి వస్తాయని, అక్కడ మొత్తం పరిశ్రమలు బంద్ అయ్యాయని చెప్పారు. కొంత తిప్పలపడి 35 లక్షల బ్యాగులు సమకూర్చుకున్నామని, ఇంకో 35 లక్షలు కావాలని, చాలా కష్టాలు పడి ఇతర ప్రాంతాల నుంచి తెప్పిస్తామన్నారు. చాలా ఇబ్బందులు ఉన్నాయని, ప్రపంచంతోపాటు అన్నిప్రాంతాల్లో కర్ఫ్యూ ఉన్నదని, భవిష్యత్తుల్లో ఇలాంటి పరిస్థితులు రావద్దని కోరుకోవాలన్నారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రభుత్వాన్ని అభినందించాలని, అధికారులకు, నాయకులకు సహకరించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల దగ్గర మూడుఫీట్ల దూరం ఉండాలన్నారు.

### పండ్ల వాహనాలకు ప్రత్యేక పాస్‌లు

రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉన్న పండ్లను రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లకు పంపేందుకు ప్రత్యేకపాస్‌లు ఇచ్చామని, నిమ్మ, బత్తాయి, సంత్ర పండ్లను అన్ని మార్కెట్లకు పంపించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో అందరికీ పండ్లు అందాలని పేర్కొన్నారు. మన దగ్గరకు వచ్చే గూడ్స్‌ను అనుమతించాలని, మన దగ్గరనుంచి వెళ్లే వాటిని కూడా అనుమతించాలని జిల్లా అధికారులకు ఆదేశాలిస్తున్నామని సీఎం చెప్పారు. పౌల్ట్రీ మళ్లీ పుంజుకుంటుందని, చికెన్, గుడ్లు బయట రాష్ట్రాలకు వెళ్తాయని, బయట నుంచి వచ్చేవాటిని అనుమతించాలని, మామిడి, నిమ్మ, సంత్ర, బత్తాయి వంటి పండ్లను మన దగ్గరే అమ్మాలని సూచించారు. వీటికోసం 500 కేంద్రాలు ఏర్పాటుచేయాలని, అన్ని కాలనీలు, కమ్యూనిటీ ప్రాంతాల్లో అమ్మేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. రోడ్లను పూర్తిగా మూసివేయరాదని, సరుకులు, పండ్లు వచ్చే వాహనాలు, హార్వెస్టర్ల వంటి యంత్రాలను రానివ్వాలన్నారు. రైస్ మిల్లర్లు కొంటామని గ్రామాలకు వస్తే రానివ్వాలని చెప్పారు. వారు కనీస మద్దతుధరతో కొంటామంటేనే రైతులు అమ్మాలని స్పష్టంచేశారు. సోమవారం రైస్‌మిల్లర్ల సమావేశం ఏర్పాటుచేశామని, వారికి విధివిధానాల ను వివరిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కో ఆర్డినేషన్ కమిటీలు వేసుకోవాలని సూచించామని, జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షుడిగా.. జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారి సభ్యులుగా ఉంటారని, గ్రామస్థాయిలో మండల అగ్రికల్చర్ అధికారి అధ్యక్షతన ప్రతి గ్రామానికి ఏఈఓ, రైతుబంధు సమితి, గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులతో కమిటీ వేసుకోవాలని సూచించారు.

### బయోమెట్రిక్ లేకుండానే జాగ్రత్తగా పంపిణీ

రేషన్‌లో దొంగతనం జరగొద్దని బయోమెట్రిక్ పెట్టామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఏ గ్రామ సర్పంచ్ ఆ గ్రామానికి కథానాయకులు కావాలని ఇటీవల తాను చెప్పానని గుర్తుచేశారు. ఈ సమయంలో కూడా రేషన్‌కు దొంగలు పడితే వారికి కూడా కరోనా తగులుతదన్నారు. అందుకే బయోమెట్రిక్ లేకుండానే పంపిణీచేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కర్ర పట్టుకుని కూర్చుంటే డీలర్ షాపుల్లో దొంగతనం జరుగకుండా చూసుకోవచ్చన్నారు. సర్పంచే ఆ ఊరుకు కథానాయకుడైతే ఈ చిల్లర దందాలుండవన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి

meesevasupport@telangana.gov.in

ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
వాట్సాప్: 9121006471 / 9121006472
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm


లాక్‌డౌన్-డే 7



# 11 మంది నేడు ఇంటికి

### ఇది మన రాష్ట్ర ప్రజలకు శుభవార్తే!

### వైద్యసిబ్బందికి ప్రత్యేక అభినందనలు.. ట్విట్టర్లో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19ను నిర్మూలించేందుకు ఇప్పటివరకు కచ్చితమైన మందుల్లేవు. కానీ, వైరస్ సోకిన బాధితుల్లో అనారోగ్య లక్షణాలను అంచనా వేసుకుంటూ.. సాధారణ మందులనే ఉపయోగిస్తూ గాంధీ దవాఖాన వైద్యులు ప్రాథమికదశలోనే వైరస్ నెగెటివ్ వచ్చేలా చికిత్స అందించారు. దవాఖానలో కరోనా వైరస్ బాధితులకు ఒక్కరోజే 11 మందికి నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని మంత్రి కే తారకరామారావు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'గాంధీ దవాఖాన ఐసొలేషన్ వార్డుల్లో చికిత్స పొందుతున్న 11మందికి కరోనా పాజిటివ్ నుంచి నెగెటివ్‌గా వచ్చింది.. వారికి కరోనా నుంచి విముక్తి లభించింది. ఇది రాష్ట్రానికి ఒకింత శుభవార్తే' అంటూ కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కరోనా బాధితుల చికిత్స కోసం కింగ్‌కోఠి దవాఖాన సిద్ధంగా ఉన్నదని కేటీఆర్ ట్వీట్ చేశారు. అధునాతన సౌకర్యాలతో ప్రత్యేకంగా 350 పడకలతో సిద్ధంచేశామని.. హైదరాబాద్‌లో మరో నాలుగు ప్రత్యేక దవాఖానలను కూడా పూర్తిగా కరోనా చికిత్స కోసమే సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. జీహెచ్ఎంసీలో 150 అన్నపూర్ణ సెంటర్ల ద్వారా ఉచితంగా మధ్యాహ్న, రాత్రి భోజనం అందిస్తున్నామని, శుక్రవారం మధ్యాహ్నం 30 వేల మీల్స్, రాత్రి 50 సెంటర్ల ద్వారా 7500 మీల్స్ అందించినట్టు ట్వీట్ చేశారు. తెలంగాణలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదని సీఎం కేసీఆర్ ఆదేశించారని, ఆహారం అందించడంలో సహకారం అందిస్తున్న అక్షయపాత్రకు ధన్యవాదాలు తెలిపారు.



**చిన్నారికి వ్యాక్సినేషన్..**

తన నెలన్నర పాపకు వ్యాక్సినేషన్ ఆపేశారని, మళ్లీ వ్యాక్సినేషన్ కొనసాగించాలని నర్సంపేటకు చెందిన వినిల్‌కుమార్ ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌ను కోరగా.. వెంటనే స్పందించిన ఆయన వ్యాక్సినేషన్ కొనసాగించేలా ఆదేశాలు జారీచేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తిచేశారు. మహారాష్ట్రకు కాలినడకన వెళ్తున్న వలసకూలీల ఆరోగ్యం, ఆహారం, వసతులపై మంత్రి సత్యవతి రాథోడ్ చూపిన చొరవను కొనియాడిన కేటీఆర్ 'మీ సింప్లిసిటీకి ధన్యవాదాలు' అంటూ ట్వీట్‌చేశారు. కార్మికుల సంక్షేమానికి జీహెచ్ఎంసీకి విరాళమిచ్చిన నిరంజన్‌రావును మంత్రి కేటీఆర్ అభినందించారు. జీహెచ్ఎంసీలోని పౌరులకు ఇంటి వద్దకే కూరగాయలు సరఫరా చేసేందుకు 145 మొబైల్ రైతుబజార్లను ప్రారంభించినట్టు ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తిపై కేటీఆర్ స్పందించారు. కావాల్సిన సహకారం అందించాలని ఖమ్మం కలెక్టర్‌కు సూచించారు.




ఆదివారం మహబూబాబాద్ శివారు అమన్‌గల్‌లో రోడ్డుపై కూర్చొని మహారాష్ట్ర వలస కూలీలతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్. (ఇన్‌సెట్) ఆమెను అభినందిస్తూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

# సీఎంఆర్‌ఎఫ్‌కు కోటి విరాళం

- ప్రకటించిన తెలంగాణ కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ల సంఘం
- పాఠశాలల భవనాలు కొవిడ్ క్వారంటైన్‌కు: ట్రస్మా
- పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్న పలువురు దాతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి పలు సంస్థలు, వ్యక్తులు తమవంతు ఆర్థిక సాయం ప్రకటిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కులు అందజేస్తున్నారు. స్థానికంగానూ పలువురు దాతలు నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.కోటి విరాళం అందజేయనున్నట్టు తెలంగాణ కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ విద్యాసాగర్‌రావు, ప్రధాన కార్యదర్శి నెహ్రూప్రసాద్ ప్రకటించారు. క్వారంటైన్ కేంద్రాలు, ఐసొలేషన్‌వార్డులుగా తమ పాఠశాలల భవనాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రకటించింది. ఆదివారం రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌ను కలిసిన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు వైశేఖర్‌రావు ఆధ్వర్యంలో కార్యవర్గసభ్యులు తెలిపారు. లాక్‌డౌన్ సందర్భంగా ఆకలితో అలమటిస్తున్న కూలీలు, వలస కార్మికులు, అన్నార్తులకు ఉచితంగా భోజనాలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. స్కూళ్లు, హాస్టళ్ల వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందజేయాలని వినోద్ వారికి సూచించారు. హెరిటేజ్ సంస్థ తరఫున తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.30 లక్షలు ఇవ్వనున్నట్టు ఎండీ నారా భువనేశ్వరి తెలిపారు.

- వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తన రెండునెలల వేతనం రూ.5.5 లక్షలతో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్ప్రే చేసే వాహనాల కొనుగోలుకు ఇచ్చారు.
- హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వీ నిరంజన్ జీహెచ్ఎంసీకి 5లక్షలు ఇచ్చారు.
- సీఎంఆర్‌ఎఫ్‌కు రంగారెడ్డి జిల్లా షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి రూ.2 లక్షలు అందజేశారు.
- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నిత్యం నగరంలో విధి నిర్వహణలో ఉన్న పోలీస్, వైద్య, జీహెచ్ఎంసీ, ఇతర అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్నవారికి నిత్యం 3వేల భోజనం ప్యాకెట్లు అందజేస్తున్నారు.
- టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ దవాఖానలో రోగుల సహాయకులకు అన్నదానం చేశారు.
- ఖైరతాబాద్‌కు చెందిన శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేశ్‌యాదవ్ ఆసరాలేని 200 మంది నిరుపేదలకు అల్పాహారం పంపిణీచేశారు.
- 100 మంది వలసకార్మికులకు చేనేత ఫౌండేషన్ అధ్యక్షుడు కేశబోయిన శ్రీధర్ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.



తమ ఒకరోజు మూలవేతనాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కు ఇచ్చే అంగీకార పత్రాన్ని మంత్రి హరీశ్‌రావుకు అందజేస్తున్న విద్యావలంటీర్ల సంఘం నాయకుడు

- హిమాయత్‌నగర్ టీఆర్ఎస్ నేత మహ్మద్ సర్ఫరాజ్ పేదలకు అన్నదానం చేశారు.
- మేడ్చల్ జిల్లా అధికారులు సుమారు 6,300 మంది వలస కార్మికులకు భోజనం, 1,700 మందికి బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. 300 మందికి ఆశ్రయం, 201 మందికి వైద్యసౌకర్యాలు కల్పించారు.
- నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సంగం గ్రామానికి చెందిన ఎన్నారై, టీఆర్ఎస్ ఆస్ట్రేలియా నేత కల్లూరి నరేశ్‌రెడ్డి ఇంటింటా సరుకులు పంచారు.
- జగిత్యాల జిల్లా కోరుట్ల 27వ వార్డుకు చెందిన వృద్ధదంపతులు గొల్లపల్లి గంగారాం, బుచ్చమ్మ.. 16 పేద కుటుంబాలకు రూ.1,500 చొప్పున సహాయంచేశారు.
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హన్మకొండలోని అమ్మ అనాథ, వృద్ధాశ్రమానికి రూ.50 వేల నగదు, క్వింటా బియ్యం పంపిణీ చేశారు.
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో రామగుండం సీపీ సత్యనారాయణ.. మంచిర్యాలలో 60 కుటుంబాలకు, మందమర్రిలో 250 మందికి 15 రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.
- పీఎం సహాయనిధికి ఎన్టీపీసీ ఉద్యోగుల ఒకరోజు వేతనం సుమారు 10 కోట్లు ఇవ్వనున్నట్టు ఎన్టీపీసీ ప్రాజెక్టులకు హెచ్చార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

## విద్యావలంటీర్ల ఒకరోజు జీతం

### మంత్రి హరీశ్‌రావుకు అంగీకారపత్రం

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో ప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు విద్యావలంటీర్లు ముందుకొచ్చారు. తమ ఒకరోజు మూలవేతనం రూ.60 లక్షలు సీఎంఆర్‌ఎఫ్‌కు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు అంగీకారపత్రాన్ని అందజేశారు. తమవంతు సాయంగా ఈ మొత్తాన్ని అందజేస్తున్నామని సంఘం అధ్యక్షుడు జోగినాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సత్యేందర్ తెలిపారు.

**పీఎం, సీఎం సహాయనిధికి ఐపీఎస్‌ల ఒక్కోరోజు వేతనం**

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం తమవంతు ఆర్థికసహాయం ప్రకటించింది. ప్రధానమంత్రి సహాయనిధి, ముఖ్యమంత్రి సహాయనిధికి ఒక్కోరోజు వేతనం ఇవ్వనున్నారు. తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ఈ విషయాన్ని ఆదివారం ట్విట్టర్‌లో వెల్లడించారు.

# అత్యవసర సేవకులకు జయహో

### విద్యుత్ సిబ్బందికి అభినందనలు: ఎంపీ సంతోష్‌కుమార్ ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాణాలను పణంగా పెట్టి అద్భుత సేవలందిస్తున్న వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులపై ప్రశంసలు కురుస్తున్నాయి. 'మీ సేవలు చిరకాలం చరిత్రలో నిలిచిపోతాయి. ప్రజలు అత్యవసర పరిస్థితులను గమనించి అవగాహనతో ఇంటికే పరిమితం కావాలి. స్టే హోం బీ సేఫ్. దేశంలో అత్యవసర సేవలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని రాజ్యసభ సభ్యుడు ఎంపీ సంతోష్‌కుమార్ ఆదివారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నిరంతర కరంటు సరఫరాకు కృషిచేస్తున్న విద్యుత్ సిబ్బంది, కార్మికులు, ఇంజినీర్లకు అభినందనలు తెలిపారు. 'ప్రజలందరూ ఇండ్లకే పరిమితమైన ఈ విపత్కర పరిస్థితుల్లో అంతరాయం లేకుండా 24 గంటలపాటు మనకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోతే.. నీరందక పంటలు ఎండి నష్టం జరిగేది. ఇంత వేసవికాలంలోనూ నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామంటే.. అది సీఎం కేసీఆర్ ప్రణాళిక వల్లే సాధ్యమైంది' అని ఎంపీ ట్వీట్‌చేశారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను కూడా పోస్ట్‌చేశారు.



## రాష్ట్రంలో 70కి పాజిటివ్‌లు

- 11 మందికి కరోనా నెగెటివ్‌గా నిర్ధారణ
- 58 మందికి కొనసాగుతున్న చికిత్స

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఆదివారానికి 70కి చేరినట్టు వైద్య విభాగాల ద్వారా తెలిసింది. ఇప్పటివరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో ఒకరు గతంలోనే డిశ్చార్జ్ కాగా, తాజాగా 11 మందికి కరోనా నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఐసొలేషన్‌లో ఉన్న ఈ 11 మందిలో ఇండోనేషియాకు చెందిన 9 మంది, రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉన్నారు. వీరిని సోమవారం డిశ్చార్జ్ చేయనున్నారు. మిగిలిన 58 మంది గాంధీ, ఛాతి దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు, 76 ఏండ్ల వృద్ధుడి పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నట్టు సమాచారం.

# మనం సైతం..

### కరోనా అంతానికి సాయంచేద్దాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ మహమ్మారిపై పోరాటానికి అందరం చేయిచేయి కలపాల్సిన తరుణం ఆసన్నమైంది. కరోనా వ్యాప్తి నియంత్రణ కోసం తెలంగాణ ప్రభుత్వం సమర్థవంతంగా చేపడుతున్న చర్యలకు మనవంతుగా సహకారం అందించాల్సిన సమయం వచ్చింది. ఆపత్కాలంలో అండగా నిలువాల్సిన సందర్భమిది. మేము సైతం అంటూ పలువురు సామాన్యులు కూడా 'నమస్తే తెలంగాణ' కార్యాలయానికి ఫోన్లు చేసి.. ప్రభుత్వానికి ఉడతా సాయంగా విరాళాలు ఎలా అందజేయాలని వివరాలు అడుగుతున్నారు. చలో ఇక స్వచ్ఛందంగా కదులుదాం.. కరోనాపై పోరాటానికి చేయూతనిద్దాం. ప్రజల నుంచి వచ్చే విరాళాలపై సెక్షన్80జీ కింద ఆదాయం పన్ను మినహాయింపు కూడా లభిస్తున్నది.

**విరాళాలు అందజేయాలనుకొనేవారు ఈ బ్యాంకు ఖాతాలో జమచేయవచ్చు.** https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

**బ్యాంకు, ఖాతా వివరాలు..**

సీఎం రిలీఫ్ ఫండ్, తెలంగాణ రాష్ట్రం
**ఖాతా నంబర్: 62354157651,** ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
**కరెంట్ అకౌంట్:** ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.

హెల్ప్ డెస్క్
ఈమెయిల్ ఐడీ : meesevasupport@telangana.gov.in
వాట్సాప్ : 9121006471 / 9121006472


## నిమ్స్‌లో వెంటిలేటర్లకు మేఘా విరాళం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) దవాఖానలో వెంటిలేటర్లను ఏర్పాటుచేసేందుకు మేఘా ఇంజినీరింగ్ సంస్థ రూ.41.95 లక్షల విరాళం అందించింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) పేరిట రూ.41.95 లక్షల చెక్‌తోపాటు లేఖను ఆ సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి నిమ్స్ డైరెక్టర్ మనోహర్‌కు ఆదివారం పంపించారు. నిమ్స్‌లో అత్యవసర చికిత్స పొందే రోగులకు అవసరమైన వెంటిలేటర్ల ఏర్పాటుకు ఈ మొత్తాన్ని వినియోగించాల్సిందిగా పేర్కొన్నారు.

# బలహీన కోరల కరోనా!

- భారత్‌లో రూపం మారిన కొవిడ్-19
- వైరస్ కొమ్ములు చైనాలో ఉన్నంత బలంగా లేవు
- ఆందోళన వద్దు.. మానసికంగా దృఢంగా ఉండాలి
- 'నమస్తే తెలంగాణ'తో గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

**డాక్టర్ మాట**



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** చైనాలో పుట్టి ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కొవిడ్-19కు.. భారత్‌లో వైరస్‌కు రూపంలో తేడా ఉన్నదని, ఇక్కడ దాని కోరలు బలహీనంగా ఉన్నట్టు కనిపిస్తున్నదని ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. మన దగ్గర దానితీవ్రత తక్కువేనని, చైనా, అమెరికా, ఇటలీ, లండన్, ఇరాన్, స్పెయిన్‌దేశాల్లో అంతవేగంగా వ్యాప్తిలేదని అన్నారు. ఈ వైరస్ నిర్మూలనకు ఇప్పటికైతే వ్యాక్సిన్ లేదని, ఏదో జరిగిపోతుందన్న ఆందోళన వద్దని, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. ముందుజాగ్రత్తలు తీసుకొంటూ నిర్ణీతదూరం పాటిస్తూ సంతోషంగా గడపడమే కరోనా కట్టడికి చక్కటిమార్గమని చెప్పారు. కరోనా వ్యాప్తి కట్టడికి ప్రభుత్వం చర్యలు బాగున్నాయని, ప్రజలు కూడా అందుకు సహకరించాలని కోరారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**కరోనా ప్రభావం భారత్‌లో ఎలా ఉండనున్నది?**

భారత్‌పై కరోనా అంత ప్రభావం చూపకపోవచ్చు. మన ఆహార అలవాట్లు, భౌగోళిక పరిస్థితులు కూడా ఇందుకు కారణం. వైరస్ సోకినవారు చాలామంది కోలుకుంటున్నారు. దేశంలో కరోనావ్యాప్తి రెండోదశలోనే ఉన్నది. విదేశాల నుంచి వచ్చినవారికే పరిమితమైన వ్యాధి వారితో కాంటాక్ట్‌లో ఉన్నవారికి వ్యాపిస్తున్నది. తర్వాతి దశలో విశ్వమారిగా మారుతుంది. కానీ, మనదగ్గర అంత తీవ్ర పరిస్థితులు వచ్చే అవకాశం లేదని భావిస్తున్నాను.

**ఇక్కడ తీవ్రత లేకపోవడానికి కారణం?**

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకున్న ముందుజాగ్రత్త చర్యలు మంచి ఫలితాన్నిస్తున్నాయి. లాక్‌డౌన్ ప్రకటించడం, వైద్యసదుపాయాలను పెంచడం, నిర్ణీతదూరం పాటించేలా ప్రభుత్వ యంత్రాంగం మంచి అవగాహన కల్పిస్తున్నది. దవాఖానల్లోనూ ఆధునిక చికిత్సవిధానంలో రోగులు కోలుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. గాంధీలో సేవలను ప్రత్యక్షంగా గమనించా. వైరస్ సోకిన వారు ఆరోగ్యంగా ఉన్నారు. కొందరు కోలుకొని డిశ్చార్జి కావడం చూస్తున్నాం. మనదేశంలో రెండుశాతంలోపే మరణాలరేటు ఉన్నది. కరోనా మింగేస్తుందన్న ఆందోళన అనవసరం. అదే సమయంలో ఏమీకాదులే అన్న నిర్లక్ష్యం సహించరానిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గైడ్‌లైన్స్‌ను పాటించాలి.

**చైనాలో పుట్టిన కోవిడ్-19కు భారత్‌లో వ్యాపిస్తున్న వైరస్ ఒక్కటేనా?**

ఈ వైరస్ ఒకే జాతి అయినా జన్యుక్రమంలో కొంతమార్పు కనిపిస్తున్నది. చైనాలో ఊపిరిపోసుకున్న వైరస్‌కు కొమ్ములున్నాయి. అవి ఊపిరితిత్తుల్లోని కణాలను పట్టుకుని బలమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. కానీ, మనదేశంలో వ్యాపిస్తున్న వైరస్‌కు కొమ్ములు చాలా బలహీనంగా ఉన్నాయి. అవి ఊపిరితిత్తుల కణాలను అటాచ్ అయ్యేంత పరిస్థితి లేదు. ఇది ఒకమంచి పరిణామంగా భావించవచ్చు. అమెరికాతోపాటు పలు అంతర్జాతీయ వైరాలజీ ల్యాబ్‌లలో జరిపిన ప్రాథమిక పరిశీలనలో ఇది తేలింది. దీనిపై పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, సీసీఎంబీ కూడా పరిశోధనలు చేయనున్నది. పైగా 35 డిగ్రీలకుపైగా ఎండఉంటే వైరస్ మనుగడ కష్టమని ప్రాథమిక పరిశీలనలో తెలుస్తున్నది. ఇది ఇంకా నిర్ధారణ కాలేదు.

**కరోనా రాకముందే మేలుకోవచ్చా.. ఏ ఏ ఆహారం తీసుకోవాలి. మందులున్నాయా?**

కరోనా రాకముందే మేలుకోవడమంటే నిర్ణీత దూరంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం. వ్యాధి నిరోధకశక్తిని పెంచుకోవడం అవసరం. ఇప్పటివరకు వైరస్‌ను నేరుగా చంపే వ్యాక్సిన్లు లేవు. కానీ కొన్ని మందులను వాడటం వల్ల కరోనాను కట్టడి చేయవచ్చు. హైడ్రాక్సీ క్లోరోక్విన్, ఎరిత్రోమైసిన్‌తోకలిపి ఇస్తే కొంతవరకు వ్యాధిని నిరోధించగలుగుతున్నట్టు విదేశాల్లో జరిగిన పరిశీలనలో వెల్లడైంది. ఐసీఎంఆర్, ప్రపంచ ఆరోగ్యసంస్థ వీటిని సిఫారసు చేస్తున్నాయి. ఏ వయస్సువారైనా వ్యాధినిరోధకశక్తి ఉంటే వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు. కరోనా వస్తుందని వ్యాధినిరోధకశక్తిని తక్షణం పెంచుకోవడం సాధ్యం కాదు. అలాంటివారు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం మంచిది. లాక్‌డౌన్ ఉన్నా విధులను నిర్వర్తించడం తప్పని వారు డాక్టర్ల సూచనమేరకు పాఫిలాక్సిన్, విటమిన్-సీ, జింక్ ట్యాబ్లెట్లను వాడవచ్చు. మరోవైపు పౌష్టికాహారం తీసుకుంటూ సంత్రాలు, జామ, దానిమ్మ పండ్లవంటివాటితో పాటు గుడ్డు, చికెన్, మటన్ తినవచ్చు.

**వైరస్ పుట్టుకకు ప్రధాన కారణమేమిటి?**

కారణమిది అని చెప్పకపోయినా కొన్ని జంతువులను తినడం వల్ల ఇది సోకిందని భావిస్తున్నారు. ప్రధానంగా అనేక వైరస్‌లకు కారణమవుతున్న గబ్బిలాలను ఆహారంగా తీసుకోవడం, ప్రకృతి ధర్మాన్ని పాటించకపోవడం వల్ల జంతువుల్లో ఉన్న వైరస్ మనుషుల్లోకి వ్యాప్తిచెందిందని నా భావన. గతంలో చైనాలోనే సార్స్ వంటి వైరస్ పుట్టింది. అవీ కరోనా లక్షణాలను కలిగిఉన్నప్పటికీ ఇప్పటి వైరస్ చాలా తీవ్రంగా ఉండటంతో ప్రపంచం కల్లోలానికి గురవుతున్నది.

# వలస కార్మికులకు ఉచిత భోజనం

- నిరాశ్రయులు, నడుచుకుంటూ సొంతూళ్లకు వెళ్లేవారికీ ఏర్పాట్లు
- సీఎం కేసీఆర్ ఆదేశంతో పురపాలకశాఖ నిర్ణయం
- ఔటర్, ఇన్నర్‌రింగ్ రోడ్లు కలిసేచోట క్యాంపులు



ఆదివారం ఉప్పల్‌లో అన్నపూర్ణ క్యాంటీన్ ద్వారా భోజనం చేస్తున్న ప్రజలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రంలో వలస కార్మికులు, నిరాశ్రయులు, నడుచుకుంటూ వెళ్లేవారికి ఉచిత భోజన సదుపాయం కల్పించాలని పురపాలకశాఖ నిర్ణయించింది. ఆకలితో ఏ ఒక్కరూ అలమటించకూడదన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పురపాలకశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ ఆదివారం ఆదేశాలు జారీచేశారు. హైదరాబాద్ శివారులోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్ వంటి కార్పొరేషన్లలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా ఉచితంగా ఆహారాన్ని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఇందుకోసం హరేకృష్ణ చారిటబుల్ ఫౌండేషన్‌ను సంప్రదించి.. ప్రతి కార్పొరేషన్‌లో ఒకట్రెండు ఎన్జీవోల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని స్పష్టంచేశారు. రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్తున్న దినసరి కూలీలు, ఇతర ప్రజల కోసం ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లు కలిసే చోట ప్రత్యేకంగా క్యాంపులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. భోజనం, తాగునీరు, మందులు వంటివి సమకూర్చాలని, 24 గంటలు ప్రాధాన్యతాక్రమంలో ఈ పనిని చేపట్టాలని స్పష్టంచేశారు.

# హోం క్వారంటైన్ వ్యర్థాలతో జాగ్రత్త

- ఆ ఇండ్ల చెత్తను పూర్తిగా దహనంచేయండి
- మున్సిపల్ కమిషనర్లకు పురపాలకశాఖ ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్వారంటైన్ గృహాల నుంచి సేకరించే చెత్తను పూర్తిగా కాల్చడం లేదా పూడ్చడం చేయాలని పురపాలకశాఖ ఆయా మున్సిపాలిటీలను ఆదేశించింది. ఈ విషయంలో ఎవరైనా అజాగ్రత్తగా ఉంటే కఠిన చర్యలుంటాయని ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ మున్సిపల్ కమిషనర్లను హెచ్చరించారు. ప్రతి ఇంటా వ్యర్థాలతోపాటు సేకరించే మాస్కులు, గ్లవ్స్ ప్రమాదకరమైనవిగా భావించాలని తెలిపారు. ప్రజలు వీటిని పేపర్‌లో చుట్టి ఇవ్వాలని కోరారు. వీటిని సాధారణ చెత్తతో కలుపకూడదని కోరారు. క్వారంటైన్ ఇండ్లకు ప్రత్యేకంగా అందజేస్తున్న పసుపు పచ్చరంగు సంచుల్లోనే తడి, పొడి చెత్తను వేసేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీలు ఈ చెత్తను బయోమెడికల్ వ్యర్థాలుగా పరిగణించాలని ఆ శాఖ డైరెక్టర్ ఆదేశించారు. ఇతర గృహాల నుంచి సేకరించే వ్యర్థాలతో వీటిని కలుపకూడదని, ఇందుకోసం ప్రత్యేక వాహనాలను వినియోగిస్తే ఉత్తమమని తెలిపారు. క్వారంటైన్ గృహాల వద్ద పనిచేసే మున్సిపల్ సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్కులు, శానిటైజర్ల వాడకం పెరిగిందని, పట్టణాల్లో స్వయం సహాయ బృందాలు మాస్కులు, శానిటైజర్ల తయారీపై దృష్టి సారించేలా చూడాలని కమిషనర్లకు చెప్పారు. అవసరమైతే వీటిని మున్సిపాలిటీయే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కాగా, పట్టణాల్లోని బహిరంగ ప్రదేశాల శానిటైజేషన్‌పై కమిషనర్లు దృష్టిపెట్టారు. వాణిజ్య సముదాయాలు, పార్కులు, గార్డెన్లు ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయిస్తున్నారు.




తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, I & CADD శాఖ, సిద్దిపేట**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ T.N. నం. 01నుండి 04/2019-20,** **తేది: 27-03-2020**

పనుల సంఖ్య (04), పనుల పేరు: కాళేశ్వరం ప్రాజెక్ట్ - లింక్- IV- ప్యారలెల్ కన్వేయర్ సిస్టమ్ - ప్యాకేజ్ నం. 1 నుండి 4- దిగువ సంతకందారు పరిధిలో సివిల్ మరియు EM & HM పనుల నిర్మాణంతో సహా మిడ్‌మానేరు రిజర్వాయర్ నుండి అనంతగిరి రిజర్వాయర్ వరకు 333 క్యూమెక్స్ నీటిని ఎత్తిపోయుట, అనంతగిరి రిజర్వాయర్ నుండి చిన్నగుండవెల్లి (గ్రామం) వద్ద డెలివరీ సిస్టర్న్ వరకు 333 క్యూమెక్స్‌ల నీటిని ఎత్తిపోయుట మరియు ఇతర పనులు. ECV: ప్యాకేజ్ 1: రూ. 3286.77 కోట్లు, ప్యాకేజ్ 2: రూ. 6148.48 కోట్లు, ప్యాకేజ్ 3: రూ. 680.90 కోట్లు, ప్యాకేజ్ 4 రూ: 1594.55 కోట్లు, డౌన్‌లోడ్ కొరకు టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 03-04-2020, మ. 3.00 గం. నుండి 17-04-2020, మ. 3.00 గం., టెండరు దాఖలు తేది: 03-04-2020, మ. 3.00 గం. నుండి 17-04-2020, సా. 5.00 గం. వరకు. ప్రీ-బిడ్ సమావేశం: 09-04-2020 ఉ. 11.00 గం. నుండి, సాంకేతిక బిడ్ తెరచుట: 18-04-2020, ఉ|| 11.00 గం. ఇతర వివరాలకు దర్శించండి tender.telangana.gov.in

సం/- **సూపరింటెండింగ్ ఇంజనీర్, I & CADD శాఖ, (KPCC-1) సిద్దిపేట.**

**DIPR RO.No.2728 - DP/CL/Advt/1/2019-20 Dt: 28.03.2020**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TSSPDCL) | ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TSNPDCL)

**బహిరంగ ప్రకటన** తేది: 30.03.2020

వీలింగ్ చార్జీలు మరియు వీలింగ్ నష్టాలు (in kind),
2020 - 21 ఆర్థిక సంవత్సరం నకు

ఇందు మూలంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధి లోని విద్యుత్ వినియోగదారులకు తెలియ జేయునది ఏమనగా;

గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు తేది 27.03.2020 నందు I.A. No. 9 of 2020 in O. P. Nos. 09 & 10 of 2019 జారీ చేసిన ఆర్డర్ కు అనుగుణంగా ప్రస్తుతం అమలులో ఉన్న వీలింగ్ టారిఫ్‌లు మరియు వీలింగ్ నష్టాలు (in kind), అనగా, గౌరవనీయమైన తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ 3 వ నియంత్రణ కాలానికి పంపిణీ వ్యాపారం కోసం వీలింగ్ టారిఫ్ ఆర్డర్ తేదీ 27.03.2015 లో 2018-19 ఆర్థిక సంవత్సరానికి నిర్ణయించిన విధంగా వర్తించే వీలింగ్ టారిఫ్‌లు, వీలింగ్ నష్టాలు (in kind), 01.04.2020 తేదీ నుండి గౌరవనీయ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు నాల్గవ నియంత్రణ కాలానికి (FY 2019-20 to FY 2023-24) వీలింగ్ చార్జీలు మరియు వీలింగ్ నష్టాలు (in kind) జారీ చేయువరకు అమలులో కొనసాగుతాయి.

సం/-
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

సం/-
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

కరోనా వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదిమందిలో నలుగురు నిర్బంధంలో చిక్కుకున్నారు. ప్రస్తుతం దాదాపు 338 కోట్ల మంది ఇండ్లకే పరిమితమైనట్టు ఏఎఫ్‌పీ వార్తాసంస్థ తెలిపింది. ఇది ప్రపంచ జనాభాలో (779 కోట్లు) 43 శాతంగా వెల్లడించింది. దాదాపు 78 దేశాల్లో లాక్‌డౌన్ అమలువుతున్నట్టు చెప్పింది.

# హైదరాబాద్ వైద్యులు మంచోళ్లు

## తెలంగాణలో కరోనా నుంచి కోలుకున్న రామ్ గంపతేజ వెల్లడి

**ప్రధాని 'మన్‌కీబాత్'లో ప్రశంసలు ● శుభాకాంక్షలు తెలిపిన నరేంద్రమోదీ**

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ వైద్యులు తనను కంటికిరెప్పలా కాపాడారని తెలంగాణలో కరోనా తొలి బాధితుడు, వ్యాధి నుంచి కోలుకున్న ఐటీ ఉద్యోగి రామ్ గంపతేజ ఆనందం వ్యక్తంచేశారు. భయంతో ఉన్న తనకు అనుక్షణం ధైర్యం నూరిపోశారని చెప్పారు. గాంధీ దవాఖానలో మెరుగైన చికిత్స అందజేసి ఆరోగ్యవంతుడిగా మార్చారని తెలిపారు. వైద్యులు, నర్సులు ఎంతో మంచివాళ్లని ప్రశంసించారు. ఈ విషయాన్ని ఆదివారం ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో నరేంద్రమోదీ.. తెలంగాణలో కరోనా నుంచి కోలుకున్న సికింద్రాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగి రామ్ గంపతేజతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరోనా కట్టడికి కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని, లాక్‌డౌన్‌తో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నందుకు తనను క్షమించాలని విజ్ఞప్తిచేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎవ్వరూ లాక్‌డౌన్ 'లక్ష్మణ రేఖ'దాటొద్దని ప్రధాని మోదీ కోరారు.




### మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ, రామ్ గంపతేజ సంభాషణ

**ప్రధాని: మీరు ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డారు? మీ అనుభవాలను వినాలనుకుంటున్నాను.**

రామ్: సర్. నేను ఐటీరంగంలో పనిచేసే ఉద్యోగిని. విధి నిర్వహణలో భాగంగా దుబాయ్‌కి వెళ్లాల్సి వచ్చింది. తిరిగి రాగానే జ్వరం మొదలైంది. ఆ తర్వాత ఆరురోజులకు కరోనా పరీక్షలు జరిపి పాజిటివ్‌గా నిర్ధారించారు. వెంటనే నన్ను హైదరాబాద్ గాంధీ దవాఖానలో చేర్చారు. 14 రోజులకు నాకు నయమవడంతో డిశ్చార్జి అయ్యాను. ఇప్పుడు హోం క్వారంటైన్‌లో ఉన్నాను.

**ప్రధాని: వైరస్ సోకిన విషయం తెలియగానే మీకు ఏమనిపించింది?**

రామ్: ఒక్కసారిగా భయమేసింది. ముందు నమ్మలేకపోయాను. అప్పటివరకు దేశంలో ఇద్దరు ముగ్గురికే వ్యాధి సోకింది. గాంధీ దవాఖానలో చేరాక రెండు, మూడ్రోజులు కష్టంగా గడిచాయి. అక్కడి డాక్టర్లు, నర్సులు చాలా మంచివాళ్లు. నాకేం కాదన్న నమ్మకాన్ని కలిగించారు. త్వరగా కోలుకుంటారని ధైర్యమిచ్చారు. మొదట్లో భయమేసినా క్రమంగా నాకు తప్పనిసరిగా నయమవుతుందన్న నమ్మకం పెరిగింది.

**ప్రధాని: మీ కుటుంబసభ్యుల మానసిక స్థితి ఎలా ఉండేది?**

రామ్: దవాఖానలో చేరిన మొదట్లో ఎంతో ఆందోళనకు గురయ్యారు. మొదట్లో మీడియా కొంత సమస్యాత్మకంగా వ్యవహరించింది. మా కుటుంబసభ్యులందరికీ నెగెటివ్ వచ్చింది. ఇది ఎంతో ఊరటనిచ్చింది.

**ప్రధాని: మీరు స్వయంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకునేవారు. మీ కుటుంబసభ్యులు ఏయే జాగ్రత్తలు తీసుకున్నారు?**


రామ్: క్వారంటైన్ తర్వాత పూర్తిగా కోలుకోవడానికి 14రోజులు పడుతుందని, ఇంటి దగ్గరే గదిలో ఉండాలని చెప్పారు. కుటుంబసభ్యులను కూడా ఇంట్లోనే సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండాలన్నారు. తినడానికి బయటికి వచ్చే ముందు చేతులను శుభ్రంగా కడుక్కునేవాడ్ని.

**ప్రధాని: రామ్ మీరు కోలుకున్నారు. మీకు మీ కుటుంబసభ్యులకు ఎన్నెన్నో శుభాకాంక్షలు. మీరు ఐటీ ప్రొఫెషనల్‌గా ఉన్నారు కదా.. మీ అనుభవాన్ని ఆడియో తయారు చేసి ప్రజలతో పంచుకోండి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయండి. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా ఉంటారు. ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుస్తుంది.**

రామ్: అవును సార్. ప్రజలు క్వారంటైన్ అంటే జైలులా భావిస్తున్నారు. కానీ అదొక సురక్షిత ప్రదేశం. మన కోసమేనని అర్థం చేసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలు చాలా బాగున్నాయి. దేశ ప్రజలందరూ క్షేమంగా బయటపడుతారు.

**ప్రధాని: ఇది ఎంతో భయానక పరిస్థితి. ఎప్పుడు ఏమవుతున్నదో తెలియని స్థితి. ఈ వైపరీత్యం నుంచి దేశం బయటపడాలి.**

రామ్: ఏమీకాదు సార్. అంతా మంచే జరుగుతుంది.



## ఘోరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు!

*"బయో వార్ మిగిల్చే ఉత్పాతానికి సమానమైన నష్టాన్ని కరోనా సృష్టిస్తున్నది. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయి. భారత్‌లో కొనసాగుతున్న 21 రోజుల లాక్‌డౌన్ వల్ల దేశం ఆర్థికంగా రెండేండ్ల వెనక్కి పోగలదు. లాక్‌డౌన్ కొనసాగితే, దేశంలో ఘోరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు"*

*– కంగనా రనౌత్, బాలీవుడ్ నటి*

## అమెరికాలో 2 లక్షల మంది చనిపోవచ్చు!

*"కరోనా మహమ్మారి వల్ల అమెరికాలో లక్ష నుంచి రెండు లక్షల మంది చనిపోవచ్చు. దేశంలో వైరస్ దావాలనంగా వ్యాపిస్తున్నది, పది రోజుల కింద పది వేలుగా ఉన్న కరోనా కేసుల సంఖ్య ప్రస్తుతం 1.25 లక్షలకు, మరణాలు 2,500కు చేరాయి. వైరస్ వ్యాప్తి ఇలాగే కొనసాగితే కేసుల సంఖ్య పది లక్షలకుపైగా దాటుతుంది. అప్పుడు మరణాలు లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉండవచ్చు"*

*– ఆంథోని ఫౌసీ, ట్రంప్ పరిపాలనా విభాగంలో ఉన్నతాధికారి, అమెరికా జాతీయ అలర్జీ, అంటువ్యాధి రోగాల సంస్థ డైరెక్టర్ (సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు)*

## ఐఐటీ ఖరగ్‌పూర్ 'ఫేస్ షీల్డ్'

● ఆరోగ్య కార్యకర్తల కోసం రూపకల్పన



**కోల్‌కతా:** మహమ్మారి కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు పోరాటం చేస్తున్న ఆరోగ్య కార్యకర్తల ఆరోగ్యంపై ఐఐటీ ఖరగ్‌పూర్ పరిశోధకులు దృష్టిసారించారు. ఎల్లవేళలా కొవిడ్-19 రోగులను అంటిపెట్టుకొని సేవలందిస్తున్నవారికి కరోనా వైరస్ సోకకుండా ఉండేందుకు ఫేస్ షీల్డ్‌ను రూపొందించారు. ప్రొఫెసర్ సంతను ధారా, ప్రొఫెసర్ సంగీతాదాస్ భట్టాచార్యతో కలిసి ఇంటిలోనే ఫేస్ షీల్డ్ నమూనాకు రూపకల్పన చేశారు. ట్రాన్స్‌పరెన్సీ షీట్, స్పాంజ్, మడతల కాగితం, కార్డ్‌బోర్డు, రబ్బర్‌బ్యాండ్, డబుల్‌సైడ్ టేప్.. ఇలా ఇంట్లో దొరికే వస్తువులతో విజయవంతంగా ఫేస్ షీల్డ్‌ను రూపొందించారు. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ సైతం ప్రత్యేక ఫేస్ షీల్డ్‌లను తయారు చేయనున్నది. సోమవారం నుంచి వీటి తయారీని ప్రారంభిస్తున్నామని, రోజుకు 500 యూనిట్లు ఉత్పత్తి చేస్తామని మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఎండీ పవన్ గోయెంకా ట్విట్టర్ ద్వారా తెలిపారు.

## కరోనాకు యువరాణి బలి



**మాడ్రిడ్:** కరోనా విశ్వమారికి స్పెయిన్ యువ రాణి మరియా థెరీసా బలయ్యారు. ఆమె వయసు 86 ఏండ్లు. ఆమెకు ఇటీవలే కరోనా వైరస్ సోకింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఆమె సోదరుడు, ప్రిన్స్ ఎన్రిక్ ఆదివారం ప్రకటించారు. మరియా శుక్రవారమే మరణించినట్టు సమాచారం. రాజకుటుంబానికి చెందిన వ్యక్తి కరోనా వల్ల మరణించడం ఇదే తొలిసారి.

## జర్మనీలో మంత్రి ఆత్మహత్య

**ఫ్రాంక్‌ఫర్ట్:** కరోనా మహమ్మారి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుండటం తట్టుకోలేక జర్మనీలోని హెస్సే రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి థామస్ షాఫర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని శనివారం రైల్వే ట్రాక్‌కు సమీపంలో కనుగొన్నామని పోలీసులు తెలిపారు. ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం ఎలా? అన్న ఆవేదనతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని చెప్పారు. థామస్ షాఫర్ పదేండ్లుగా రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పనిచేస్తున్నారు.

## పరిస్థితులు దిగజారొచ్చు

● ప్రజలకు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ హెచ్చరిక


బోరిస్ జాన్సన్

**లండన్:** విశ్వమారి కరోనాతో బ్రిటన్ అల్లాడుతున్నది. దేశంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈక్రమంలో కరోనా వల్ల రానున్న కాలంలో పరిస్థితులు మరింతగా దిగజారనున్నాయని ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రజల్ని హెచ్చరించారు. ప్రజలెవ్వరూ ఇండ్ల నుంచి బయటకు రావొద్దని, ప్రభుత్వ ఆదేశాల్ని పాటిస్తూ తమ ప్రాణాల్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన దేశ ప్రజలకు లేఖల్ని రాశారు. పరిస్థితులు అనుకూలించక ముందే, పరిస్థితులు రాను రాను మరింత దిగజారి పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ప్రభుత్వం కావాల్సిన జాగ్రత్తలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వాధికారుల సలహాలు, సూచనల్ని ప్రజలు పాటించాలని కోరిన ఆయన.. త్వరలోనే దేశంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆకాంక్షించారు. తమ ప్రాణాల్ని లెక్కచేయకుండా రోగులకు సేవలందిస్తున్న వైద్యుల్ని ప్రశంసించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలు బయటకు వచ్చి ప్రమాదంలో పడవద్దని, ప్రాణాల్ని కాపాడుకోవాలని సూచించారు. కరోనా పాజిటివ్ రావడంతో స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయిన ప్రధాని బోరిస్.. వీడియో కాన్ఫరెన్సుల ద్వారా అధికారులతో పరిస్థితుల్ని సమీక్షిస్తున్నారు. కాగా బ్రిటన్‌లో శనివారంనాటికి 17వేలకు పైగా కరోనా కేసులు నమోదవ్వగా, వెయ్యి మందికి పైగా చనిపోయారు.

## కరోనా.. ఒక చిన్న ఫ్లూ

● బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సనారో



**బ్రసిలియా:** కరోనా విశ్వమారి ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నా.. బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సనారో బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. కరోనాను 'చిన్న ఫ్లూ'గా అభివర్ణించారు. దానికి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా బ్రెజిల్ ఆర్థిక రాజధాని సావోపోలో రాష్ట్రంలో కేసులు, మృతుల సంఖ్య పెరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోకపోవడంపై వస్తున్న విమర్శలపైనా వ్యగ్యంగా స్పందించారు. 'నన్ను క్షమించండి. కొందరు చనిపోతారు. అది జీవితం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కార్ల తయారీ ఫ్యాక్టరీని మూయలేం' అని పేర్కొన్నారు. అంతేకాకుండా దేశంలో విస్తరిస్తున్న కరోనాను రాజకీయాలకు ఒక సాధనంగా వాడుకోవడంపై బోల్సనారో అసంతృప్తి వ్యక్తం చేశారు. సావోపోలోలో వైరస్ తీవ్రత అధికంగా ఉన్నా, సంఖ్యను తక్కువగా చూపిస్తున్నారని ఆ రాష్ట్ర గవర్నర్ జోవో డోరియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పీఎం కేర్స్‌కు విరాళాల వెల్లువ!

**న్యూఢిల్లీ:** కరోనాపై పోరుకు ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళాలు వెల్లువెత్తాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన నెల వేతనం రూ.5 లక్షలు విరాళంగా ఇవ్వగా, దేశానికి స్ఫూర్తినిచ్చారంటూ ప్రధాని మోదీ ఆయన్ను ప్రశంసించారు. ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు తన నెల వేతనం రూ.4 లక్షలు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తన నెల వేతనం రూ.1.27లక్షలు, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్‌గడ్కరీ, పీయూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జవదేకర్, కిరెన్ రిజిజు, సంతోష్ గంగ్వార్ తదితరులు సైతం తమ నెల వేతనాన్ని విరాళంగా ఇస్తామన్నారు. భారతీయ రైల్వే రూ.151 కోట్ల విరాళం ప్రకటించింది. రక్షణశాఖ సిబ్బందితో పాటు త్రివిధ దళాల జవాన్లు ఒకరోజు వేతనం సుమారు రూ.500 కోట్లు అందజేయనున్నారు. సీబీఎస్‌ఈ తమ ఉద్యోగుల నుంచి రూ.21 లక్షలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్) జవాన్ల ఒకరోజు వేతనం రూ. 116 కోట్లు విరాళంగా అందజేశాయి.

## మటన్ కిలో 800.. చికెన్ 180

● రాష్ట్రంలో పెరుగుతున్న మాంసం ధరలు
● దుకాణాల ఎదుట వినియోగదారుల బారులు


ఆదివారం రామ్‌నగర్‌లోని ఒక మాంసం దుకాణం వద్ద బారులు తీరిన జనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాంసం ధరలు భారీగా పెరిగాయి. మటన్ గతంలో ఎన్నడూ లేనంతగా కిలో రూ.800కు చేరుకొన్నది. బోన్‌లెస్ మటన్ కిలో రూ.950 నుంచి రూ.1000 పలుకుతున్నది. నెల రోజులుగా తగ్గుతూ వస్తున్న చికెన్ ధర కూడా ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.180, డ్రెస్డ్ రూ.155, లైవ్ రూ.105గా ఉన్నది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చికెన్ కిలో రూ.200 వరకు విక్రయించారు. ఆదివారం కావడంతో మాంసం దుకాణాల ఎదుట జనం బారులు తీరి కనిపించారు. చికెన్, గుడ్లు తింటే కరోనా వైరస్ వ్యాపిస్తుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. కిలో చికెన్ రూ.20-40కి చేరింది. కొన్ని ప్రాంతాల్లోనైతే కోళ్లను ఉచితంగా పంచిపెట్టారు. మరికొన్ని చోట్ల ఉచితంగా ఇచ్చినా తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని పాతిపెట్టారు. కరోనా దెబ్బతో రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమ సుమారు రూ.1500 కోట్ల మేర నష్టపోయింది. చికెన్, గుడ్లు పోషకాహారం అని, వీటిని తినడం వల్ల రోగనిరోధకత పెరుగుతుందని పరిశ్రమవర్గాలు చేసిన ప్రచారం, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనతో చికెన్‌కు మళ్లీ పాత రోజులు వచ్చాయి. ఈ నేపథ్యంలో మటన్‌కు డిమాండ్ మరింత పెరిగిది. కిలో రూ.800కు అమ్ముతున్నా మాంసం ప్రియులు వెనుకాడటం లేదు. అలాగే చేపలు, రొయ్యల ధరలు కూడా పెరిగినట్టు తెలిసింది. సరఫరా తగ్గడంతో చికెన్, గుడ్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెప్తున్నారు.

## ప్రతిగింజ కొనుగోలు చేయాలి

● గ్రామాల్లో అన్ని ఏర్పాట్లుచేయండి
● వలసకార్మికులకు 12కిలోల బియ్యం, రూ.500
● లాక్‌డౌన్ పక్కాగా అమలుచేయాలి
● కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్


ఆదివారం ప్రగతిభవన్ నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులెవరూ ధాన్యం విక్రయించేందుకు పట్టణాలకు రావొద్దు.. గ్రామాల్లోనే పంటమొత్తాన్ని కొనుగోలుచేసేలా ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం ప్రగతిభవన్ నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతరఅధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రైతుబంధుసమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శాంతికుమారి, వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాక్‌డౌన్ అమలవుతున్నతీరు, ప్రజలకు నిత్యావసరసరుకుల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా తీసుకోవాల్సినచర్యలను వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం ఏప్రిల్7వ తేదీ నాటికి రాష్ట్రంలో కరోనా లేకుండా పోతుందని.. అయినప్పటికీ ఏప్రిల్14 వరకు లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలుచేయాలని సూచించారు. పంటకోత నుంచి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. గ్రామాల్లో రైతులకు యాసంగి పంట చేతికొస్తుందని, వారి పనులకు ఆటంకం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయమార్కెట్లను బంద్ పెడుతున్న నేపథ్యంలో రైతులెవరూ ధాన్యం తీసుకురాకుండా చూడాలని.. వారి ప్రతిగింజను కొనుగోలు చేసేలా చూడాలని కేసీఆర్ ఆదేశించారు.

## కదిలితే కష్టమే

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ పోలీసులు అందిపుచ్చుకొన్నారు. హోం క్వారంటైన్ ముద్ర చేతిపై ఉన్నా.. బయటకు కనిపించకుండా తిరుగుతుండటంతో వారిని గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది. ఇలాంటివారిపై కన్నేసిన పోలీసులు ఇకపై వారు ఇంటి నుంచి బయటికు కాలు కదిపినా తెలిసేలా క్వారంటైన్ అయిన 22 వేల మందికిపైగా ఇండ్లను జియో ట్యాగింగ్ చేశారు. వీటి వివరాలను టీఎస్ కాప్ యాప్‌తో జతచేశారు. గస్తీ విధుల్లోని పోలీసులు హోం క్వారంటైన్ వారి ఇండ్లను పరిశీలించే సమయంలో పోలీసుల కండ్లు గప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇకపై ఇలా జరుగకుండా ఉండేందుకు హోం క్వారంటైన్ అయిన వ్యక్తి మొబైల్ ఫోన్‌లో ప్రత్యేక యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి వారు ఎక్కడున్నదీ సులభంగా తెలుసుకోనున్నారు. నిబంధనలు అతిక్రమించి హోం క్వారంటైన్ నుంచి బయటకు వచ్చినవారిపై ఐపీసీ సెక్షన్ 188, 269, 270, 271 కింద కేసులు నమోదుచేస్తున్నారు. ఈ సెక్షన్ల కింద ఆరు నుంచి రెండేండ్ల వరకు జైలుశిక్ష విధించే వీలున్నది.

## కరోనా పోరులో కలిసిరండి

● కాలనీలు, అపార్ట్‌మెంట్ సొసైటీలకు డీజీపీ విజ్ఞప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనాపై పోరులో తెలంగాణ పోలీసులతో అంతా కలిసి పనిచేయాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా పిలుపునిచ్చారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్ సంఘాలకు ఇద్దరు సభ్యుల చొప్పున జట్టుని ఏర్పాటుచేసుకొని నిఘా పెట్టాలని సూచించారు. ఎవరైనా జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో ఇబ్బందిపడుతున్న విషయాలను తెలుసుకొని.. అలాంటివారు ఉన్నట్టు తేలితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లోగానీ, డయల్ 100కుగానీ సమాచారమివ్వాలని కోరారు. అత్యవసర పనులపై కాకుండా అనవసరంగా బయటికి వచ్చేవారిని కట్టడిచేసి పోలీసులతో సహకరించాలన్నారు.

## ఆరోగ్య సిబ్బందికి బీమా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనాపై పోరాడుతున్న వైద్యసిబ్బంది, ఇతర సహాయకులకు కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యబీమా ప్రకటించింది. దీని నిబంధనలను కేంద్రం ఆదివారం విడుదల చేసింది. వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, పారా మెడికల్ సిబ్బందికి ఈ బీమా వర్తించనున్నది. 90 రోజుల పాటు అమలులో ఉండే ఈ బీమా కింద రూ.50 లక్షలు అందజేయనున్నట్టు పేర్కొన్నది.

## కరెన్సీతో వైరస్ వ్యాపిస్తుందా?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరెన్సీ నోట్ల ద్వారా కరోనా వస్తుందా? ఇప్పుడు చాలా మందిలో మెదులుతున్న ప్రశ్న ఇది. నోట్లను రద్దుచేసి వాటిస్థానంలో పాలిమర్ నోట్లను తేవాలని అఖిల భారత వాణిజ్యవేత్తల సమాఖ్య ఇటీవల ప్రధానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో కరెన్సీ నోట్ల ద్వారా వైరస్ సోకుతుందని ఎక్కడా ప్రకటించలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి ఫడేలా చయిబ్ స్పష్టత ఇచ్చారు. వస్తువులపై వైరస్ జీవితకాలం వేర్వేరుగా ఉండే అవకాశమున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కరెన్సీ నోట్లను వాడే సమయాల్లో కూడా చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు.

## లాక్‌డౌన్ సక్సెస్

● సామాజిక చైతన్యంతో సత్ఫలితం
● గత 8 రోజుల్లో తీవ్రత తగ్గుముఖం
● ఇదేస్ఫూర్తి ప్రదర్శిస్తే గట్టెక్కినట్టే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌వ్యాప్తికి భారత్ లాక్'డౌన్'తో కళ్లెంవేసింది. ముందస్తు అప్రమత్తతకు ప్రజల సహకారం తోడవడంతో విశ్వమారి దూకుడును అడ్డుకోగలిగింది. ఎనిమిది రోజులుగా దేశవ్యాప్తంగా స్వల్పంగా నమోదవుతున్న కేసుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. దేశవ్యాప్త లాక్‌డౌన్‌తో సత్ఫలితాలు వస్తున్నాయి. మరికొన్ని రోజులు ఇదే స్ఫూర్తిని ప్రదర్శిస్తే కరోనాను పూర్తిగా నియంత్రించవచ్చు. ఇతర దేశాల అనుభవాలు, నిపుణుల సూచనలతో మన దేశంలో వైరస్ ప్రభావం గణనీయంగా తగ్గింది. కొవిడ్-19 పుట్టినిల్లయిన చైనాలో మొదటి కేసు ఈ ఏడాది జనవరి 22న నమోదైంది. ఒకేరోజు 571 కేసులు నమోదైనట్టు రికార్డులు చెప్తున్నాయి. ఫిబ్రవరి 15 వరకు 68,500, మార్చి 28 నాటికి ఆ సంఖ్య 81,439 కు చేరింది. ఇక, అమెరికాలో ఫిబ్రవరి 15న 15 కేసులతో ప్రారంభమైన ఈ మహమ్మారి వీరంగం.. మార్చి 28 నాటికి 1,23,578 కు చేరింది. ఇటలీలో ఫిబ్రవరి 15న మూడు కేసులు నమోదు కాగా.. మార్చి 28నాటికి 92,472కు చేరింది. స్పెయిన్‌లో ఫిబ్రవరి 15న రెండు కేసులే. మార్చి 28 నాటికి వాటిసంఖ్య 73,235కు చేరింది. ఫ్రాన్స్‌లో ఫిబ్రవరి 15న 12 కేసులు. మార్చి 28న 37,575 కేసులు. లండన్‌లో తొమ్మిది కేసులతో మొదలై ప్రస్తుతం 17,089 కేసులకు చేరుకున్నది.

**ఫిబ్రవరిలో మూడు కేసులే..**

భారత్‌లో జనవరి 30న తొలి కేసు నమోదవగా.. ఫిబ్రవరి 2,3 తేదీల్లో ఒకటి చొప్పున పెరిగాయి. తిరిగి నెల తర్వాత మార్చి 2న రెండు కేసులు, 3న మరో కేసు వచ్చింది. మార్చి నాలుగున ఒకేరోజు 28 కేసులు నమోదయ్యాయి. క్రమంగా కేసుల సంఖ్య పెరిగి మార్చి 28 నాటికి 1,053కు చేరింది. ఇతర దేశాలతో పోలిస్తే.. భారత్‌లో కరోనాను చాలావరకు నియంత్రించినట్టు కనిపిస్తున్నది.

**లాక్‌డౌన్ మొదలైన నాటినుంచి దేశంలో కరోనా కేసులు**


| తేదీ | కేసులు | పెరుగుదల (శాతం) |
|---|---|---|
| మార్చి 21 | 283 | -- |
| మార్చి 22 | 396 | 113 (39.92) |
| మార్చి 23 | 468 | 72 (18.18) |
| మార్చి 24 | 566 | 98 (20.94) |
| మార్చి 25 | 645 | 79 (13.95) |
| మార్చి 26 | 720 | 75 (11.62) |
| మార్చి 27 | 886 | 166 (23.05) |
| మార్చి 28 | 933 | 47 (5.30) |





## కనిక పరిస్థితి విషమం!

**లక్నో:** బాలీవుడ్ సింగర్ కనిక కపూర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. నాలుగోసారి నిర్వహించిన పరీక్షల్లోనూ ఆమెకు కరోనా పాజిటివ్ వచ్చినట్టు వైద్యులు తెలిపారు. దీనిని బట్టి కనిక శరీరం చికిత్సకు ప్రతిస్పందించడం లేదని అనిపిస్తున్నదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మెరుగైన చికిత్స కోసం ఎయిర్ అంబులెన్స్‌లో తరలించాలని భావించినా.. లాక్‌డౌన్ వల్ల సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదన్నారు. అయితే కనిక పరిస్థితి నిలకడగానే ఉన్నదని ఆమెకు చికిత్స అందిస్తున్న వైద్యులు చెప్తున్నారు.



## తొలి రోగి గుర్తింపు

**బీజింగ్/లండన్:** కరోనా వైరస్ మొట్టమొదట ఎవరికి సోకిందన్న విషయం బయటపడింది. చైనాలోని వుహాన్‌లో ఉన్న హువనాన్ చేపల మార్కెట్‌లో 'వ్యూ గ్యూజియాన్' (57) అనే మహిళకు తొలుత ఈ వైరస్ సోకింది. చేపలు విక్రయించే ఆమె గతేడాది డిసెంబర్ 10న తీవ్ర జలుబుతో బాధపడుతూ దవాఖానకు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు సాధారణ జలుబుగా భావించి ఓ ఇంజక్షన్ ఇచ్చి పంపించారు. అయితే ఆ తర్వాత ఆమె ఆరోగ్యం క్షీణించడంతో మరో దవాఖానకు వెళ్లారు. అక్కడా తగ్గక పోవడంతో వుహాన్ దవాఖానకు వెళ్లగా ఆమె తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. మరి కొంతమంది ఇవే లక్షణాలతో రావడంతో ఇదేదో మహమ్మారిగా ఉన్నదని వైద్యులు అప్రమత్తమయ్యారు. కాగా, నెల రోజుల తర్వాత గ్యూజియాన్ కోలుకున్నారు.

## 13 మందికి వైరస్.. కంపెనీపై కేసు

**న్యూఢిల్లీ:** 13 మందికి వైరస్ సోకడానికి కారణమైన ఓ కంపెనీపై కేసు నమోదైంది. నోయిడా కేంద్రంగా పని చేస్తున్న 'సీజ్ ఫైర్' సంస్థలో ఓ విదేశీ వ్యక్తి ఆడిట్ నిర్వహించారు. ఆ కంపెనీ ఎండీతోపాటు ఇద్దరు ఉద్యోగులు ఇటీవల యూకే నుంచి తిరిగివచ్చారు. ఈ విషయాన్ని వైద్యాధికారులకు తెలుపక పోవడంతోపాటు వారు క్వారంటైన్‌లో ఉండలేదు. వారి ద్వారా 13 మందికి వైరస్ వ్యాపించింది.

## 1200 మంది ఖైదీల విడుదల

**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని వివిధ జైళ్లలో మగ్గుతున్న 1200 మంది ఖైదీలను తాత్కాలిక బెయిల్, పెరోల్ మీద రెండు నెలలు విడుదల చేయనున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. కరోనా నేపథ్యంలో జైళ్లలో రద్దీని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వారికి పెరోల్, తాత్కాలిక బెయిల్‌ను స్థానిక కోర్టుల జడ్జిలు జారీ చేస్తారన్నారు.

## మెడికోలకు ముందస్తు గ్రాడ్యుయేషన్!

**న్యూయార్క్:** దేశంలో కరోనా కేసులు వేగంగా పెరిగిపోతుండటంతో.. వైద్య విద్యార్థులకు ముందుగానే గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అమెరికా ఆలోచిస్తున్నది. కరోనా చికిత్సలో వారి సేవలను ఉపయోగించుకోవాలని భావిస్తున్నది.




## 'ఇండియా అబ్రాడ్' మూసివేత

**న్యూయార్క్:** అమెరికాలో ప్రవాస భారతీయులు ప్రారంభించిన ఓ వార్త పత్రిక కరోనా ప్రభావంతో మూతపడనున్నది. ప్రవాస భారతీయుడైన గోపాల్ రాజు 1970ల్లో 'ఇండియా అబ్రాడ్' పత్రికను స్థాపించారు. ఈ పత్రిక భారత వార్తలను ప్రధానంగా ప్రచురిస్తుంది. 2001లో గోపాల్ రాజు ఈ పత్రికను 'రెడిఫ్' సంస్థకు విక్రయించారు. ఆ తర్వాత 2016లో '8కే మైల్స్ మీడియా' చేజిక్కించుకున్నది.



లాక్‌డౌన్ నేపథ్యంలో తమ స్వస్థలాలకు వెళ్లడానికి ఆదివారం ఢిల్లీ-ఘజియాబాద్ సరిహద్దుల్లో ఉన్న బస్టాండ్ వద్దకు భారీగా చేరుకున్న వలస కార్మికులు

# జిల్లాలు లాక్‌డౌన్

- వలస కార్మికుల సంచారాన్ని నియంత్రించండి
- ఇప్పటికే వెళ్లినవారిని క్వారంటైన్‌లో ఉంచండి
- కార్మికుల నుంచి ఇంటి కిరాయి వసూలు చేయరాదు
- బలవంతంగా ఖాళీ చేయించేవారిపై చర్యలు
- రాష్ట్రాలకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ఆదేశాలు



**న్యూఢిల్లీ, మార్చి 29:** వలస కార్మికుల సంచారాన్ని నియంత్రించేందుకు జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దులను మూసివేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి స్వస్థలాలకు బయలుదేరిన కార్మికులకు స్క్రీనింగ్ నిర్వహించి 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచాలని స్పష్టంచేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్‌బల్లా ఆదివారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు), డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. లాక్‌డౌన్‌ను సమర్థంగా అమలుచేయాలని ఆదేశించారు. నగరాల మధ్య, జాతీయ రహదారులపై జనసంచారం లేకుండా చూడాలని స్పష్టంచేశారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు స్వయంగా బాధ్యతలు తీసుకుని ఈ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని కేంద్రం ఆదేశించింది. వలస కూలీలకు వారు పనిచేస్తున్న చోటునే భోజనం, వసతి సదుపాయం కల్పించాలని సీఎస్‌లు, డీజీపీలకు సూచించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఉపాధి లేక ముంబై, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల నుంచి లక్షలాది మంది కార్మికులు అనేక అవస్థలు పడుతూ స్వస్థలాలకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అయితే వారి ద్వారా వైరస్ మరింత వ్యాప్తిచెందే ప్రమాదమున్న నేపథ్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. వలస కూలీలు ఎక్కడి వారు అక్కడే ఉండాలని కోరింది. వారికి వసతి, భోజన సదుపాయం కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది. ఇందుకోసం ఎస్డీఆర్ఎఫ్ నిధులను వాడుకోవచ్చని తెలిపింది.

**బలవంతం చేస్తే కఠిన చర్యలు..**

కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా సకాలంలో జీతాలు అందేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. అలాగే ఇంటి అద్దె కోసం వారిపై యజమానులు ఒత్తిడి తేకుండా చూడాలని సూచించింది. కార్మికులను, విద్యార్థులను బలవంతంగా ఖాళీచేయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

**అడ్డుకుంటున్న సొంతూర్ల ప్రజలు**

నేపాల్, భూటాన్ వంటి పొరుగు దేశాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి సొంతూర్లకు చేరుకుంటున్న వలస కార్మికులను బీహార్‌లోని పలు గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో కొత్తవారు గ్రామాల్లోకి రాకుండా ఇప్పటికే ఊరి సరిహద్దులను మూసివేశారు. ఈ నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చే వలస కార్మికులను అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో అంబులెన్స్‌ల్లో అక్కడికి చేరుకుంటున్న వైద్య సిబ్బంది, అధికారులు వారిని దవాఖానలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**వలస కార్మికులు వెళ్లకండి: ఉద్ధవ్‌ఠాక్రే**

వలస కూలీలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లొద్దని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే కోరారు. ఎక్కడివారు అక్కడే ఉండాలని కోరారు. కార్మికులకు భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 163 కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. శివ్‌భోజనం పథకం కింద ఏప్రిల్ 1 నుంచి రూ.5కే భోజనం అందిస్తామని చెప్పారు. మరోవైపు వలస కార్మికులు ఢిల్లీని వీడవద్దని, లేనిపక్షంలో మీతోపాటు మీ గ్రామాలు, కుటుంబాలకు వైరస్ సోకే ప్రమాదమున్నదని సీఎం కేజ్రీవాల్ హెచ్చరించారు. భోజనం, వసతి వంటి అన్ని ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వినతి మేరకు ఢిల్లీ-ఘజియాబాద్ సరిహద్దు ప్రాంతాలకు చేరిన వేలాది మంది వలస కూలీలను 825 బస్సుల్లో వారి స్వగ్రామాలకు తరలిస్తున్నట్లు హర్యానా ప్రభుత్వం తెలిపింది. వలస కార్మికులను స్వస్థలాలకు తరలించేందుకు యూపీ సర్కారు 1500 బస్సులను ఏర్పాటుచేసింది. ఆకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించడంవల్ల వలస కూలీలు భయం, గందరగోళానికి లోనవుతున్నారంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి ఆదివారం లేఖ రాశారు. దేశంలోని పరిస్థితులు భిన్నమైనవని, ఇతర దేశాల్లో అనుసరించిన లాక్‌డౌన్ మాదిరిగా కాకుండా కరోనా నియంత్రణ చర్యలను వివిధ దశల్లో చేపట్టాల్సి ఉంటుందని అందులో పేర్కొన్నారు.



ఢిల్లీ నుంచి కాలినడకన స్వస్థలానికి వెళ్తున్న వలస కుటుంబం



ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రజాజీవనం స్తంభించింది. తిండి గింజలు లేక గ్రామాల్లోని పేదలు అలమటిస్తున్నారు. దీంతో తన పొలంలో పండిన గోధుమ పంటను అవసరమైన వాళ్లకు అందించి రామరావు పాటిల్ అనే యువ రైతు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

# వెయ్యి దాటిన కేసులు

- ఒక్కరోజే 106 నమోదు
- దేశంలో 27కు పెరిగిన కరోనా వైరస్ మృతులు

**న్యూఢిల్లీ:** దేశంలో వైరస్ కేసుల సంఖ్య వెయ్యి మార్కును దాటింది. ఆదివారం 106 కొత్త కేసులు నమోదు కాగా వైరస్ సోకిన వారి సంఖ్య 1,024కు చేరింది. ఒక్కరోజే 8 మంది మరణించగా దేశవ్యాప్తంగా కరోనా మృతుల సంఖ్య 27కు పెరిగింది. ఢిల్లీలో ఆదివారం కొత్తగా 23 కేసులు నమోదుకాగా వైరస్ సోకిన వారి సంఖ్య 72కు చేరింది. మహారాష్ట్రలో అత్యధికంగా 186, ఆ తర్వాత కేరళలో 182 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. కరోనా మరణాల్లో కూడా మహారాష్ట్ర (6) టాప్‌లో ఉండగా, గుజరాత్ (5), కర్ణాటక (3), మధ్యప్రదేశ్ (2), ఢిల్లీ (2), జమ్ముకశ్మీర్ (2), కేరళ, తమిళనాడు, తెలంగాణ, బీహార్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్కో మరణం నమోదైనట్లు తెలిపింది.

**స్పైస్‌జెట్ పైలట్‌కు పాజిటివ్**

స్పైస్‌జెట్‌కు చెందిన ఓ పైలట్‌కు వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యిందని ఆ సంస్థ తెలిపింది. ఆయన ఈ నెల 21 నుంచి ఇంట్లోనే ఉన్నట్లు పేర్కొంది. ఆ పైలట్‌ను కలిసిన సిబ్బందిని స్వీయ నిర్బంధంలో ఉండాలని సూచించినట్లు తెలిపింది. మరో వైపు బ్రీత్ ఎనలైజర్ పరీక్షను తాత్కాలికంగా నిలిపివేయాలని ఎయిర్ ఇండియా పైలట్ల సంఘం డీజీసీఏను కోరింది. ఇరాన్ నుంచి ఇటీవల ఢిల్లీ చేరిన 275 మంది భారతీయులను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఆర్మీ వైద్య కేంద్రానికి తరలించారు. మాస్కులు, గ్లౌవ్స్, శానిటైజర్లు, మందులు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను 'నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ' (ఎన్‌పీపీఏ) కోరింది.

**పీఎం కేర్స్ విరాళాలు సీఎస్ఆర్ కిందకే..**

కార్పొరేట్ సంస్థలు పీఎం కేర్స్ నిధికి ఇచ్చే విరాళాలను సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) వ్యయాలుగా పరిగణిస్తామని కేంద్రం తెలిపింది.

## చిన్నారి 'స్ఫూర్తి'దాయక విరాళం

- కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.4,400 దానం

**పుదుచ్చేరి:** కరోనా కట్టడి చర్యలకు దాతలు విరాళాలు ప్రకటించాలని ఇటీవల ప్రధాని మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఆయన పిలుపునకు స్పందించి అనేక మంది దాతలు ముందుకొచ్చారు. వారిలో రెండున్నరేండ్ల చిన్నారి కూడా ఉన్నది. తమిళనాడులోని విల్లుపురానికి చెందిన ఆ చిన్నారి పేరు స్ఫూర్తి.. సార్థక నామధేయంగా గుణమూ ఉన్నది. ఆ చిన్నారి ఏడాది వయసు నుంచి కిడ్డీ బ్యాంకులో దాచుకున్న మొత్తాన్ని విరాళంగా ప్రకటించింది. తల్లిదండ్రుల అనుమతితో ఆదివారం గల్లాగురిగిని పగులగొట్టింది. లెక్కించగా 4,400 రూపాయలున్నాయి. పీఎం ఆర్ఎఫ్‌కు, తమిళనాడు సీఎంఆర్ఎఫ్‌కు సమానంగా రూ.2,200 చొప్పున విరాళం పంపించాలని నిర్ణయించుకున్నది.

## జ్వర బాధితుల్ని గుర్తించే ఏఐ కండ్లద్దాలు!

**బీజింగ్, మార్చి 29:** చైనాలోలాక్‌డౌన్ ఎత్తివేసి ఇంకా రెండ్రోజులే అవుతున్నది. బహిరంగ ప్రదేశాలు ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్నాయి. ప్రజల కదలికలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, వైరస్‌కు పుట్టినిల్లయిన చైనా అప్రమత్తంగానే ఉన్నది. హాంగ్జౌ నగరంలోని హాంగ్యువాన్ పార్క్‌కు వచ్చే సందర్శకుల శరీర ఉష్ణోగ్రతలను గుర్తించేందుకు అక్కడి భద్రతా సిబ్బందికి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత కండ్లద్దాలను అందజేశారు. వీటి ద్వారా జ్వరం ఉన్న వారిని ఒక మీటరు దూరం నుంచే గుర్తించేందుకు వీలవుతుంది.



## ఇటలీకి శాపమైన వృద్ధ జనాభా!

**రోమ్:** ఇటలీలో కరోనా విశ్వమారి కారణంగా పదివేల మందికి పైగా చనిపోగా, బాధితుల సంఖ్య 93 వేలు దాటింది. కరోనా వెలుగుచూసిన చైనాలో కంటే మూడు రెట్లు, ప్రపంచవ్యాప్త మరణాల్లో 30 శాతం మరణాలు ఇటలీలోనే నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దేశంలో వృద్ధ జనాభా అధికంగా ఉండటమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు చెప్తున్నారు. ఇటలీ జనాభాలో 23.1 శాతం మంది 65 ఏండ్ల పైబడినవారే. ప్రస్తుతం కరోనాతో మరణించిన వారి సగటు వయసు 78 ఏండ్లుగా ఉన్నది. అలాగే, వైరస్ సోకిన వారి సగటు వయస్సు 63 ఏండ్లుగా ఉన్నది. కరోనా ప్రభావం వృద్ధులపై ఎక్కువగా ఉంటుందని తెలిసిందే.

# 33వేలు దాటిన మరణాలు

యూరప్, అమెరికాలో కోరలు చాస్తున్న కరోనా • స్పెయిన్, ఇటలీ దేశాల్లో ఒకేరోజు 800మందిపైగా మృత్యువాత

**న్యూయార్క్, మార్చి 29:** కరోనా కోరల్లో చిక్కి యూరప్, అమెరికా విలవిల్లాడుతున్నాయి. ఇటలీ, స్పెయిన్‌లలో ఒకే రోజు 800 మందికిపైగా చొప్పున మృత్యువాతపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మృతుల సంఖ్య 33,000 దాటింది. 7 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ప్రపంచంలో దాదాపు మూడింట ఒక వంతు జనాభా దిగ్బంధంలో ఉన్నది. అమెరికాలో కరోనా వ్యాప్తికి కేంద్ర స్థానంగా ఉన్న న్యూయార్క్ నగరాన్ని దిగ్బంధించాలని ప్రతిపాదించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. స్థానిక నేతల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. ట్రంప్ నిర్ణయాన్ని న్యూయార్క్ గవర్నర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది 'సమాఖ్య యుద్ధానికి' దారితీస్తుందని, ఫలితంగా కల్లోల పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. అమెరికాలో కరోనా మృతుల సంఖ్య 2,300 దాటింది. ప్రపంచంలోనే అత్యధికంగా 1,33,000 కేసులు నమోదయ్యాయి. మృతుల సంఖ్య మూడు రోజుల్లోనే రెట్టింపైంది. మొత్తం మరణాల్లో పావు భాగం న్యూయార్క్ నగరంలోనే సంభవించాయి. ఇటలీ పరిస్థితులే న్యూయార్క్‌లోనూ ఎదురుకావొచ్చని అక్కడి వైద్య నిపుణులు భయాందోళనలు వ్యక్తంచేశారు. పెరుగుతున్న కేసులతో వైద్య సిబ్బంది సతమతమవుతున్నారు. వెంటిలేటర్లతోపాటు ఇతర వైద్య సామగ్రికి కొరత ఏర్పడింది. మరోవైపు, అమెరికాలో కరోనాతో ఏడాదిలోపు చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఏడాది లోపు శిశువు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. పనామాలో క్రూయిజ్ నౌకలో చిక్కుకుపోయిన ప్రయాణికులను మరో నౌకలోకి తరలించారు. నౌకలో 1800 మంది ప్రయాణికులు ఉండగా, కరోనా కారణంగా శుక్రవారం నలుగురు మృత్యువాతపడ్డారు. మరో ఇద్దరికి వైరస్ సోకింది.



స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో నిర్మానుష్యంగా మారిన రహదారులు

**యూరప్‌లో 20,000లకుపైగా..**

యూరప్‌లో కరోనా మృతుల సంఖ్య 20,000 దాటింది. ఇందులో సగం మరణాలు ఇటలీలోనే (10,779) చోటుచేసుకున్నాయి. ఇటలీ తర్వాత అత్యధికంగా ప్రభావితమైన స్పెయిన్‌లో ఆదివారం ఒక్కరోజే 838 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మృతుల సంఖ్య 6,606కి పెరిగింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను స్పెయిన్ మరింత కఠినతరం చేసింది. అత్యవసరం కాని వాణిజ్య కార్యకలాపాలను రెండు వారాలపాటు నిలిపివేయాలని ఆదేశించింది. ఫ్రాన్స్‌లో 2,600 మందికిపైగా మరణించారు.యుద్ధం ఇప్పుడే మొదలైందని, వచ్చే రెండు వారాలు మరింత కఠినంగా ఉండనున్నాయని ఆ దేశ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్పే వ్యాఖ్యానించారు. బ్రిటన్‌లో మృతుల సంఖ్య 1200 దాటింది. మరోవైపు బెల్జియంలో మృతుల సంఖ్య పెరుగుతున్నది. శనివారం 353 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందురోజు 289 మంది మృతిచెందారు. ఇరాన్‌లో మృతుల సంఖ్య 2640కి చేరుకున్నది. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ఒక సూపర్‌మార్కెట్ ఎదుట ప్రజలు సామాజిక దూరం పాటించేలా చూసేందుకు పోలీసులు రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించాల్సి వచ్చింది.

## కరోనా క్లాక్

29-3-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 7.08 లక్షలు
మరణాలు: 33,529

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 1,33,240 | 2,363 |
| ఇటలీ | 97,689 | 10,779 |
| చైనా | 81,439 | 3,300 |
| స్పెయిన్ | 78,799 | 6,606 |
| జర్మనీ | 60,659 | 482 |
| ఫ్రాన్స్ | 40,174 | 2,606 |
| ఇరాన్ | 38,309 | 2,640 |
| యూకే | 19,522 | 1,228 |
| స్విట్జర్లాండ్ | 14,829 | 300 |
| నెదర్లాండ్స్ | 10,866 | 771 |
| బెల్జియం | 10,836 | 431 |
| దక్షిణ కొరియా | 9,583 | 152 |

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు: 1,024
మరణాలు: 27

**దేశంలో కరోనా కేసులు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 186 | కేరళ 182 | కర్ణాటక 83 |
| ఢిల్లీ 72 | ఉత్తరప్రదేశ్ 72 | తెలంగాణ 70 |
| గుజరాత్ 63 | రాజస్థాన్ 59 | తమిళనాడు 49 |
| పంజాబ్ 38 | హర్యానా 33 | కశ్మీర్ 31 |
| మధ్యప్రదేశ్ 30 | ఏపీ 21 | ప. బెంగల్ 18 |

## మాట వింటారా.. సేవ చేస్తారా?

**జైపూర్:** లాక్‌డౌన్ ఆంక్షలను ఉల్లంఘించేవారికి చెక్‌పెట్టేందుకు రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లా యంత్రాంగం వినూత్న చర్యలు చేపట్టింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిని క్వారంటైన్ వార్డుల్లో కరోనా బాధితులకు సేవ చేసేందుకు పంపాలని నిర్ణయించింది. ఏ కారణం లేకుండా రోడ్లపై చక్కర్లు కొట్టేవారి ఫొటోలను తీయాలని, వాటిని జిల్లా అధికారులకు పంపాలని సబ్‌డివిజినల్ మెజిస్ట్రేట్ మురళీశర్మ ప్రజలను కోరారు. క్వారంటైన్ వార్డులు శానిటైజ్ చేసేందుకు, కరోనా బాధితులకు సేవలు చేసేందుకు వీరిని ఉపయోగించుకుంటామని చెప్పారు.

## ఇల్లు ఖాళీచేయమన్న యజమానిపై ఎఫ్ఐఆర్

**బిలాస్‌పూర్:** కరోనా భయాందోళనల నేపథ్యంలో ఇల్లు ఖాళీచేయాలని ఓ నర్సుపై ఒత్తిడి తెచ్చిన ఇంటి యజమానిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. యజమాని కారణంగా నర్సు ఇల్లు ఖాళీచేసి సొంతూరుకు వెళ్లిపోయిందని ఆమె పనిచేస్తున్న దవాఖాన డాక్టర్ ఫిర్యాదుచేశారు. అయితే కాంగ్రెస్ కార్పొరేటర్ అయిన ఆ యజమాని సీతారామ్ జైశ్వాల్ ఈ ఆరోపణలను ఖండించారు.

చెలిమె
కరీంనగర్ 6 నమస్తే తెలంగాణ
సోమవారం 30 మార్చి 2020

# నీ దేహమే శత్రుస్థావరమైతే


టీవీల్లో పెద్దాయన ఆదేశం
కరోనాపై కవితలు రాయాలని..
దూరదృష్టికి సలాం–మంచి మాటకు గులాం!
సామాజిక సంక్షోభమే–కవుల జన్మక్షేత్రం
అక్షరాల హర్మ్యాలకు
వేదనలే పునాది.. ఆవేశమే నిర్మాణశక్తి!

కంటికి కనిపించని జీవి కూడా
ప్రపంచంపై యుద్ధం చేయగలుగుతున్నప్పుడు
కొమ్మకు వేలాడే గబ్బిలాలు
ముస్సోలినీ, హిట్లర్లను మించినప్పుడు
అక్షరం నేర్వని చేతులు కూడా
కవిత్వం రాయగలవు..!

తూర్పు దిశన పొడిమె అరుణరేఖ
నవోదయపు వెలుగులకు బదులు
మారణహోమపు చీకట్లను చిమ్మినపుడు
సెల్‌ఫోన్ టవర్ల శ్రుతిమించిన రేడియేషన్‌కు
రాలుతున్న పిట్టల్లా విలవిలలాడుతూ...
ఐదారడుగుల మనుషులు.. నేలరాలుతున్నప్పుడు
స్పందించే ప్రతి హృదయ ప్రతిస్పందనలో
జనించదా కవిత్వం?

చూడు చూడు నిశితంగా..!

రవి అస్తమించని సామ్రాజ్యాధినేతలు మా తాతలని
జగతిని తమ పిడికిట్లో బంధించిన నేతలని
విర్రవీగిన రాజవంశపు వారసత్వం..
జర్మన్ విమానాల బాంబుల వర్షంలో సైతం
ప్రపంచ యుద్ధాలలో క్షేమంగా సేదదీర్చిన
రాజప్రసాదం..
నలభై వేల విద్యుద్దీపాలతో కాంతులు విరజిమ్మే
బకింగ్ హాం ప్యాలెస్.. కాంతి విహీనమైనపోగా
కనిపించని శత్రువుతో పోరాడేదెలాగో తెలియక
ప్రాణవాయువు వెదుక్కుంటూ.. ఆప్తులకు దూరంగా
రాజూ రాణీ తరలిపోయారెచటకో..!
'హర్డ్ ఇమ్యూనిటీ'యే శ్రీరామరక్ష అని నమ్మి
'కరోనా.. ఆవోనా..' అంటూ స్వాగతించి
వైరస్‌పై పోరులో మా
స్టయిలే
వేరని



చాటి
శత్రువును
బరిలోనికి రానిచ్చి
ముప్పేట 'ఇమ్యూనిటీ' దాడితో గెలుస్తామన్న
బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్
చారిత్రక తప్పిదంతో.. చతికిలపడ్డ తీరు..
వేల యుద్ధాల విజేతలపై
సూక్ష్మాతి సూక్ష్మజీవి విజయం..!

సామాన్యున్ని సైతం సహస్రావధానిగా మలుస్తుంది
ఆలస్యమెందుకు? అందుకో కలం.. ..!
నాదిర్షా, గడాఫీ, సద్దాం, బిన్‌లాడెన్
ఎవరైతేనేం..?
మాట వినని దేశాధితనేలను
మట్టి కరిపిస్తామని
దేశోదయానికి పూర్వమే
యుద్ధరీతులు నేర్చి
సామ్రాజ్యవాదమే మా 'వేద' మంటూ
ఒక్కొక్క ఆదిమ జాతిని అంతం చేస్తూ
ఆఫ్ఘన్, ఇరాక్‌పై నిన్నటి యుద్ధాల దాకా
పశ్చిమ దేశమే, ప్రపంచ దిశను శాసిస్తుందని
వందకు మించిన దేశాల్లో
లక్షల్లో సైన్యాన్ని దింపి
సంపద మాదే.. సంస్కృతి మాదే..
పాలన మాదే.. జ్ఞానం మాదేనంటూ..
ప్రపంచ దేశాలను గుప్పిట్లో పెట్టుకున్న
అగ్రరాజ్యం!

శాటిలైట్ రాకెట్ వేగాన్ని మించి
వూహాన్ నుండి దూసుకొస్తున్న
గబ్బిలపు పెనుముప్పును
అంచనా వేయడంలో విఫలమైంది..!
ఏ అహంకారపు మేఘాల పొరలు
అడ్డు నిలిచాయో!
శతాబ్దాల పాపాలకు మూల్యం చెల్లిస్తూ
స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సాక్ష్యంగా
వందలాది శవాలతో వణికిపోతున్న
ప్రపంచ వాణిజ్య రాజధాని,
తనకెదురే లేదన్న విశ్వవిజేత బలాన్నీ, బలగాన్నీ
సూక్ష్మదర్శినికందని జీవి.. మట్టి కరిపిస్తున్న తీరు..
సాహిత్యం తెలియని వాడిని కూడా కాళిదాసు వలె
మహాకవిగా మారుస్తుంది..!
మరో ప్రపంచయుద్ధం / జలయుద్ధమనుకున్నాం
అణుయుద్ధ మనుకున్నాం.. కానీ
జల తుంపరలే సకలశస్త్రాలకన్న
శక్తివంతమనుకోలేదు..!
అనుబంధపు ఆలింగన స్పర్శలే
అణబాంబులకన్న ప్రమాదమనుకోలేదు..!
గవాక్షాలే రక్షణ రేఖలవుతాయని
ఏనాడైనా అనుకున్నామా..?
కరచాలనాలే కాటికి సాగనంపే
యమదూతలని కలగన్నామా..?
ఏ నేత మొదలుపెడుతాడోనని
ఎదురుచూస్తుంటే...
నియంతలకే చెమటలు పట్టిస్తూ
ఈ అప్రకటిత యుద్ధం చేస్తూ
వేలాది ప్రాణాలను కబళిస్తున్న
కనిపించని శత్రువెవరు?
దేశంలోనికి రానిచ్చిందెవరు?
దేహమే శత్రుస్థావ
రమైతే
మనిషికిక
దిక్కెవరు?
నానోగ్రాములో
వెయ్యవవంతులేని
అత్యల్ప జీవికి,
మహాబలుడైన మానవుడు
లోకువైనాడా?

దశాబ్దాల నిర్లక్ష్యానికి..
దేహం చెల్లిస్తున్న మూల్యం!
బాత్రూంలలో బండలపై వున్న శ్రద్ధ
ఏనాడైనా గుండెల పనితీరుపై చూపినామా?
కణజాలపు విధ్వంసాన్ని నివారించే
రోగనిరోధక వ్యవస్థను
పట్టించుకోని పాపమిది!

పోషకాహార విలువలు విస్మరించి
జిహ్వాచాపల్యపు మత్తులో..
బంక పుడ్డు (మైదా), జంకుపుడ్డూ తింటున్నాం..
గద్దల్ని, గబ్బిలాలనూ అరిగించుకుంటున్నాం..
జవసత్వాలిచ్చిన మట్టికి
మరణశాసనం రాసినాం..
కృత్రిమ రసాయన జీవనశైలితో
సనాతన జీవన విలువలకు
శతకోటి సంవత్సరాల త్యాగాల మహాజ్ఞాన సంపదకు
తిలోదకాలిచ్చిన వైనం!

క్షమాగుణం–కవి స్వంతం
కవి మానవతావాది–కవి సంఘజీవి
కవిత్వం సమాజహితం–భవిష్యద్దర్శనం..!
'కరోనా ఫోబియా' మానవాళిని పట్టిపీడిస్తుంటే
'సెల్ఫ్ క్వారంటైన్'లో చేతులు ముడుచుకు కూర్చోవద్దు..
కలంతో కదనానికి సిద్ధం కావాలి
సోషల్ మీడియాతో 'సోయి' తెప్పించాలి
కవిత్వమే 'ఫోబియా'ను జయించే
అసలు సిసలైన అస్త్రం!

మనిషి దేహమే యుద్ధభూమిగా మారినప్పుడు
హెచ్చరికలే లేకుండా శత్రుమూక
హృదయాంతరాలల్లోని కోట్ల కణాలపై
నిశ్శబ్ద సమరాన్ని సాగిస్తుంటే
విటమిన్లు, మినరల్స్, ఫైటో న్యూట్రియంట్స్ ప్రొటీన్లే
విష్ణు చక్రాలు, రామ బాణాలు..!
వైరస్ కణకణాన్ని రణక్షేత్రంగా మార్చినప్పుడు
రోగ నిరోధక శక్తిని పెంచే హార్మోన్లే రక్షణ కవచాలు
'బయోవార్'ను గెలిచే శక్తి 'న్యూరాన్ల'కే స్వంతం
భావజాలం కూడా మెదడు కణజాలపు జీవశక్తే!

కాళన్న యాది...
'ఒక్క సిరా చుక్క–లక్ష మెదళ్ళకు కదలిక..'
అసలు వ్యాక్సిన్ కనుగొనే దాకా.. కరోనాపై..
అక్షరమే ఆయుధం....

**- వి.ప్రకాశ్, 9000950400**

# ఒకే రోజు వంద పద్యాలతో

# కరోనాపై కలం పోరు

సమాజం కష్టకాలంలో ఉన్నప్పుడు కవులు ఎక్కడైనా ఏం చేస్తారు? ప్రజల మధ్యన నిలిచి కలాన్ని చేతబట్టి ప్రజల కోసం రాస్తారు. సరిగ్గా ఇప్పుడు 'కరోనా' కష్టకాలంలో సిద్దిపేట జిల్లాకు చెందిన భూమిపుత్రుడు బండికాడి అంజయ్యగౌడ్ కరోనాపై తన కలాన్ని కరవాలంగా సంధించి ఒక్కరోజులోనే వంద పద్యాలు రాసి తనదైన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. కల్లు గీసిన చేతులతోనే కలం పట్టిన అంజయ్యగౌడ్ అలవోకగా పద్యాలు రాస్తాడు. ఆరో తరగతిలోనే చదువు మానేసినా, పది శతకాలు రాయటమే కాదు, అష్టావధానాలు చేస్తున్న అరుదైన పండితుడు మన అంజయ్య. కరోనా వైరస్‌తో వణికిపోతున్న ప్రపంచానికి మార్గం చూపుతూ పద్యాలు రాసిన సహజ కవి అంజయ్యగౌడ్ తక్షణ స్పందన, సాహితీ ప్రస్థానం..
ఆయన మాటల్లోనే...



**ప్రపంచాన్ని** ఇవ్వాళ 'కరోనా' భూతం ఆవహించింది. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టక నిర్లక్ష్యం వహించటం వల్ల చాలా దేశాలు మూల్యం చెల్లిస్తున్నయి. మన పాలకులు రాబోయే ప్రమాదాన్ని ముందుగానే ఊహించి తగు జాగ్రత్తలు తీసుకుంటూ లాక్‌డౌన్ ప్రకటించిండ్రు. ప్రజలంతా ఇండ్లల్లోనే ఉంటూ సామాజిక దూరాన్ని పాటించి కరోనాను కట్టడి చేయాలని పిలుపునిచ్చిండ్రు. ఈ సందర్భంగా నా వంతు బాధ్యతగా కరోనా వైరస్ భూతాన్ని దునుమాడుతూ ఒక్కరోజులోనే వంద పద్యాలు రాసిన. అందులో కరోనా పుట్టుక నేపథ్యాన్ని చెబుతూ..

**'తిక్కల చైనా వారలు / మెక్కిరి క్రిమికీటకముల మేలంచును నీ
వక్కడ జన్మించియు మము / త్రొక్కుట న్యాయమ్మకాదు తొలగు కరోనా..'**

**'జిద్దేలను మాతోడను / వద్దిక పోపొమ్ము మమ్ము వదలియు నిపుడే
రాద్ధాంతము జేయక నీ / ప్రొద్దే చైనా పురముకు లుబ్ద కరోనా..'**

అంటూ రాసిన. అలాగే ఈ జాతి చైతన్యం, ఐకమత్యం ముందు కరోనా నీ పప్పులు ఉడకవని అంటూ..

**'ఇంకేమీ జేసెదరని / సంకటములు గలుగజేయ సాహసివై మా
వంకను జేరిన నీకును /జంకదు మా భారతీయ జనము కరోనా..'**

అంటూ భరతజాతి కరోనాకు వెరువబోదని తేల్చిచెప్పిన. అలాగే..

**'ఔషధమే లేదంచు త / మాషను జూపంగబోక మానుము నికనీ
వేషము మాపంగను మా / కాషాయమే చాలుచాలు కనవే కరోనా..'**

---

**'అందరమొకటై నేడి / బందును పాటించి నీదు ప్రాణము దీయన్
ముందుకు వచ్చితిమిక మ / మ్మందక బరుగిడుటె దారి మహిని కరోనా..'**

అంటూ.. కరోనా నిన్ను తన్ని తరుముతామని ప్రకటించిన. అలాగే మా ప్రభుత్వం, పాలకులు తీసుకుంటున్న చర్యలతో మేమంతా సుఖంగా బయట పడుతామనే భరోసానిస్తూ..



**'జనజీవనమాసించిన
ఘనుడగు మా
ముఖ్యమంత్రి కార్యోన్ముఖుడై
నిను నెదిరించెడి పనిగా
జనతా కర్ఫ్యూవిధించే చావు
కరోనా..'** అంటూ రాసిన.
అలాగే..

**'మాముఖ్యమంత్రి సతతము
ప్రాముఖ్యత నిడుచు ప్రజల రక్షించుటకై
వేమరు శ్రమియించుచు తా
నీ మరణము కోరుచుండె నిజము కరోనా..'**

అని ప్రజారక్షకుడిగా సీఎం చేస్తున్న కృషిని చెబుతూ వంద పద్యాలు రాసి కరోనా రక్కసిని చెండాడిన. ప్రజలందరూ జాగరూకతతో కరోనా కోరలు విరువాలని పిలుపునిస్తున్నా.

## ఇక నా జీవన సాహితీ ప్రస్థానం విషయానికి వస్తే..

బుద్దెరిగినప్పటి నుంచీ గట్కముద్దలు, చింతపండు తొక్కుతోనే కడుపు నింపుకున్న బతుకు నాది. నేటి సిద్దిపేట జిల్లా, తోగుట మండలంలోని వెంకటరావు పేట మా ఊరు. నాయన పేరు నర్సయ్య, అమ్మ బాగమ్మ. నాయిన కల్లు గీత కార్మికుడు. నాకో తమ్ముడు, ఇద్దరు చెల్లెండ్లు. అయ్యొక్కడి కల్లుగీతతో వచ్చే ఆదాయం, ఏనాడూ మేమందరం కడుపార తిన్నది లేదు. ఏదైనా పండుగొచ్చిన నాడే ఇంట్లో తెల్లన్నం వండేది. అదే మాకు పండుగ పరమాన్నం. మా నాయనొక్కడు చేస్తే కుటుంబం గడువటం కష్టంగా మారింది. నేను కూడా ఓ చెయ్యేస్తే తప్ప.., పూట గడువని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు మాఊర్లోనే ఆరో తరగతి చదువుతున్న నేను, చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి బతు కు పోరాంటంల దుంకిన. బహుశా 1976–77 అనుకుంటా..బడి మానేసి కూలినాలి బాట పట్టిన. అప్పుడే నేటి సిరిసిల్ల ప్రాం తానికి 13వ ఏట ఈదుల(ఈత చెట్లకు)కు లొట్లు గట్టే పనికి గీత కార్మికునిగా పనిలో కుదిరిన.నెలకు నూటా పది రూపా యల జీతం వచ్చేది. 'పారిన గంజికి శిబ్బి తౌ్ర తోడైనట్లు'గా నా సంపాదన నా చెల్లెండ్ల కు, తమ్మునికి కడుపు నింపింది. పెద్దోళ్లు ఈదులకు కల్లు గీసుకుంటూ పోతే, వారి వెనుక నేను ఈదులకు లొట్లు (చిన్న పాటి కుండ) కట్టుకుంట పోయేటోన్ని. అప్పుడు ఆ ఈత వనంలో గీత కార్మికులుగా పనిచేసేటోల్లు ఈదులపై కల్లు గీస్తూ పెద్దగా రాగం తీస్తూ యక్షగాన పాటలు పాడేటోళ్లు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆ ప్రాంతమంతా యక్షగాన పాటలతో ప్రతిధ్వనించేది. ఒకరు ఒక రాగమందుకుంటే, దానికి మరొకతను పోటీ రాగమందుకునేటోడు. ఆ గీత కార్మికులపాటలే నాలో సాహిత్య జవసత్వాలు నింపినయి. ఆ పాటల రాగం, ఎత్తు పల్లాలు, ధార నన్ను కూడా ఓ పాటగాన్ని చేసినయి. విన్న పాటలన్నీ తిరిగి అదే రాగంతో పాడుకునేటోన్ని. వాటి నే చేస్తున్న పనుల్లో అన్వయించి కొత్త పాటలు పాడుకునేది.ఆ పాటలపై ఏర్పడిన అనురాగమే నన్ను ఆ తర్వాతి కాలంలో పాటగాన్ని, రాతగాన్ని చేసినయి.

సిరిసిల్ల నుంచి మా ఊరికొచ్చి నేను కూడా గీత పని నేర్చుకొని 'టీఎఫ్‌టీ' లైసెన్స్ తీసుకున్న. దాంతో నాకు కల్లు గీసి అమ్ముకునే హక్కు వచ్చిందన్న మాట. మా ఊర్లో వీధి బాగోతాలు బాగా ఆడేవాళ్లు. పాటలపై నాకున్న ఆసక్తి, రాగధార విని మా ఊరోళ్లు బాగోతంలో వేషాలు ఇచ్చిండ్రు. అలా నా పన్నెండవ ఏటనే రామాయణంలో అంగదుని పాత్ర వేసిన. ఆ తర్వాత కాలంలో ఎక్కువగా స్త్రీ పాత్రలు వేసేవాన్ని. 'కీచక వధ'లో ద్రౌపది పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చింది. యక్షగానంపై ఉన్న ప్రేమతోనే నేను మొదట 'వేంకటేశ్వర కళ్యాణా'న్ని 'తెలంగాణ యక్షగానం'గా రాసిన. 1995 నాటికి నేను కల్లుగీత కార్మికుని నుంచి 'మునిమ్' (సూపర్‌వైజర్) అయిన.కొంత ఆర్థికంగా కుదుట పడుతుండగానే 1998లో కల్లు కంపౌండ్‌లు బందయినై. దీంతో బతుకుదెరువు కోసం వలసబాట పట్టి బొంబాయి పోయిన. అక్కడ ఓ సారా దుకాణంల గుమస్తాగా చేరిన.ఆ ఉద్యోగంలనైతే చేరిన గని, ఆ సారా కొట్టుకొచ్చే మనుషులు, వారి జీవిత సంఘర్షణలు నన్ను అతలాకుతలం చేసేవి. ఆ సంఘర్షణలోంచే నేను పాటలల్లుకుపోయిన. అలా పాడుకున్న పద్యాలనే రాసుకున్న. ఆ పద్యాలను గురువర్యులు జీఎం రామశర్మగారికి చూయించిన. ఆయన పద్యాలను చూసి.. 'అంజయ్యా గొప్పోనివయ్యా.. గొప్ప కంద పద్యాలు రాసినవయ్యా' అని మెచ్చుకున్నరు. 'నీలో గొప్ప పండితులకు లేని ధారశక్తి ఉంద'ని చెప్తూ.. చిన్న చిన్న వ్యాకరణ దోషాలున్నాయని చెప్పి, 'వాటిని నివారించుకుంటే నీకు తిరుగులేద' ని ప్రోత్సహించారు. వ్యాకరణం, ఛందస్సుచదువమన్నారు. నిజానికి అప్పటిదాకా నేను రాసినవి కందపద్యాలని నాకూ తెలువదు. నాకున్న యక్షగాన ఒరవడి, ధారతో రాసుకుంటూ పోయిన. రామ శర్మగారి సూచన మేరకు విజయవాడ, రోహిణీ పబ్లిషర్స్ నుంచి 'సులక్షణ సారం' గ్రంథాన్ని తెప్పించుకొని చదివిన. అప్పటినుంచి ఛందస్సు, వ్యాకరణ శాస్త్రంపై పట్టుసాధించి పద్యాలు రాస్తున్న.

ఆ తర్వాతకాలంలో **'ఆటవెలది'**లో రేణుకాదేవి శతకం, **'సీస పద్యం'**లో చంద్రమౌళీశ్వర శతకం, **ఉత్పలమాల**, **చంపకమాల**లో 'వేంకటేశ్వర శతకం'.. ఇలా పది శతకాలు రాసిన. ఏడుపాయల వనదుర్గ శతకం 'ఏక **ప్రాస**'లో రాసిన.

తెలుగు సాహిత్యంలో **'ఉదాహరణము'** అనే పద్య ప్రక్రియను ప్రారంభించిన పాల్కుర్కి సోమన స్ఫూర్తిని పునికిపుచ్చుకొని.. **'ఆంజనేయ ఉదాహరణము'**, **'శ్రీకృష్ణదేవరాయ ఉదాహరణము'** రాసిన. ఇప్పటిదాకా తెలుగు సాహిత్యంలో **'ఉదాహరణము'**లు 150 దాకా ఉంటే అందులో నేను రాసినవి రెండున్నయ్. 16 పుస్తకాలు ప్రచురించిన. రెండు అచ్చులో ఉన్నవి.

నా రచనలు చూస్తే అవన్నీ భక్తి, పురాణేతిహాసాలు అనిపిస్తుంది. సామాజిక జీవనం ఉండదనే అపోహ కలుగుతుంది. వాటిలోనూ నేను సామాజికాంశాలను మర్చిపోలేదు. సామాజిక సమస్యలను, మౌఢ్య పోకడలను నిరసిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న. ఉదాహరణకు..

**సీ. 'అంగారకునిపైన అడుగిడె మనుజుండు
మూఢభక్తిని వీడలేడు జగతి
చంద్రలోకంపైన చరణములు మోపినా
పశుబలి వీడరీ పాపినరులు..'** అని రాసుకున్న. అలాగే..

**శా. గయ్యాలైన కులాంగన ధరణిలో
కాపట్యులౌ పుత్రులున్
నెయ్యంబెరుగని బంధువర్గము
హితుల్ నీచాత్ములౌ మిత్రులున్
కుయ్యాలించని తల్లిదండ్రులు
ధరణ్ క్రూరాత్ములౌ సోదరుల్
అయ్యా పాము విషంబుకంటే
గణమయ్యా రాజరాజేశ్వరా..'** అని **'రాజరాజేశ్వర శతకం'**లో రాసిన.

'మానవ సేవే మాధవసేవ' అని నమ్ముత. నేను పద్యకవినే అయినా.. పల్లెనూ, మనిషినీ మర్చి పోలేదు. నా పాట, పద్యం వారి కోసమే. పద్యానికి పట్టం గట్టి ప్రజా కాంక్షలను గానం చేస్తున్న. ఏ కష్టం వచ్చి నా ప్రజలకు నేనున్నానని చెబుతూ.. నా వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నా...


**– ఎస్.మల్లారెడ్డి, 80966 77255**

## రచనలకు ఆహ్వానం

సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఒద్దిరాజు సోదరుల స్మృత్యకంగా సహృదయ సాహిత్య పురస్కారం–2019 కోసం పద్యకవుల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. 2015–19 మధ్యకాలంలో ప్రచురితమైన పద్యకావ్యాలు మూడు ప్రతులను 2020 ఏప్రిల్ 30లోగా అందేట్లు పంపించాలి.
చిరునామా: కుందావరుల కృష్ణమూర్తి, శ్రీమాత ప్లాట్ నెం.207, ఇంటి నెం: 02–07–580, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ–506 001, సెల్: 98493 66652

**- డాక్టర్ ఎన్.వి.ఎన్.చారి, సహృదయ సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి**

# ఆత్మ సాక్షాత్కారానికి వేళ ఇదే



నమస్తే.. నమస్తే.. నమః

సద్గురు జగ్గీ వాసుదేవ్

**భూమి** ముఖ్యంగా సూర్యశక్తి వల్లే నడుస్తున్నది. మనిషి శరీరం కూడా ఈ భూమిలో ఒక అంశమే. సూర్యశక్తిని మనమెంత గ్రహించగలమన్న దానిని బట్టే మీకెంత శక్తి ఉన్నదనేది నిర్ణయించబడుతుంది. అందువల్ల సూర్యుని చుట్టూ తిరిగే భూపరిభ్రమణం కాలాన్నే గాక, మన శక్తిని కూడా నిర్దేశిస్తుంది. అంటే, జీవానికి ప్రధాన అంశాలైన కాలమూ, శక్తి అనే ఈ రెండూ కూడా సూర్యుని వల్లనే నిర్దేశితమవుతున్నాయి. కనుకే, భూమిపై సూర్యుని ప్రభావం అత్యధికంగా ఉంటుంది. సూర్యుని లాగా చంద్రుడు శక్తిని ప్రసరించలేకపోయినా, భూమికి అతి సమీపంలో ఉండటం వల్ల మనపై చంద్రుడి ప్రభావం కూడా ఎక్కువే. అసలు మన పుట్టుకే చంద్ర గమనంపై ఆధారపడి ఉన్నది. ఎలాగంటే, స్త్రీ శరీరంలోని ఋతుక్రమానికీ, చంద్రుని గమనానికి నూటికి నూరు శాతం సంబంధం ఉన్నది. చంద్రుని ప్రభావం కాంతి, శక్తి, ఉష్ణాలకు సంబంధించింది కాదు, అది అయస్కాంత పరమైంది. ఈ రోజు ఏదో ఒకదాని భ్రమణ, పరిభ్రమణాల వల్లనే విద్యుత్తు తయారవుతున్నది. అందుకు వేరే మార్గం లేదు. అదేవిధంగా చంద్రుడు తన భ్రమణ, పరిభ్రమణాల ద్వారా ఒక శక్తి క్షేత్రాన్ని ఏర్పరుస్తున్నాడు. తద్వారా మనపై ప్రభావం చూపుతున్నాడు. బయటినుంచి మన జీవితాన్ని ప్రభావితం చేసే వాటిని అర్థం చేసుకోవాలంటే సూర్యుడిని పరిగణనలోకి తీసుకోవాలి. అంతరంగంలో జరిగే దానిని అర్థం చేసుకోవాలంటే చంద్రుడిని పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రపంచంలో అతి పురాతనమైన క్యాలండర్లలో ఈ పంచాంగం ఒకటి. దీనిపరంగా ఇప్పుడు మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. భారతీయ (తెలుగు వంటి) పంచాంగం ప్రకారం కొత్త సంవత్సరం మొదటి రోజును 'ఉగాది' అంటాం. ఇప్పుడు భూమి సూర్యునికి అతి సమీపంలో ఉన్నది. ఎదగటానికి వేసవి అత్యంత అనుకూలం. వృక్షజాతి అంతా వేసవిలోనే బాగా పెరుగుతుంది. ఎందుకంటే, వాటి పెరుగుదలకు అవసరమైన కిరణజన్య సంయోగక్రియ ఈ సమయంలో బాగా జరుగుతుంది. కానీ, భూమిపై ఉండవలసిన వాటినన్నింటినీ మనం నాశనం చేశాం. కాబట్టి, ప్రస్తుతం వేసవి అంటే అత్యంత అసౌకర్యమైన కాలంగా మారింది. అసలు వేసవి అంటే ఎడారుల్లో మాత్రమే అసౌకర్యంగా ఉండాలి. మిగతా భూమిమీద జీవనం ఎంతో ఉన్నతస్థాయిలో, ఉత్సాహంగా జరుగవలసిన సమయమిది.

ఎరుక (అవేర్నెస్)తో ఉంటే ఈ సమయమే మానవులకు కూడా ఎంతో మంచిది. మీ చుట్టూ ఉన్న జీవనం ఉరకలేస్తూ ఉంటుంది. అందువల్ల మిమ్మల్ని మీరు మీకు కావలసిన విధంగా మలచుకోవడానికి కూడా ఇదే ఉత్తమమైన సమయం. ఇది ఉత్తరాయణ కాలం కూడా. అంటే, భూమిపరంగా చూస్తే సూర్యగమనం ఉత్తరం వైపు ఉంటుంది. ఉత్తరార్థ గోళంలో ఉన్న మనకు ఈ సమయం ఎంతో ముఖ్యమైంది.



ఆత్మ సాక్షాత్కారానికి, ఆశయ సాధనకు అనువైన సమయం ఇదే మరి! వచ్చే సంవత్సరం కల్లా మీరు ఇప్పటికన్నా చాలా మెరుగైన మనిషిగా మారాలి. ఇంకా సంతోషంగా, శాంతంగా, ప్రేమ గా ఉండాలి. అంటే అన్ని రకాలుగా ఉత్తమమైన మనిషిగా తయారవ్వాలి. దానికి మీరేం చేయాలో మీరే నిర్ణయించుకోవాలి. మీరు ఆ విధమైన ఆలోచనతో అడుగులు వేస్తే, మీలో మానవత్వం పొంగిపొర్లుతుంది. అప్పుడు దివ్యత్వం మీకు దానంతటదే సంభవిస్తుంది.

- కర్రసాయం.. మార్చురీకి శవం



లాక్‌డౌన్ కారణంగా వాహనాలు అందుబాటులో లేక మృతదేహాన్ని కర్రకు కట్టుకొని మార్చురీకి తరలించిన దృశ్యం మహబూబాబాద్ పట్టణంలోని రామచంద్రాపురంకాలనీలో కనిపించింది. ఆదివారం కాలనీలో గుర్తుతెలియని మృతదేహాన్ని చూసిన స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. ఆ సమయంలో ఆ వాహనం అందుబాటులో లేకపోవడం.. లాక్‌డౌన్‌తో వేరే వాహనాలు దొరక్క కాలనీవాసులే మృతదేహాన్ని కర్రకు కట్టి మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. – నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్ జిల్లా



బాల్‌నాయక్ తండాలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటేశ్

# గుమ్మం తట్టిన వైద్యం

- మంత్రి కేటీఆర్ చొరవతో..
- బాధితుడి ట్వీట్‌తో చిన్నారికి వైద్య పరీక్షలు

**రాయపర్తి:** లాక్‌డౌన్ కారణంగా ఓ వ్యక్తి ఇంటికి వెళ్లలేని పరిస్థితి. ఇంటి వద్ద 27 రోజుల చిన్నారికి ఆరోగ్య సమస్య.. ఏం చేయాలో తెలియని సదరు వ్యక్తి మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించగా.. వైద్యుడితోపాటు సిబ్బంది సదరు వ్యక్తి ఇంటికి వెళ్లి చిన్నారిని పరీక్షించారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూరు గ్రామ సమీపంలోని బాల్‌నాయక్ తండాకు చెందిన భూక్య అనిత–ప్రవీణ్‌కుమార్ దంపతులు. వీరికి 27 రోజుల క్రితం పాప జన్మించింది. ప్రవీణ్‌కుమార్ వృత్తిరీత్యా నల్గొండ జిల్లాలో ఉండగా ఇంటి వద్ద భార్య, కూతురు ఉంటున్నారు. ఆదివారం చిన్నారి అనారోగ్యానికి గురైంది. ఆందోళనకు గురైన ప్రవీణ్‌కుమార్.. తన చిన్నారి అనారోగ్యంతో బాధపడుతున్నదని, లాక్‌డౌన్ నేపథ్యంలో తాను నల్లగొండ నుంచి ఇంటికి వెళ్లలేకపోతున్నానని, ఏం చేయాలో తోచడం లేదంటూ తన సమస్యను ట్విట్టర్ వేదికగా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాడు. తక్షణమే స్పందించిన మంత్రి కేటీఆర్ చిన్నారికి వెంటనే వైద్య సేవలు అందేలా చూడాలని వరంగల్ రూరల్ కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మధుసూదన్ స్థానిక మండల వైద్యాధికారి డాక్టర్ భూక్య వెంకటేశ్‌కు సూచించగా ఆయన బాల్‌నాయక్ తండాలోని ప్రవీణ్‌కుమార్ ఇంటికి చేరుకొని చిన్నారిని పరీక్షించారు. ఆ వెంటనే మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా అక్కడ వైద్య చికిత్స అందిస్తున్నారు. తన పాపకు వైద్యం అందడంతో ప్రవీణ్‌కుమార్ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



వనపర్తిలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## నిర్ణీత దూరమే మేలు

### వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు నిర్ణీత దూరాన్ని పాటించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. ఆదివారం ఉదయం వనపర్తి జిల్లాకేంద్రంలో మంత్రి పర్యటించారు. రైతు బజారు, బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన మంత్రి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు.



కావేరమ్మపేటలో పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే

## అప్రమత్తతతోనే కరోనాకు చెక్

### క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**జడ్చర్ల:** అప్రమత్తతతోనే కరోనా వైరస్‌ను తరిమికొట్టవచ్చని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి జడ్చర్ల శివారులోని కావేరమ్మపేటలో మంత్రి పర్యటించారు. కరోనా నివారణకు అధికారులు, వైద్య సిబ్బంది తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో మొదటగా కరోనా కావేరమ్మపేటలో వచ్చిందని, వీరి బంధువులు, సన్నిహితులు జడ్చర్ల, కావేరమ్మపేట, మహబూబ్‌నగర్, భూత్పూరు ప్రాంతాల్లో ఉండొచ్చని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

- ఇంట్లోనే రక్షణ



కరోనా వైరస్ వ్యాప్తిచెందకుండా సంగారెడ్డి జిల్లా అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆదివారం రాత్రి జోగిపేటలో యువకులకు అవగాహన కల్పించారు. ఇండ్లలో నుంచి ఎవరూ బయటకు రావొద్దని, సామాజిక దూరం పాటించాలని, వలస కార్మికులు సైతం ఇక్కడే ఉండాలని ఇదే విషయమై సీఎం కేసీఆర్ చెప్పిన మాటలను ఆడియో రూపంలో వారికి వినిపించారు. – సంగారెడ్డి నమస్తే తెలంగాణ ప్రతినిధి

# కట్టుదిట్టంగా క్వారంటైన్

## ఢిల్లీకి వెళ్లొచ్చిన వారికి పరీక్షలు

- స్థానిక ఐసోలేషన్‌కు తరలింపు
- గాంధీకి చేరిన 9మంది మెదక్ జిల్లా వాసులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ :** కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం క్వారంటైన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నది. విదేశాల నుంచి వచ్చిన వారితోపాటు ఇతర రాష్ర్టాలకు వెళ్లొచ్చిన వారిపైనా నిఘా వేస్తున్నది.ఇటీవల ఢిల్లీకి వెళ్లొచ్చిన పలు జిల్లాలవారికి ఆదివారం పరీక్షలు నిర్వహించి స్థానికంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులకు తరలించింది. వారి కుటుంబ సభ్యులకు సైతం పరీక్షలు చేయనున్నది.



నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన యువకులను క్వారంటైన్‌కు తరలిస్తున్న అధికారులు

**పలు జిల్లాల నుంచి..**

నిజామాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ రావడంతో ఆయనతోపాటు ఢిల్లీకి వెళ్లి ఈనెల 22న తిరిగి వచ్చిన, సన్నిహితంగా ఉన్నవారిని అధికారులు గుర్తించారు. కొందరిని క్వారంటైన్‌కు, మరికొందరిని హైదరాబాద్‌కు తరలించారు. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ నుంచి ఆరుగురు, భైంసా నుంచి 12 మంది, దిలావర్‌పూర్ నుంచి 9 మంది వెళ్లినట్టు గుర్తించారు. వారందరికీ స్థానిక అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు తరలించారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలానికి చెందిన ఒకరిని ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డులో చేర్పించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు, కామారెడ్డి మండలానికి చెందిన ఇద్దరికి కరోనా లక్షణాలు కనిపించడంతో జిల్లా కేంద్ర దవాఖానలో పరీక్షలు చేసి అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఐదుగురు, రెంజల్ మండలానికి చెందిన ఒకరు, ఎడపల్లి మండలానికి చెందిన ఇద్దరు, మోస్రా మండలానికి చెందిన 9 మంది, మాక్లూర్ వాసులు ముగ్గురు, సిరికొండకు చెందిన ఒకరు, బాల్కొండ వాసులు ఇద్దరిని అధికారులు గుర్తించారు. వీరిలో కొందరు ఇటీవల ఢిల్లీకి వెళ్లిరాగా, మరికొందరు వారితో సన్నిహితంగా ఉండటంతో వీరందరినీ అధికారులు గుర్తించి హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు.

**మెదక్ జిల్లా వాసులు సైతం..**

మెదక్ జిల్లాకు చెందిన 9 మంది ఢిల్లీకి వెళ్లిరాగా.. అధికారులు హోం క్వారంటైన్‌లో ఉంచారు. మెదక్‌కు చెందిన నలుగురు, పాపన్నపేట, శివ్వంపేట, చేగుంట, కొల్చారానికి చెందిన ఒక్కొక్కరితోపాటు మరో వ్యక్తిని పరీక్షల నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించినట్టు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే ఈ నెల 13న మహబూబాబాద్ జిల్లా నుంచి వెళ్లిన ముగ్గురు 18న జిల్లాకు చేరుకున్నారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఒకరు, తొర్రూరుకు చెందిన ఇద్దరికి కరోనా లక్షణాలున్నాయన్న అనుమానంతో అధికారులు శనివారం అర్ధరాత్రి మహబూబాబాద్ జిల్లా దవాఖానలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. వారి నుంచి నమూనాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. అదే విధంగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన మరో వ్యక్తి ప్రస్తుతం ఖమ్మం పట్టణంలో ఉంటున్నాడు. అతడిని కూడా ఖమ్మం దవాఖానలోని ఐసోలేషన్ వార్డుకు తరలించి నమూనాలను హైదరాబాద్‌కు తరలించినట్టు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీరాం చెప్పారు.

**ఎన్‌ఆర్‌ఐలకు జియోట్యాగింగ్**

వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్ మండలంలోని కమలాపూర్, గూడూరు, కానిపర్తి, శనిగరం, శ్రీరాంలపల్లి, మర్రిపెల్లి గ్రామాలకు వచ్చిన ఎన్‌ఆర్‌ఐలకు ఆదివారం జియోట్యాగింగ్ చేశారు. మొత్తం ఆరుగురికి జియోట్యాగింగ్ చేసి వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తున్నట్టు స్థానిక వైద్యాధికారి డాక్టర్ సంయుక్త తెలిపారు. పదిహేను రోజుల వరకు ఇండ్లలోనే ఉండాలని వారికి సూచించినట్టు డాక్టర్ పేర్కొన్నారు.

- 'బేబీ' కటింగ్..



లాక్‌డౌన్‌లో భాగంగా హెయిర్ సెలూన్లు సైతం మూతపడ్డాయి. ఇక చేసేదేం లేక ఓ తల్లి తన కూతురికి స్వయంగా క్షవరం చేసింది. ఈ దృశ్యం ఆదివారం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో కనిపించింది. – సారంగాపూర్

# మాల్దీవుల నుంచి వచ్చారు.. బయట తిరిగారు

- ఆ ముగ్గురికి కానిస్టేబుల్ ఆశ్రయం
- తనిఖీకి వచ్చిన అధికారులపట్ల కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన
- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఘటన

**తిరుమలగిరి, నమస్తే తెలంగాణ:** బాధ్యత కలిగిన ఓ పోలీస్ కానిస్టేబుల్ తన విధిని మరిచి మాల్దీవుల నుంచి వచ్చిన ముగ్గురికి తన ఇంట్లో ఆశ్రయం కల్పించాడు.. విషయం తెలిసిన పోలీసులు, అధికారులు ఇంటికి వెళ్లి ప్రశ్నిస్తే అనుచితంగా ప్రవర్తించాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఆదివారం చోటుచేసుకున్నది. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్ తమ్ముడితోపాటు కట్టంగూరు, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన ఇద్దరు కలిసి మాల్దీవుల్లో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఈ నెల 21న హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలోనే అధికారులు వారిని ఇంటినుంచి బయటకు వెళ్లొద్దని ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఆ తర్వాత కొద్దిరోజులు హైదరాబాద్‌లో స్నేహితుల దగ్గర ఉండి ఈనెల 26న తిరుమలగిరి తిరుమలహిల్స్‌లోని కానిస్టేబుల్ నివాసానికి చేరుకున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా బయట తిరుగుతుండటంతో చుట్టుపక్కల వారు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, వైద్యసిబ్బంది కానిస్టేబుల్ నివాసానికి వెళ్లి ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. 'ఏంటి మీకు చెప్పేది?, అయితే ఏంటి ?' అని సీఐ శ్రీనివాస్, తాసిల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎస్సై డేనియల్‌కుమార్‌తో కానిస్టేబుల్ శ్రీనివాస్ దురుసుగా మాట్లాడాడు. దీంతో అధికారులు సదరు కానిస్టేబుల్‌తోపాటు మాల్దీవుల నుంచి వచ్చిన ముగ్గురికి స్టాంప్ వేసి హోమ్ క్వారంటైన్‌లోనే ఉండాలని ఆదేశించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.



మాల్దీవులు నుంచి వచ్చిన వ్యక్తులతో కానిస్టేబుల్ శ్రీనివాస్

# రైతులూ.. పంట కోతల్లో జాగ్రత్త

## పీజేటీఎస్‌ఏయూ పరిశోధన సంచాలకుడు జగదీశ్వర్ సూచనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి పంటల కోతలు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్‌ఏయూ) పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్ జగదీశ్వర్ సూచించారు. వరి, కంది, మక్కజొన్న పంటల్లో కోత అనంతరం జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని చెప్పారు. ఈ యాసంగిలో వరిపంట విస్తీర్ణం సాధారణం కంటే రెండింతలకుపైగా సుమారు 37 లక్షల ఎకరాల్లో సాగైందని తెలిపారు. ప్రస్తుతం వరిపంట గింజ గట్టిపడే దశలో ఉన్నట్టు చెప్పారు. వివిధ జిల్లాల్లో మెడ విరుపు విస్తృతంగా వ్యాపించడం, తెల్లకంకి వల్ల అధిక నష్టం జరిగే ప్రమాదం ఉన్నదన్నారు. వరికి మద్దతు ధర రావాలంటే పంట కోత సమయంలో మెలకువలు పాటించాలన్నారు. డాక్టర్ ఆర్ జగదీశ్వర్ మరిన్ని సూచనలు ఇలా..

**గింజలు బాగా ఎండిన తరువాతే కోతలు**

- పంటమీదనే గింజలు బాగా ఎండిన తర్వాత కోతలు చేపట్టాలి. అప్పుడే తేమశాతం తగ్గి మంచి ధర లభిస్తుంది. పంట కోత సమయంలో వర్షాలు పడి గింజ తడిసి మొలకెత్తకుండా ఉండేందుకు లీటరు నీటికి 5 గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.
- కంది నూర్పిడి చేసే సమయంలో 13–14 శాతం తేమ ఉంటుంది. దీర్ఘకాలిక నిల్వకు 9–10 శాతం ఉండేలా చూసుకోవాలి. నిల్వచేసే గోనె సంచులకు కొంతమేర వేప ద్రావణం పిచికారీ చేసుకోవాలి లేదా సంచులను కొంతవరకు వేప కషాయంలో ముంచి ఆరబెట్టి వాడుకోవాలి.
- మక్కజొన్నను యంత్రం ద్వారా నూర్పిడి చేసేటప్పుడు కండెలో తేమ 25 శాతం కన్నా ఎక్కువ లేకుండా చూసుకోవాలి. తేమ 12 శాతం వచ్చేవరకు ఎండలో ఆరబెట్టాలి. శుభ్రపరిచి నిల్వ చేసుకోవాలి. ఇందుకోసం వీలైనంత వరకు కొత్త సంచులను వాడాలి. పాత సంచులు వాడాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.



- ధాన్యపు సంచులను గోదాముల గోడ నుంచి అరమీటరు దూరంలో ఉండేలా అమర్చుకోవాలి. సంచులను నేలపై కాకుండా చెక్కబల్లలపై పేర్చుకోవాలి.
- గోదాముల గోడలు శుభ్రపర్చుకొని.. లీటరు నీటికి డైక్లోరోవాస్ 7మి.లీ. లేదా మలాథియాన్ 10మి.లీ.. కలిపి ప్రతి 100 చ.మీ.కు మూడు లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి.
- గోదాం వసతిలేని రైతులు గాలి వెళ్లే ప్రదేశంలో టార్పాలిన్‌పై ధాన్యం పోయాలి. రోజులో 2 లేదా 3 సార్లు ధాన్యాన్ని కిందకు, మీదకు కలుపుకోవాలి. ఆహార అవసరాలకు ధాన్యాన్ని నిల్వ చేసుకొనే రైతులు అందులో వేపాకు పొడి లేదా సీతాఫల్ పొడి లేదా పరాద్ అనే ఆయుర్వేద బిళ్లలు (టన్ను ధాన్యానికి 3–4 బిళ్లలు) వేయాలి. పురుగు మందులు వాడొద్దు.

## కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రూ.181 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) నిధులను ప్రభుత్వం విడుదలచేసింది. రంగారెడ్డి జిల్లాలో 14, మేడ్చల్‌లో 12, సంగారెడ్డిలో ఐదు, యాదాద్రిలో మూడు, మెదక్‌లో రెండు పట్టణ స్థానిక సంస్థలకు కలిపి రూ.181.50 కోట్లను మంజూరుచేసింది. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌కు రూ.21.61 కోట్లు, బడంగ్‌పేట్‌కు రూ.13.53 కోట్లు, తుర్కయంజాల్‌కు రూ.13.36 కోట్లు, మణికొండకు రూ.9.43 కోట్లు, మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌కు రూ.13.80 కోట్లు, నాగారానికి రూ.13.38 కోట్లు, దుండిగల్‌కు 10.58 కోట్లు, పీర్జాదిగూడకు రూ.9.91 కోట్లు, సంగారెడ్డి జిల్లాఅమీన్‌పూర్‌కు రూ.9.33 కోట్లను కేటాయించినట్టు పురపాలక (సీడీఎంఏ) విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ వెల్లడించారు.

## పాలిసెట్ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏప్రిల్ 17న నిర్వహించనున్న పాలిసెట్–2020 పరీక్ష వాయిదా వేస్తూ రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) నిర్ణయించింది. కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా లాక్‌డౌన్ కొనసాగుతున్నందున పాలిసెట్‌ను వాయిదా వేశామని సాంకేతిక విద్యా శిక్షణా మండలి కార్యదర్శి యూపీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోఆర్డినేటర్లను ఆదేశించారు. పాలిసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు తేదీని కూడా వచ్చేనెల 17 వరకు పొడిగించామని తెలిపారు.

## జర్నలిస్టులను ఆదుకోండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** కరోనాపై యుద్ధం తలపెట్టి ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించినప్పటికీ జర్నలిస్టులు విధినిర్వహణలో సైనికుల మాదిరిగా పనిచేస్తున్నారని టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. ఈ విపత్తు నేపథ్యంలో జర్నలిస్టులను ఆదుకోవడానికి వారికి శానిటైజర్లు, మాస్కులు, నిత్యావసర సరుకులు అందజేయాలని ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. లాక్‌డౌన్ సందర్భంగా జర్నలిస్టులకు ఎదురవుతున్న ఇబ్బందులు గుర్తించి ప్రతి పాత్రికేయుడికి రూ.10 వేల చొప్పున ఇచ్చేందుకు కృషిచేయాలని కోరారు.

## సజావుగా కూరగాయల సరఫరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో కూరగాయల కొరతలేకుండా వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. సీఎం కేసీఆర్, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో ఆదివారం 198 వాహనాలతో 402 ప్రాంతాల్లో మొబైల్ రైతుబజార్లను ఏర్పాటుచేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరిగేలా మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షిస్తున్నది. రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్ణీత ప్రాంతాల్లో విక్రయాలు సజావుగా సాగుతున్నాయి.

## చింతలపాలెంలో మళ్లీ భూప్రకంపనలు

### రిక్టర్ స్కేల్‌పై 2.7గా నమోదు

**చింతలపాలెం:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం, మేళ్లచెర్వు మండలాల్లోని అన్నిగ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఐదుసార్లు భూమి కంపించింది. భారీ శబ్దాలతో భూమి కంపించడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇండ్లనుంచి బయటకు పరుగులు తీశారు. రెండురోజుల నుంచి భూప్రకంపనలు వస్తుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. శనివారం రాత్రి సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై అత్యధికంగా 2.7గా నమోదైనట్టు తాసిల్దార్ కమలాకర్ తెలిపారు. ఈ ప్రకంపనల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదన్నారు.

## నేడు ఓ మోస్తరు వానలు

### కొనసాగుతున్న ఉపరితల ద్రోణి, ఆవర్తనం

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** ఉపరితల ద్రోణి, ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఆదివారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. సోమవారం కూడా ఇదే తరహా వాతావరణం ఉండే అవకాశం ఉన్నదని చెప్పారు. ఉత్తర కేరళ నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు ఇంటీరియర్ కర్ణాటక, మరాఠ్వాడ, విదర్భ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితలద్రోణి కొనసాగుతున్నదని పేర్కొన్నారు. శ్రీలంక నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 కి.మీ. నుంచి 1.5 కి.మీ. మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదన్నారు. హైదరాబాద్‌లో ఎండలు మండుతున్నాయి. ఈనెల 26న 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఆదివారం 37.2 డిగ్రీలుగా రికార్డయింది.

## దుగ్గిరాల పూర్ణయ్య కన్నుమూత



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అలనాటి రేడియో న్యూస్ రీడర్ దుగ్గిరాల పూర్ణయ్య (83) ఆదివారం స్వగ్రామం ఏపీలోని కృష్ణా జిల్లా అంగలూరులో కన్నుమూశారు. ఆయన ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో తెలుగు న్యూస్‌రీడర్‌గా, ఢిల్లీ తెలుగు న్యూస్ విభాగాధిపతిగా సుమారు నలభై ఏండ్లకుపైగా సేవలందించారు. జోలిపాలెం మంగమ్మ, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, కందుకూరి సూర్యనారాయణ, ఏడిద గోపాల్‌రావు, అద్దంకి మన్నార్ తదితరులు పూర్ణయ్య సహచరులు. బీజేపీ అగ్రనేత ఎల్కే అద్వానీకి పూర్ణయ్య దగ్గరి సహచరుడు. పూర్ణయ్య మృతిపట్ల ఆకాశవాణి అధికారులు, సిబ్బంది, పలువురు అభిమానులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## 'కరోనా' ఆర్టిస్ట్

ఇండియన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అజయ్ జయరామ్ మంచి ఆటగాడే కాదు, చేయితిరిగిన పెయింటర్ కూడా. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలులో ఉన్న నేపథ్యంలో అతను ఇంట్లోనే కాలం గడుపుతున్నాడు. ఈ సమయంలో తనలోని సృజనాత్మకతకు పదును పెట్టాడు. కాన్వాస్‌పై ఓ వృద్ధుని బొమ్మ వేశాడు. ఆ పెయింటింగ్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఆ చిత్రానికి 'టర్బన్ మ్యాన్' (తలపాగా వ్యక్తి) అని పేరు పెట్టాడు.



# స్వచ్ఛంద సైన్యం

ఒకరిది మాట సాయం. ఒకరిది వైద్య సహకారం. ఒకరిది అన్నదానం. ఒకరిది రక్తదానం.

కరోనా సంక్షోభ సమయంలో తమ వంతుగా సమాజానికి సాయం అందిస్తున్న స్వచ్ఛంద సేవకులు ఎంతోమంది. నాలుగు గోడలకే పరిమితం కావాల్సిన సమయంలోనూ నలుదిక్కుల్లోని దిక్కులేనివారి గురించీ, వృద్ధుల గురించీ, అనారోగ్య పీడితుల గురించీ ఆలోచిస్తున్న ఆ సంస్కారవంతులకు నమస్కారాలతో..



కేరళ లో శానిటైజర్ల తయారీలో విద్యార్థి సంఘాలు

**బంజారాహిల్స్.**
జీవీకే మాల్ దగ్గర.
ఆ ఖరీదైన ప్రాంతం... దివాలా తీసిన కుబేరుడిలా వెలవెల బోతున్నది. చౌరస్తాలో ఓ పోలీసు పొద్దుటి నుంచీ విధుల్లో ఉన్నాడు. తాజ్ బంజారా వైపు నుంచి ఓ మహిళ స్పోర్ట్స్ సైకిల్ మీద వచ్చింది. ఆమె వెన కాలే డొక్కు సైకిలు మీద ఓ గార్డు. చేతిలో ఏవో పట్టు కొని వస్తున్నాడు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ దగ్గ రకు వెళ్లింది ఆమె. గార్డు చేతిలోని సంచి కానిస్టేబు ల్‌కు అందించింది. అందులో.. వేడివేడి ఇడ్లీలు, చట్నీ, వాటర్ బాటిల్, చిన్నపాటి శానిటైజర్, టిష్యు పేపర్లు ఉన్నాయి. పరిసరాల్లో ఉంటున్న సంపన్న కుటుంబీకురాలు ఆమె. ఉదయం నుంచీ నిర్విరా మంగా పనిచేస్తున్న పోలీసును చూసి ఆ యువతి మనసు కదిలిపోయింది. ఇంట్లో నుంచి బ్రేక్ ఫాస్ట్ తెచ్చి ఇచ్చింది. అతను మన కోసం పనిచేస్తున్న ప్పుడు, మనం అతని గురించి ఆలోచించకపోతే... మానవత్వానికి అర్థమేం ఉంటుంది?
నిజానికి ఈ సంక్షోభ సమయంలో మనకు కావా ల్సింది ఇలాంటి స్వచ్ఛంద సేవకులే. ఆకలితో ఉన్నవా రికి భోజనం, భయంతో తల్లడిల్లుతున్నవారికి ధైర్యం, సాయం కోసం ఎదురుచూస్తున్నవారికి ఆర్థిక భరోసా – సేవ ఏ రూపంలో అయినా ఉండవచ్చు. ఆ మహత్కార్యం ఓ వ్యక్తిగా చేయవచ్చు, ఓ సంస్థ గానూ పూనుకోవచ్చు.

### కనీస బాధ్యత..

ఒకరికి అసాధ్యం. ఇద్దరికి కష్టం. ముగ్గురు, నలు గురు, పదిమంది, వందమంది – చేతులు కలిపితే ఏదైనా సాధించగలం. ఆ సమష్టి శక్తిని సమర్థంగా ఉపయోగించుకుంది కేరళ. కరోనా వైరస్ ఒక్కసారిగా ప్రబలిపోవడంతో... ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది అక్కడ. మరోవైపు శానిటైజర్ల కొరత తీవ్ర మైంది. దీంతో సర్కారు వాలంటీర్ల సాయం తీసు కుంది. విద్యార్థులను, యువజన సంఘాలను రంగం లోకి దించింది. చకచకా పనులు జరిగిపోయాయి. దీంతో ఉత్పత్తి పెరిగింది. ఒక్క రోజులోనే వేలకొద్దీ శానిటైజర్ సీసాలను ఆసుపత్రులకు అందించింది. మాస్కుల తయారీకి కూడా ఇదే పద్ధతిని అనుసరిం చింది. అంతలోనే ఇంకో సమస్య? గృహనిర్బంధం కారణంగా నాలుగు గోడలకే పరిమితమైన పేదల ఆకలి దప్పులు ఎవరు తీరుస్తారు? ప్రభుత్వం దగ్గర వనరులున్నాయి. కానీ మనుషుల్లేరు. ఉన్నా సరి పోరు. మళ్లీ స్వచ్ఛంద సేవకులే రంగంలోకి దిగారు.

### మాట సాయం

చాలా సందర్భాల్లో చిన్న సమాచారమే ఓ పెద్ద ఉత్పా తాన్ని నివారించడంలో సాయపడుతుంది. 'సర్... అమీర్‌పేటలోని ఫలానా కాలనీ నుంచి మాట్లాడుతు న్నాను. మా ఎదురింట్లో ఓ అబ్బాయి ఈమధ్యే యూకే నుంచి వచ్చాడు. నాకు తెలిసినంత వరకూ తను ఎలాంటి వైద్య పరీక్షలూ చేయించుకోలేదు. పొద్దున్నే దగ్గుతూ తుమ్ముతూ కనిపించాడు. నాకెం దుకో భయంగా ఉంది' – అంటూ ఓ సామాన్యుడు హెల్ప్‌లైన్‌కు ఇచ్చిన సమాచారం పోలీసులకు చాలా ఉపయోగపడింది. 'ఫలానా చోట మందులు బ్లాక్‌లో అమ్ముతున్నారు, 'ఫలానా గల్లీలో ఏదో ధావత్ జరుగుతున్నది. వందమంది గుమిగూడారు' – ఆరోగ్య సంక్షోభ సమయంలో ప్రతి సమాచారం విలువైందే. కరోనా అనేది పురాణాల్లోని రక్తబీజుడనే రాక్షసుడి లాంటిది. ఒక రక్తపుబొట్టులోంచి వేయి మంది రాక్షసులు పుట్టుకొచ్చినట్టు... ఒక కరోనా రోగి మరింతమందిని అనారోగ్యం పాలు చేస్తాడు.

'ఏం ఫర్వాలేదు. సమస్య తీవ్రమైందే. కానీ స్వీయ క్రమశిక్షణతో మనం దాన్ని అధిగమించగలం. టేక్ కేర్' తరహా ప్రకటనలు వాట్సాప్‌లో చాలానే కనిపి స్తుంటాయి. కొన్ని నిజంగానే మనలో ధైర్యం నింపు తాయి. కానీ, మామూలు వ్యక్తులతో పోలిస్తే... నిపు ణుల భరోసా వందరెట్లు శక్తిమంతమైంది. ముఖ్యంగా, వైద్యుల మాటలకైతే మంత్రమంత బలం ఉంటుంది. కాబట్టే, కొందరు సామాజిక బాధ్యత కలిగిన వైద్యులు... కరోనాపై అపోహల్ని తొలగిస్తూ ఆడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. అమె రికాలో కరోనా ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో చెబుతూ... అక్కడ క్రిటికల్ కేర్ నిపుణుడిగా పనిచే స్తున్న డాక్టర్ అనిల్ విడుదల చేసిన ఆడియో చాలా ఆదరణ పొందింది. 'నేను గత పదేండ్లుగా ఐసీ యూలో పని చేస్తున్నాను. ఇండియాలో కరోనా వ్యాప్తి ప్రస్తుతానికి ప్రాథమిక దశలోనే ఉంది కాబట్టి మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. రెండు మూడు వారాలు మీరు బయటకు వెళ్లొద్దు. బయట నుంచి ఎవరినీ రానివ్వవద్దు. దగ్గు వంటి అనారోగ్య లక్షణా లుంటే మరింత జాగ్రత్తగా ఉండాలి' అంటూ అందులో స్పష్టమైన సూచనలు చేశారు అనిల్. ఇలాంటి సమయాల్లో మంచిని విస్తరించడం ఎంత అవసరమో, చెడును కట్టడి చేయడం, తప్పుడు వార్త లకు అడ్డుకట్ట వేయడం అంతే ప్రధానం. కర్ణాటక ప్రభుత్వం ఆ బాధ్యతను 'కరోనా వారియర్స్'కు అప్పగించింది. రాష్ట్ర సమాచార శాఖ రెడ్‌క్రాస్ సొసై టీతో కలిసి మూడువేలమంది కరోనా యోధుల్ని సిద్ధం చేసింది. హరియాణా ప్రభుత్వం కూడా 'క రోనా సంఘర్ష్ సేనాని' పేరుతో ఇలాంటి కార్యక్రమా నికే శ్రీకారం చుట్టింది.

### సంఘాలుగా..

'నాకో హెల్ప్ చెయ్యాలి నువ్వు. తెలుసుగా, అమ్మా నాన్నా బెంగళూరులో ఒంటరిగా ఉన్నారు. నేనేమో ఇక్కడ యూఎస్‌లో. నాన్నకి అనారోగ్యం. మందులు అయిపోయాయి. బయటికి వెళ్లి తెచ్చుకోవడానికేమో ఇబ్బంది. ఇంతకు ముందు అయితే ఇరుగూ పొరుగూ సాయం చేసేవాళ్లు. ఇప్పుడు కాలింగ్‌బెల్ కొట్టినా తలుపు తీయడం లేదు. నువ్వే ఏదైనా చేయాలి' అని ఓ ఫ్రెండ్ చేసిన అభ్యర్థన డిజిటల్ మార్కెటింగ్ నిపుణురాలు మహితా నాగరాజ్‌ను ఆలోచింపజేసింది. అంతే, రాత్రికిరాత్రే.. కేర్‌మాం గర్స్ ఇండియా ప్రాణం పోసుకుంది. దాదాపు ఐదు వేలమంది స్వచ్ఛంద సేవకులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకున్నారు. వయోధికులు, ఏడాదిలోపు పసిబిడ్డల తల్లిదండ్రులు, వికలాంగులు, తీవ్ర అనా రోగ్య పీడితులు.. తమకు ఏ అవసరం వచ్చినా ఈ బృందాన్ని సంప్రదించవచ్చు. అన్నివేళలా బయటికి రావడానికి బెంగళూరు పోలీసులు వీరికి అనుమతి కూడా ఇచ్చారు. జొమాటో ఫీడింగ్, గూంజ్, మిలాప్, ఉదయ్ ఫౌండేషన్ తదితర సంస్థలు దేశ వ్యాప్తంగా.. మహానగరాల్లోని వలస కూలీల కడుపు నింపడానికి క్రౌడ్ ఫండింగ్ మార్గంలో నిధులు సేకరిస్తున్నాయి. యూఎన్వీ ఇండియా ఆధ్వర్యం లోని వీ-ఫోర్స్ కూడా కొవిడ్‌కు వ్యతిరేకంగా పనిచేయాలను కునే వాలంటీర్లకు వేదికగా నిలుస్తున్నది.
ఇన్ని వేదికలు ఉన్నాయి. మనమూ ఏదో ఓ సంస్థతో కలిసి నడువవచ్చు. నేరుగా సేవ చేయడం ఒక మార్గం. సేవ చేస్తున్నవారికి సాయం అందించడం మరో మార్గం. ఏదో ఒకటి, ఎంతో కొంత.. సంక్షోభ సమ యంలో అదే కొండంత!

...✍ వినో..



సౌదీ అరేబియాలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వలస కార్మి కులకు సెలవులు ప్రకటించాయి కంపెనీలు. ప్రస్తుతం వాళ్లు గదులకే పరి మితం అయ్యారు. ఈ సందర్భంగా అక్కడ స్వచ్ఛంద సేవను అందిస్తున్న తెలంగాణకు చెందిన హెల్త్ కేర్ వర్కర్ విక్రమ్ తన అనుభవాలను 'జిం దగీ'తో పంచుకున్నారు. 'రియాద్‌లోని ఓ ఆస్పత్రిలో నేను పని చేస్తు న్నాను. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. విదేశాలకు వెళ్లా ల్సిన విమానాలను రద్దు చేశారు. దాదాపూ అన్ని షాపింగ్‌మాల్స్‌ను మూసేశారు. కొన్ని ఎమర్జెన్సీ విభాగాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. మెడికల్ అండ్ హెల్త్ స్టాఫ్‌కు పర్మిట్ లెటర్లను జారీ చేసింది. నాకూ పర్మిట్ లెటర్ ఉంది. దీంతో, ఇక్కడున్న తెలంగాణ ప్రజల్లో ఎవ రికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా నేను వెళ్తాను. నావంతు సహకారం అందిస్తున్నాను. కరోనా కావచ్చున్న అనుమానం వస్తే పరీక్షల కోసం ఆసుపత్రుల్లో చేరుస్తున్నాను' అంటారు జగిత్యాల జిల్లా వాసి విక్రమ్ పొలాస.

### మనం ఏం చేయవచ్చు..

- పెంపుడు జంతువులు వీధుల్లో కనిపిస్తే చేరదీసి, వాటికి ఆహారం పెట్టవచ్చు.
- అవసరమైన వారికి మందులు తెచ్చి ఇవ్వొచ్చు.
- స్థానికంగా ఫుడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయవచ్చు. లేదా ఫుడ్ బ్యాంక్‌కు భోజనం అందించవచ్చు.
- ఈ ఆపత్కాలంలో రక్తదానం చాలా అవ సరం. రెడ్ క్రాస్ సంస్థ అదే అభ్యర్థిస్తు న్నది. రక్తాన్ని, ప్లేట్‌లెట్లను దానం చేయ మని కోరుతున్నది.
- నిరాశ్రయులైన వారికి సాయం చేయవచ్చు.
- అత్యవసర విభాగాల సిబ్బందికి భోజనం అందించవచ్చు.
- క్రౌడ్‌ఫండింగ్ ద్వారా కరోనాపై పోరాడు తున్న సంస్థలకు విరాళాలు ఇవ్వవచ్చు.
- దృష్టికి వచ్చిన ఫేక్‌న్యూస్‌ను ఖండించ వచ్చు.
- ఒంటరితనంతోనో, అనారోగ్య భయం తోనో ఆందోళన పడుతున్న ఆత్మీయులకు ఫోన్‌లో ధైర్యం చెప్పవచ్చు.

భారతీయం

### వృక్షాసనం

**ఈ భంగిమ చెట్టును పోలి ఉంటుంది కాబట్టి, ఈ పేరు వచ్చింది. వృక్షాసనాన్ని సాధన చేయడం వల్ల కాళ్లలో బలం పెరుగుతుంది. ఏకాగ్రత అధికం అవుతుంది. శరీరాకృతి నిటారుగా వృక్షాన్ని తలపిస్తుంది.**

- నిటారుగా నిలబడి, రెండు చేతులూ తల మీదుగా పైకి లేపి జోడించాలి.
- ఒక కాలిని ఆసరాగా చేసుకొని, రెండో కాలిని మడిచి తొడ ప్రదేశంలో పాదాన్ని ఆనించాలి.
- ఈ ఒంటి కాలి భంగిమలో వీలైనంత సమయం ఉండాలి.





సందేహం సమాధానం

# ఒక మాస్క్.. ఎన్నో ప్రశ్నలు!

**కరోనా నివారణకు మాస్కు వేసుకో మంటున్నారు కదా? ఏ రకమైన మాస్కు వేసుకోవాలి? ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలా? ఒక మాస్కును ఎన్ని రోజులు వాడొచ్చు? దీన్ని ఎలా ఎక్కడ పడేయాలి? ఇలా మాస్కు వెనుక ఉన్న సందేహాలకు సమాధానం చెప్పగలరు.**
**- జ్యోత్స్న, వరంగల్**

**కరోనా** మహమ్మారి దేశంలోకి వచ్చిందనగానే ప్రతి ఒక్కరూ మాస్కుల కోసం పరుగులు తీశారు. అయితే ఇప్పటివరకు మన దేశంలోగాని, రాష్ట్రంలో గాని కరోనా రెండో దశలోనే ఉంది. ఇంకా 'కమ్యూనిటీ వ్యాప్తి' చెందలేదు. కాబట్టి ఈ దశలో ప్రతి ఒక్కరూ మాస్కు వేసుకోవాల్సిన అవసరం లేదు. కమ్యూనిటీ వ్యాప్తి ఉంటే మాత్రం... ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మాత్రం కరోనా పేషెంట్లతో డీల్ చేసే వైద్య సిబ్బంది; జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం లాంటి శ్వాసకోశ సమస్యల లక్షణాలున్నవాళ్లు మాస్కు ధరించాలి. పేషెంట్లను పరామర్శించడానికి హాస్పి టల్‌కి వెళ్లేవాళ్లు కూడా ధరించాలి. మాస్కు అనగానే, ఎన్-95 మాస్కు తప్పనిసరి అని అనుకుం టున్నారు. కానీ దళసరిగా ఉండే ఈ మాస్కును కరోనా పేషెంట్లకు చికిత్స అందించే వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది మాత్రమే ధరించాల్సిన అవసరం ఉంటుంది. మిగిలినవాళ్లు సాధారణ మూడు పొరలున్న (3-ప్లై) సర్జికల్ మాస్కు ధరిస్తే చాలు.

మాస్కు వేసుకున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. మాస్కు లోపలగానీ, బయటగానీ ముట్టు కోవద్దు. దానికి ఉండే బ్యాండ్స్‌ని పట్టుకుని మాస్కు తొడుక్కోవాలి. తీసేటప్పుడు కూడా వాటిని మాత్రమే పట్టుకోవాలి. ఈ మాస్కులో గాలి ఫిల్టర్ అవుతుంది. కాబట్టి మాస్కు ధరించకపోవడం కన్నా, ఈ మాస్కు పొరలను ముట్టుకోవడమే ఎక్కువ ప్రమాదకరం. కొందరు మాస్కుతో ముక్కు తుడుచుకుంటుంటారు. మాట్లాడేటప్పుడు మాస్కు తీసేస్తుంటారు. ఇది కరెక్ట్ కాదు. కొందరు ఒకే మాస్కును రెండు మూడు రోజులు వాడుతుంటారు. లేదా దాన్ని ఉతుక్కుని వాడుతుంటారు. కొందరు తాము పెట్టుకున్న మాస్కు తీసి పిల్లలకు పెడుతుంటారు. ఇవేవీ మంచిది కాదు. ఒకరి మాస్కు మరొకరు వేసుకోవద్దు. ఒక మాస్కును వీలైతే ఆరు గంటలు, లేదా కనీసం రోజుకొకటి మాత్రమే ధరిస్తే మంచిది. ఆ తరువాత తీసేసి, కొత్తది వేసుకోవాలి.

తొలగించిన మాస్కును వెంటనే కాల్చేయడం ఉత్తమం. లేదా మూత ఉన్న డస్ట్‌బిన్‌లో వేయాలి. డస్ట్‌బిన్‌లోని మాస్కులను మళ్లీ ముట్టుకోవద్దు. మున్సిపల్ సిబ్బంది లాంటివారు గ్లౌజ్ వేసుకుని మాత్రమే వీటిని కాల్చేయాలి. ఒకవేళ ముట్టుకోవాల్సి వస్తే చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తీసే సిన మాస్కులను సోడియం హైపోక్లోరేట్ ద్రావణం (30 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌కి నీళ్లు కలి పి)లో వేసినా ఫరవాలేదు. మాస్కు పొరపాటున కిందపడిపోతే దాన్ని ఇక వాడకూడదు.



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజిషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

## ఆరోగ్యంగా ఉన్నా క్యాన్సర్ స్క్రీనింగ్ ఎందుకు అవసరమంటే?

**క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తే వ్యాధిని నయం చేయడం అంత సులువు. క్యాన్సర్‌ను గుర్తించడానికి ముందస్తుగా కనిపించే లక్షణాలు, స్క్రీనింగ్ పరీక్షలు ఉపయోగపడుతాయి. లక్షణాలు బయటపడకముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తే వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం సాధ్యమవుతుంది. ఒక్కోసారి హెల్దీగా ఉన్నవారికి కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ అవసరం. ఎందుకంటే కొందరిలో వ్యాధి లక్షణాలు బయటపడకపోయినా లోపల క్యాన్సర్ ఉండొచ్చు. అందుకే అందరికీ స్క్రీనింగ్ పరీక్షలు అవసరం.**

సలహా





గడ్డలు, అసాధారణ రక్తస్రావం, చాలాకాలం పాటు అన్నం సరిగ్గా జీర్ణం కాకపోవడం వంటి అంశాలు క్యాన్సర్ ముందస్తు లక్షణాల్లో కొన్ని. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం, నోరు, పెద్దపేగు, చర్మ క్యాన్సర్ల వంటి వాటిల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి.

### స్క్రీనింగ్

అన్ని విధాలా ఆరోగ్యంగా కనిపించే వ్యక్తుల్లో కూడా దాగి ఉన్న క్యాన్సర్‌ను గుర్తించడానికి చేసే సాధారణమైన, సులభమైన పరీక్షనే స్క్రీనింగ్ అంటారు. ముందు జాగ్రత్తతో ఈ పరీక్షలను చేయించుకోవడం వల్ల ఎంతో లాభమే తప్ప నష్టం ఉండదు.

### క్యాన్సర్ వచ్చే అవకాశం ఎవరికి?

పొగతాగే అలవాటున్నవాళ్లు, గుట్కా, పాన్‌మ సాలా, జర్దా మొదలైనవి నమిలే అలవాటున్న వాళ్లు, మద్యానికి బానిసలైనవాళ్లు, సిర్రోసిస్ లాంటి కాలేయ వ్యాధులున్నవాళ్లు, వ్యాయామం చేయనివాళ్లు, ఊబకాయం ఉన్నవాళ్లు, ఆహా రంలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకునే వాళ్లు, పీచు పదార్థాలు తక్కువగా తీసుకునేవాళ్లు, ఆహారంలో మసాలాలు ఎక్కువ తినేవాళ్లు.



### మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు

**రొమ్ము క్యాన్సర్ :** నలభై ఏళ్లు నిండిన మహిళలు ప్రతి ఏడాది డిజిటల్ మామోగ్రామ్ పరీక్ష చేయిం చుకోవడం మంచిది.
20 నుంచి 30 ఏళ్లు నిండిన స్త్రీలు ప్రతి మూడే ళ్లకు ఒకసారి వైద్యులను కలిసి రొమ్ము పరీక్షలు చేయించుకోవాలి.
20 ఏళ్లు నిండిన ప్రతి మహిళా క్రమం తప్ప కుండా ఇంటివద్దనే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుంటూ ఉండాలి. రొమ్ముల్లో కణుతులు, గడ్డలు ఏమైనా ఉన్నాయేమోనని ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.


**గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ :** లైంగికంగా కల వడం మొదలుపెట్టిన మూడేళ్ల తర్వాత నుంచి ప్రతి మహిళా గర్భాశయ ముఖ ద్వారానికి స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. సాధారణ పీఏపీ పరీక్ష పద్ధతిలో ఏడాదికోసారి, అత్యాధు నిక లిక్విడ్ బేస్డ్ పీఏపీ పద్ధతిలో అయితే రెండేళ్ల కోసారి పరీక్ష చేయించుకోవాలి. 30 ఏళ్లు పైబడిన ప్రతి మహిళా ప్రతి మూడేళ్లకోసారి పీఏపీతో పాటు హెచ్‌పీవీ డీఎన్ఏ పరీక్ష చేయించుకుంటే మంచిది. కానీ హెచ్ఐవి ఉన్నవారు, అవయవ మార్పిడి చేయించుకున్నవారు, కీమోథెరపీ తీసు కునేవారు, మత్తుపదార్థాలకు బానిసలైనవారు.. ఈ కారణాలతో తగినంత రోగనిరోధక శక్తి కోల్పో యినవారంతా ప్రతి ఏడాది పైన చెప్పిన పరీక్ష చేయించుకోవాలి. పదేళ్లు నిండిన ఆడపిల్లలకు 46 ఏళ్ల లోపు మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇప్పించడం వల్ల 90 శాతం వరకు సర్వై కల్ క్యాన్సర్‌ని నివారించవచ్చు.

### వీళ్లకు పరీక్షలు అవసరం లేదు..

70 ఏళ్లు.. ఆ పైబడిన మహిళలతో పాటు గత పదేళ్లుగా పీఏపీ పరీక్షలో నార్మల్ ఫలితాలు వచ్చి నవారు స్క్రీనింగ్ పరీక్షలు ఆపేయవచ్చు.
హిస్టరెక్టమీ ద్వారా గర్భాశయంతో పాటు గర్భా శయ ముఖద్వారాన్ని కూడా తొలగించినవారిలో స్క్రీనింగ్ టెస్టులు చేయించాల్సిన అవసరం లేదు. అయితే కేవలం గర్భాశయాన్ని మాత్రమే తొల గించి, ముఖద్వారాన్ని తొలగించని సందర్భాల్లో మాత్రం స్క్రీనింగ్ పరీక్షలను కొనసాగించాలి.

### ప్రోస్టేట్ క్యాన్సర్

పురుషుల్లో వచ్చే క్యాన్సర్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. పురుషులకు తప్పకుండా ప్రోస్టేట్ క్యాన్స ర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని అనేక అంతర్జాతీయ సంస్థలు సూచిస్తున్నాయి. 50 ఏళ్లు నిండిన పురుషులు ప్రతి ఏడాదీ ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ (పీఎస్ఏ) రక్తపరీక్ష, డిజి టల్ రెక్టల్ పరీక్ష చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా (నాన్న, సోదరుడు, కొడుకు) ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్టయితే కుటుంబంలోని మిగతా పురుషులు 40 ఏళ్ల వయసు నుంచే ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలి.




**డాక్టర్ మోహనవంశీ**
**చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్,**
**ఒమేగా హాస్పిటల్స్**
**హైదరాబాద్: 9848011421**
**కర్నూల్: 08518-273001**
**గుంటూర్: 0863-2223300**

## ...నీళ్లెలా వస్తాయి?



కొబ్బరి బొండాంలోకి నీళ్లెలా వచ్చాయో ఎప్పుడైనా ఆలోచించారా? చెట్లు పెరిగేందుకు గాలి, సూర్యరశ్మిలతో పాటు నీరు కూడా అవసరమే. వీటితో చెట్లు బీజ పోషకం (ఎండో స్పెర్మ్) అనే ద్రవ పదార్థాన్ని తయారు చేసుకుంటాయి. కాయలు ఏర్పడటంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. కొబ్బరి చెట్లలో బీజోత్పత్తి కోసం ఇలా ఏర్పడిన ద్రవమే కొబ్బరినీళ్లు. సాధారణంగా చాలా చెట్లలో ఫలాలు ఏర్పడేటప్పటికే బీజ పోషక ద్రవం ఇంకిపోతుంది. కొబ్బరి చెట్లలో మాత్రం అలాగే ఉంటుంది. తర్వాత దశలో కొబ్బరి కాయ పరిమాణం పెరిగేటప్పటికి చిప్ప ఏర్పడి, దాని గోడలపై బీజ పోషక ద్రవం పలుచగా తెల్లటి పొరలుగా పేరుకోవడం ప్రారంభిస్తుంది. అదే లేత కొబ్బరన్నమాట. ఆ తర్వాత కాయ పెరిగే కొద్దీ కణ విభజన జరగటం వల్ల బీజ పోషక ద్రవ పరిమాణం పెరుగుతూ, కొన్నాళ్లకు పాలలాగా చిక్కగా మారుతుంది. ఈ దశలో కొబ్బరికాయ నీళ్లలో ఆవుపాలలో కంటే ఎక్కువగా ప్రొటీన్లు, పోషక పదార్థాలు ఉంటాయి. చక్కెర శాతం కూడా ఎక్కువగా ఉంటుంది. లేత కొబ్బరికాయలో కొబ్బరి కంటే కొబ్బరి నీరే ఎక్కువగా ఉంటుంది. ఈ కొబ్బరినీళ్లలో పొటాషియం, ఆస్కార్బిక్ ఆమ్లం లాంటి పదార్థాలు కలిసి ఉంటాయి. కాబట్టి లేత కొబ్బరి నీరు తాగటం వల్ల మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. కాయ ముదిరే కొద్దీ నీరు తగ్గిపోతుంటుంది.

### చుక్కలు కలుపండి



## స్నేహం





ఓ అడవిలో ఒక చెట్టుకింద నెమలి, పాము నివాసముండేవి. ఆ రెండింటికీ మంచి స్నేహం ఉండేది. ఒక రోజు ఓ ముంగిస పాము మీద దాడి చేయడానికి ప్రయత్నించింది. అప్పుడు పాము తనను రక్షించాలని నెమలిని కోరింది. వెంటనే నెమలి వచ్చి ముంగిసను ముక్కుతో పొడిచింది. అప్పుడు ఆ ముంగిస పామును వదిలేసి పారిపోయింది. మరో రోజు పాము, నెమలి ఓ చెట్టుకింద మాట్లాడుకుంటున్నాయి.అంతలో, ఓ వేటగాడు వచ్చి నెమలి మీద వలవేయబోయాడు. దాన్ని పాము గమనించింది. వెంటనే వెళ్లి వేటగాడి కాలిపై కాటేసింది. అనేక సందర్భాల్లో ఇలా ఒకదాన్ని ఒకటి రక్షించుకున్నాయి. మరో వైపు ఓ తోడేలు ఎప్పటి నుంచో నెమలిని తినాలని చూస్తున్నది. కానీ పాము, నెమలి కలిసి ఉంటే తన కల నెరవేరడం కష్టం అనుకుంది. రెండింటినీ విడగొడితే తాను అనుకున్న పని అవుతుందన్న నిర్ణయానికొచ్చి, గొడవ పెట్టాలనుకుంది. ఓరోజు తోడేలు, ఒంటరిగా ఉన్న నెమలి దగ్గరకు వెళ్లి.. 'పాము నిన్ను తినాలని చూస్తున్నది' అని అబద్ధం చెప్పింది. మరోసారి ఒంటరిగా ఉన్న పాము దగ్గరకు వెళ్లి 'నెమలి నిన్ను తినాలని చూస్తున్నది' అని చెవిలో వేసింది. ఇలా గొడవపెట్టి రెండింటినీ దూరం చేయాలనుకుంది.కానీ తోడేలు పథకాన్ని ముందే ఊహించిన పాము, నెమలి.. ఆ మాటలను నమ్మలేదు. సమయం చూసి బుద్ధి చెప్పాలనుకున్నాయి. రెండూ కలిసి వెళ్లి తోడేలు మీద దాడి చేశాయి. ఆ దెబ్బలు భరించలేక తోడేలు కుయ్యో మొర్రో అంటూ పారిపోయింది.

**నీతి**
ఎవరి మాటలనూ గుడ్డిగా నమ్మవద్దు.

### పద్యం

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ



**భావం:** కమలాలు నీటిలో ఉన్నప్పుడు సూర్యునితో చెలిమి చేసి, ఎండ వేడిమి తాకగానే విచ్చుకుంటాయి. కానీ అవి నీటిని వదిలేసినప్పుడు అదే సూర్యరశ్మి వల్ల కమిలిపోతాయి. అలాగే, మానవులు తమ తమ స్థానాలను... అంటే, విలువలను విడిచి పెడితే స్నేహితులే శత్రువులు అవుతారని అర్థం.

### పొడుపు కథలు



1. ఇంతింత గుడి కాదు, ఈశ్వరుని గుడి కాదు. కంచు కొప్పెర కాదు, కదిలించరాదు.
2. ఇనుపకట్ల బండి నాది. తొక్కితే నా బండి తొంబై ఆమడలు పోతుంది.
3. ఇక్కడ నుంచి చూస్తే గుండు. గుండును కొడితే పండు. పండును కొడితే పదహారు రెబ్బలు. ఏమిటది?
4. ఇద్దరు ఆడే ఆట. తీయని ఆటకు బంట్లు ఇద్దరు.

### ఈ శాస్త్రజ్ఞుల పేర్లు గుర్తించండి




1 2 3

### జవాబులు

పొడుపు కథలు
1. ఎండ 2. సైకిల్
3. వెల్లుల్లిపాయ
4. చదరంగం

శాస్త్రజ్ఞులు
1. అల్బర్ట్ ఐన్‌స్టీన్
2. స్టీఫెన్ హాకింగ్
3. మేడం క్యూరీ

### దారి కనుక్కోండి




# చిత్రం

## సూర్యోదయాల్ని ఆస్వాదిస్తున్నా!



రెజీనా

కరోనా ప్రభావంతో షూటింగ్‌లకు బ్రేక్ పడటంతో ఈ విరామ సమయాన్ని మనసుకు నచ్చిన సినిమాలు చూస్తూ పరిపూర్ణంగా సద్వినియోగం చేసుకుంటున్నాని చెప్పింది చెన్నై సొగసరి రెజీనా. ఆమె మాట్లాడుతూ 'కొన్ని సినిమాలు, సిరీస్‌లను చూడమని కొద్దిరోజుల క్రితం నా స్నేహితులు సూచించారు. ఇన్నాళ్లు షూటింగ్‌లతో బిజీగా ఉండటంతో వాటిని చూడలేకపోయాను. ఇప్పుడవన్నీ పూర్తిచేసే పనిలో ఉన్నాను. ఉదయం ఆరున్నరకు నిద్రలేవడంతో నా దినచర్య ప్రారంభమవుతుంది. మా ఇంటి బాల్కనీ తూర్పు దిశలో ఉంటుంది. కానీ నాకు ఏనాడు సూర్యోదయాన్ని చూసే వీలు చిక్కలేదు. ప్రస్తుతం తీరిగ్గా సమయాన్ని గడిపే రోజు ఉండటంతో బాల్కనీలో నుంచి సూర్యోదయంలోని అందాన్ని ఆస్వాదిస్తున్నా. పక్షుల కిలకిలరావాలతో పరవశించిపోతున్నా. ఇంటిచుట్టూ ఇన్ని అందాలున్నాయనే విషయం ఇప్పుడే తెలిసింది' అని చెప్పుకొచ్చింది.

## ప్రణయ వర్ణాలు



'రంగ్‌దే' చిత్రంలో కీర్తి సురేష్, నితిన్

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగ్‌దే'. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్ కథానాయిక. నేడు నితిన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్ర మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమాలో నాయకానాయికలు పాత్రల పేర్లను అర్జున్, అనుగా పరిచయం చేస్తూ మోషన్ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. ప్రేమలోని అనుభూతులకు, అందమైన వర్ణాలకు దర్పణంగా సాగే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. చిత్రానికి సినిమాటోగ్రఫీ: పి.సి.శ్రీరామ్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, రచన-దర్శకత్వం: వెంకీ అట్లూరి.

**నితిన్ పెళ్లి వాయిదా**

లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్ 16న జరగాల్సిన తన పెళ్లిని వాయిదా వేసుకుంటున్నట్లు హీరో నితిన్ తెలిపారు. 'మనందరం కరోనాపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఈ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే దేశానికి సేవ చేసినట్లు. లాక్‌డౌన్ కారణంగా నేడు జరుపుకోవాల్సిన నా పుట్టినరోజు వేడుకల్ని కూడా రద్దు చేసుకున్నా' అని నితిన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## బాలీవుడ్‌లో విరాళాల వెల్లువ



సన్నీడియోల్



సల్మాన్‌ఖాన్



భూషణ్‌కుమార్

కరోనా వైరస్‌ను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చేస్తున్న పోరాటానికి భాషాభేదాలకు అతీతంగా సినీ ప్రముఖులంతా అండగా నిలుస్తున్నారు. బాలీవుడ్ అగ్రనటుడు అక్షయ్‌కుమార్ ఇరవై ఐదు కోట్లు విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన బాటలోనే మరికొందరు స్టార్ విరాళాల్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. టీ సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ 11 కోట్ల విరాళాన్ని అందజేశారు. రణదీప్ హుడా కోటి, సన్నీడియోల్ యాభై లక్షలు విరాళాన్ని ఇచ్చారు. బాలీవుడ్ హీరో వరుణ్‌ధావన్ కేంద్రానికి ముప్పై లక్షలు, మహారాష్ట్ర ప్రభుత్వానికి ఇరవై ఐదు లక్షల్ని ప్రకటించారు. గాయకుడు గురురంధ్వా ఇరవై లక్షలు విరాళంగా ఇచ్చారు. బీయింగ్ హ్యూమన్ ఫౌండేషన్ ద్వారా సల్మాన్‌ఖాన్ లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఇరవై ఐదు వేల మంది సినీ కార్మికుల్ని ఆదుకోవడానికి సిద్ధమయ్యారు. కబీర్‌సింగ్ నిర్మాత మురద్ ఖేతాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి 25లక్షలు అందించారు. రాజ్‌కుమార్‌రావ్‌తో పాటు మరికొందరు సినీ నటులు ప్రధానమంత్రి సహాయనిధికి విరాళాల్ని అందజేశారు.



వరుణ్‌ధావన్

## కార్మికుల శ్రేయస్సు కోసం..

కరోనా కారణంగా దేశవ్యాప్తంగా ప్రకటించిన 21రోజుల లాక్‌డౌన్ ప్రభావం సినీ కార్మికులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. చిత్రీకరణలన్నీ నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కరువై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా పరిశ్రమలో పనిచేసే దినసరి కార్మికులపై లాక్‌డౌన్ ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో కార్మికుల సంక్షేమం కోసం చిరంజీవి ఛైర్మన్‌గా 'కరోనా క్రైసిస్ చారిటీ మనకోసం'ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనికి సినీ ప్రముఖుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం విరాళాలు ప్రకటించిన వారి వివరాలివి..



దిల్‌రాజు-10లక్షలు



వరుణ్‌తేజ్-20లక్షలు



శర్వానంద్-15లక్షలు



సాయిధరమ్‌తేజ్-10లక్షలు



విశ్వక్‌సేన్-5లక్షలు
లావణ్య త్రిపాఠి-1లక్ష
సంపూర్ణేష్‌బాబు-1లక్ష



కార్తికేయ-2లక్షలు
వెన్నెల కిషోర్-2లక్షలు



నాగచైతన్య-25లక్షలు



రవితేజ-20లక్షలు

## నిర్మాత ప్రసాద్ కన్నుమూత



'అమరం అఖిలం ప్రేమ' చిత్ర నిర్మాత వి.ఇ.వి.కె.డి.ఎస్ ప్రసాద్ శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన 1967లో కాకినాడలో జన్మించారు. ప్రసాద్‌కు భార్య పద్మజతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రముఖ దర్శకుడు సుకుమార్‌కు అత్యంత సన్నిహితుల్లో ప్రసాద్ ఒకరు. స్నేహితుడి మరణం తనను ఆవేదనకు లోనుచేసిందని సుకుమార్ అన్నారు. 'ప్రసాద్ నాలో ఎప్పుడూ ఎనర్జీని నింపుతుండేవారు. నాకు సంబంధించినంతవరకు అతడి స్థానాన్ని ఎవరూ రీప్లేస్ చేయలేరు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబసభ్యులకు నా ప్రగాఢసానుభూతిని తెలియజేస్తున్నాను' అని సుకుమార్ తెలిపారు.





# మహమ్మారిపై సమష్టి యుద్ధం

- కరోనా కట్టడికి సమన్వయంతో పనిచేస్తున్న ప్రభుత్వ శాఖలు
- పకడ్బందీగా నివారణ చర్యలు.. అలుపెరగకుండా సేవలు
- ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న అధికారులు
- ఇళ్ల నుంచి బయటకు రాకుండా అవగాహన కార్యక్రమాలు
- విజయవంతంగా కొనసాగుతున్న లాక్‌డౌన్



కరీం'నగరం'లో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

**ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా మహమ్మారి నియంత్రణకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం సమష్టిగా యుద్ధం చేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపుతో జిల్లాల వారీగా రంగంలోకి దిగి, నివారణ చర్యలు చేపడుతున్నది. వైద్య, ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖలతోపాటు మరి కొన్ని శాఖలు ఈ విపత్కర సమయంలో తమవంతు బాధ్యతను పక్కాగా నిర్వర్తిస్తున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించి, ఇండ్లకే పరిమితం చేస్తూ లాక్‌డౌన్‌ను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న కరీంనగరంలో పకడ్బందీగా వ్యవహరిస్తూ, స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.**

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** విశ్వమారి కరోనా కట్టడికి ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 22న ప్రజలు జనతా కర్ఫ్యూ పాటించారు. వైరస్ తీవ్రతను గమనించిన సీఎం రాష్ట్రంలో ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని వచ్చే నెల 14 వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అధికారులు సమష్టిగా శ్రమిస్తున్నారు. మహమ్మారిని నియంత్రించేందుకు వైద్య, ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో అలుపెరగని యుద్ధం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, పకడ్బందీగా నివారణ చర్యలు చేపడుతున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే జిల్లా అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ఒక్కో మండలానికి ఒక్కో ఇన్‌చార్జిని నియమించి, హోం క్వారంటైన్‌లో ఉన్న వారిని పర్యవేక్షిస్తున్నారు. అంతే కాకుండా ఐసోలేషన్ వార్డులకు నోడల్ అధికారులుగా పనిచేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సుమారు నాలుగు వేల మంది మూడు షిఫ్టులుగా రేయింబవళ్లు పహారా కాస్తున్నారు. జిల్లా సరిహద్దులతోపాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టులు, అవుట్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రాకుండా, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రోడ్డెక్కకుండా చూస్తున్నారు. ఇటు ప్రభుత్వ వైద్యులు, వైద్య సహాయ సిబ్బంది రిస్క్ ఉన్నా భయపడకుండా షిఫ్టుల వారీగా 24గంటల పాటు సేవలందిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు బృందాలుగా ఏర్పడి, అనుమానితులను గుర్తిస్తున్నారు. ఇలాంటి వారు ఇంటి నుంచి బయటికి వెళ్లకుండా చూస్తున్నారు. విదేశాల నుంచి వచ్చి హోం క్వారంటైన్ ఉన్న వారిని రోజుకు రెండు మూడు సార్లు కలిసి వస్తున్నారు. ఐసోలేషన్ వార్డులను వైద్యాధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్, పంచాయతీ శాఖల సిబ్బంది కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో శుభ్రత కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. వీధుల్లో రసాయనాలు చల్లుతున్నారు. ఇందుకు ఆధునిక యంత్రాలను కూడా ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న కరీంనగరంలో నగర పాలక సంస్థ సిబ్బంది విస్తృత చర్యలు చేపడుతున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు తమ వంత పాత్ర పోషిస్తున్నారు. పూర్తిగా ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలను సేకరించడం, వారిని హోం క్వారంటైన్‌లో ఉంచడం, వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. హోం క్వారంటైన్ నుంచి తప్పించుకుని తిరిగే వారిపై కేసులు పెడుతున్నారు. ప్రజలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయిస్తున్నారు. మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో నిత్యావసరాల ధరలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూరగాయల మార్కెట్లు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వలస కూలీలను గుర్తించి వారికి వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఇలా ఆయా శాఖల ఆధ్వర్యంలో పకడ్బందీ చర్యలు చేపడుతూ, కరోనా కట్టడికి శ్రమిస్తున్నారు.

### కరీంనగర్ జిల్లాలో పకడ్బందీ నిఘా..

కరీంనగరానికి వచ్చిన 10 మంది ఇండోనేషియావాసులతోపాటు కశ్మీర్‌గడ్డకు చెందిన మరో వ్యక్తికి పాజిటివ్ రావడంతో జిల్లా అధికారులు అలర్ట్ అయ్యారు. అప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి అందిన ఆదేశాలతో రంగంలోకి దిగి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో శరవేగంగా నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా అధికారులకు కలెక్టర్ శశాంక కీలక బాధ్యతలు అప్పగించారు. ఐసోలేషన్ వార్డులకు నోడల్ అధికారులను నియమించారు. ఇండోనేషియా వాసులు తిరిగిన ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించగా, సీపీ కమలాసన్‌రెడ్డి నేతృత్వంలో పహారా కాస్తున్నారు. ఐదు చోట్ల ఔట్‌పోస్టింగ్‌లు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్నారు. నగరంతోపాటు కమిషనరేట్ పరిధిలో వెయ్యి మంది పోలీసులు నిత్యం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ నేతృత్వంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సేవలందిస్తున్నారు. రెడ్ జోన్ ఏరియాల్లో నాలుగు రేషన్ దుకాణాల పరిధిలోని నాలుగు వేల కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. అంతే కాకుండా ఐసోలేషన్ వార్డులను పర్యవేక్షిస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో నిత్యం 900 మంది కార్మికులు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు డ్రోన్లు, ప్రొటెక్టర్ 600 యం త్రాలు, పవర్ స్ప్రేలతో రసాయనాలు చల్లుతున్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా పెద్దఎత్తున స్ప్రే చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, కమిషనర్ క్రాంతి పర్యవేక్షిస్తున్నారు. ఇటు 313 గ్రామాల్లో 1,600 కార్మికులు పారిశుధ్య సేవలో నిమగ్నమవుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సుమారు 500 మంది నిరంతరం సేవలందిస్తున్నారు.

### జగిత్యాల జిల్లాలో 5,100 మంది..

**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జిల్లాలో 5100 మంది అధికారులు, సిబ్బంది అత్యవసర సేవల్లో పాల్గొంటున్నారు. కలెక్టర్ గుగులోతు రవి నేతృత్వంలో వీరంతా నిరంతర సేవలందిస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 480 మంది, రెవెన్యూ నుంచి 300మంది, పంచాయతీరాజ్ నుంచి 1500, మున్సిపాలిటీ 750, విద్యుత్ శాఖ నుంచి 977 మంది, వైద్య ఆరోగ్య శాఖలో 1100 మంది సిబ్బంది సేవల్లో నిమగ్నమయ్యారు.

### పెద్దపల్లి జిల్లాలో 5,346 మంది..

**పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కలెక్టర్ సిక్తా పట్నాయక్ నేతృత్వంలో జిల్లా అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. మొత్తం 5,346మంది నిరంతరం సేవలందిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 1,388 మంది, రెవెన్యూ శాఖ పరిధిలో 880 మంది, పోలీస్‌శాఖ పరిధిలో 650 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. సీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు నిరంతరం పహారా కాస్తున్నారు. పల్లెల్లో 1,234 పారిశుధ్య సిబ్బంది శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నారు. 225 మంది పంచాయతీ కార్యదర్శులు, 14మంది ఈవోపీఆర్డీలతోపాటు ఇతర సిబ్బంది కలిసి మొత్తంగా 1473 మంది కరోనా కట్టడికి కృషి చేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో 413 మంది పారిశుధ్య సిబ్బందితోపాటు మరో 172 మంది ఇతరులు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాల్టీల పరిధిలో 187 మంది పారిశుధ్య సిబ్బంది, 153 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు ఫైర్ ఇంజిన్లతో వైరస్ నివారణ కోసం రసాయనాలను స్ప్రే చేస్తుండగా, ఇందులో 30 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గర్భిణులు, బాలింతలతోపాటు ప్రీ స్కూల్ విద్యార్థులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పోషకాహారం అందిస్తున్నారు. కలెక్టర్ సూచనల మేరకు జిల్లా సర్వేలెన్స్ అధికారి శ్రీరాం ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది. పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి స్టాంపులు వేసి, హోం క్వారంటైన్ చేయడంతోపాటు నిత్యం రెండు సార్లు పరిశీలిస్తున్నది.



నిర్మానుష్యంగా మంకమ్మతోట ప్రధాన రహదారి



స్ప్రే చేస్తున్న బల్దియా సిబ్బంది



కరీం'నగరం'లోని ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బంది

### రాజన్న సిరిసిల్లలో 3,718 మంది..

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కలెక్టర్ కృష్ణభాస్కర్ నిత్యం క్షేత్రస్థాయిలో తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే కూడా పరిశీలిస్తున్నారు. కలెక్టర్ నేతృత్వంలో వివిధ శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,718 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ఇందులో 600మంది పోలీసులు, 186 మంది రెవెన్యూ, 1,465 మంది పంచాయతీరాజ్, 415మంది మున్సిపల్, 367 మంది సెస్ (విద్యుత్), 685 మంది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం విధులు నిర్వర్తిస్తున్నారు.

### ఆసిఫాబాద్ జిల్లాలో 2,242 మంది..

**కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జిల్లాలో 2,242 మంది అధికారులు, సిబ్బంది భాగస్వాములయ్యారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నేతృత్వంలో నిరంతరం శ్రమిస్తూ సమన్వయంతో పనిచేస్తున్నారు. ఇందులో పోలీసు శాఖ నుంచి 600మంది, రెవెన్యూ 365మంది, వైద్య 101మంది, అటవీ సిబ్బంది 220, పంచాయతీ కార్మికులు 650, మున్సిపల్ సిబ్బంది 152, మున్సిపల్ 132 అగ్నిమాపక సిబ్బంది 22 నిరంతరం అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

### మంచిర్యాల జిల్లాలో 4,729 మంది..

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నియంత్రించడంలో జిల్లా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్, సెస్(విద్యుత్ సంస్థ), వైద్య ఆరోగ్య శాఖలు నిరంతరంగా పనిచేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సిబ్బంది 4,729 మంది పని చేస్తున్నారు. ఇందులో పోలీసులు 1,049, రెవెన్యూ 782, పంచాయతీరాజ్ సిబ్బంది 1,331, మున్సిపల్ 577, వైద్య ఆరోగ్యశాఖ 990 మంది ఉన్నారు.



షాపింగ్ ఏరియాలో సోడియం హైపో క్లోరైడ్‌ను స్ప్రే చేస్తున్న పుట్ట మధు, పుట్ట శైలజ

## ప్రజా సేవలో ముందుండాలి

- **పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

**మంథనిటౌన్ :** కరోనా కట్టడి కోసం సీఎం కేసీఆర్ చేపడుతున్న చర్యలపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ కొనియాడారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోడియం హైపో క్లోరైడ్ ఫైర్ ఇంజిన్, పోర్టబుల్ స్ప్రేయర్ మిషన్లను పట్టణంలో జడ్పీ చైర్మన్ ప్రారంభించారు. అంబేద్కర్‌చౌరస్తా, బస్టాండ్, షాపింగ్ ఏరియాల్లో ఫైర్ ఇంజిన్, మిషిన్ల ద్వారా రసాయనాలను స్ప్రే చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య పరమైన సేవ చేసే అదృష్టం ఇప్పుడు కలిగిందని, దీనిని ప్రజాప్రతినిధులు, నాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇళ్లకే పరిమితం కావాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రసాయనాలను స్ప్రే చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ తెలిపారు. ఎంపీపీ కొండ శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎస్ఐ ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.



చొప్పదండి: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## స్వీయ నియంత్రణతో కరోనా కట్టడి

- **చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**చొప్పదండి, నమస్తే తెలంగాణ/గంగాధర/రామడుగు:** స్వీయ నియంత్రణతో కరోనా వైరస్‌ను కట్టడి చేయవచ్చని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం చొప్పదండి పట్టణంలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలపై ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో, అలాగే గంగాధర మండలానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చొప్పదండిలో నిరుపేదల వివరాలు తెలుసుకుని వారికి అండగా ఉండేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారు నియోజకవర్గంలో 473 మంది ఉన్నారని తెలిపారు. 300 మందిని క్వారంటైన్‌లో ఉంచడానికి చొప్పదండి నవోదయ పాఠశాలలో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. చొప్పదండి దవాఖానలో ఐసోలేషన్ కోసం 22 పడకలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. గంగాధర మండలంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 1200 మంది కూలీలు 74 మంది కాం ట్రాక్టర్ల వద్ద పని చేస్తున్నారని, లాక్‌డౌన్ నేపథ్యంలో వారికి సౌకర్యాలు, భోజన వసతి కల్పించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రామడుగు మండలం వెంకట్రావుపల్లిని ఆదివారం ఉదయం సందర్శించిన ఎమ్మెల్యే, కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా చేపట్టిన చర్యలను మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, సర్పంచ్ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

## ❖ హైదరాబాద్ టూ ఉత్తరప్రదేశ్..



లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కూలీలు సొంత ప్రాంతాలకు వెళ్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటి వేల కిలోమీటర్లు పిల్లాపాపలతో కాలినడకన పయనం అవుతున్నారు. హైదరాబాద్‌లో కూలీలుగా పనిచేస్తున్న దాదాపు 30 మంది ముల్లెమూటతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మీదుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకు వెళ్తున్నారు. దాదాపు 1,266 కిలోమీటర్లు ఉండగా.. 20 రోజులకు పైగా పట్టే అవకాశం ఉన్నది. ఆదివారం శ్రీరాంపూర్ చేరుకున్నారు. - పెద్దపల్లి రూరల్/శ్రీరాంపూర్

## ❖ గొడుగులతో సామాజిక దూరం..



కరోనా కట్టడికి స్వీయ నియంత్రణతోపాటు సామాజిక దూరం తప్పనిసరి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లినప్పుడు కనీసం మీటర్ దూరం పాటించాల్సిందే. సిరిసిల్ల మున్సిపల్ ఉపాధ్యక్షుడు మంచె శ్రీనివాస్ కొత్తగా ఆలోచించారు. అత్యవసర సమయాల్లో బయటికి వెళ్తే గొడుగులను తీసుకెళ్లడం వల్ల వ్యక్తుల నడుమ దూరం ఏర్పడుతుందని చెప్పారు. ఆదివారం కొత్తబస్టాండ్ వద్ద ఇలా గొడుగులు పట్టుకొని అవగాహన కల్పించారు. - సిరిసిల్ల టౌన్

## పేదల కోసమే అన్నదాన కేంద్రాలు

- **రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ :** పేదల ఆకలి తీర్చేందుకే విజయమ్మ ఫౌండేషన్ ద్వారా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గంగానగర్‌లో అన్నదాన కేంద్రాన్ని ప్రారంభించారు. కూలీలకు అండగా ఉండేందుకు విజయమ్మ ఫౌండేషన్‌తోపాటు శ్రీ ధర్మ శాస్త్ర నిత్యాన్నదాన వేదిక, మార్వాడీ సమాజ్ సంయుక్తంగా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు ఉన్నారు.

మంత్రి కేటీఆర్ 'హ్యాండ్ వాష్' ఛాలెంజ్‌ను ఎమ్మెల్యే కోరుకంటి స్వీకరించారు. క్యాంపు కార్యాలయంలో చేతులను శుభ్రం చేసుకొని, మంత్రి కొప్పుల, సీపీ, మేయర్, డిప్యూటీ మేయర్‌కు సేఫ్ హ్యాండ్‌వాష్ చాలెంజ్ విసిరారు.



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## వ్యక్తిగత శుభ్రత పాటించాలి

- **జగిత్యాల కలెక్టర్ రవి**



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**మేడిపల్లి :** గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే కరోనా వైరస్‌ను నియంత్రించవచ్చని జగిత్యాల జిల్లా కలెక్టర్ గుగులోత్ రవి పేర్కొన్నారు. మేడిపల్లి మండల కేంద్రం, కట్లకుంట గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. కరోనా నివారణ చర్యలను పరిశీలించారు. అనవసరంగా బయట తిరిగిన 39 మందిపై కేసులు పెట్టామని పేర్కొన్నారు. లాక్‌డౌన్ ఎన్ని రోజులుంటే అన్ని రోజులు బయట తిరగకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి 9200 మంది వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ వేతనం నుంచి రూ.లక్ష చెక్‌ను కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ వెంట జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు ఉన్నారు.

## రెడ్‌జోన్‌లో మొబైల్ ఏటీఎం సేవలు

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** నగరంలోని కరోనా ప్రభావిత ప్రాంతాల రెడ్‌జోన్ పరిధిలోని ముకరంపుర, కశ్మీర్‌గడ్డలో బ్యాంకు సేవల కోసం మొబైల్ ఏటీఎం సెంటర్లను ఏర్పాటు చేశారు. కేడీసీసీబీకి చెందిన మొబైల్ వ్యాన్లను రెడ్‌జోన్ పరిధిలో శని, ఆదివారాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. కరీంనగర్ మేయర్ సునీల్‌రావు ప్రత్యక్షంగా పరిశీలించారు.

## ఏప్రిల్ 10దాకా ఎస్సారెస్పీ నీరు

- **రైతులు పండించిన ప్రతి గింజనూ కొంటాం**
- **రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**పెగడపల్లి :** లాక్ డౌన్ నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన 'నమస్తే'తో మాట్లాడుతూ ఏప్రిల్ 10వరకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కోతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మన ప్రాంతానికి చెందిన వరి కోత యంత్రాలు ఆంధ్రా, ఇతర రాష్ట్రాల్లో నిలిచి పోయాయని, వాటిని ఇక్కడకు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్యారేజీలు, స్పేర్‌పార్ట్‌ల కోసం ఆటోస్టోర్లు మూసివేయడంపై అధికారులతో చర్చించి ఇబ్బందుల్లేకుండా చూస్తామని వివరించారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని, స్థానికంగా హమాలీలను ఏర్పాటు చేసుకునేలా సెర్ప్, సహకార సంఘాల బాధ్యులు చూసుకోవాలని సూచించారు.

## కరీంనగర్ పోలీసులకు మరో సాంకేతిక అస్త్రం

**కరీంనగర్ క్రైం :** కరీంనగర్ కమిషనరేట్ పోలీసులకు మరో సాంకేతిక అస్త్రం అందుబాటులోకి వచ్చింది. శాంతిభద్రతలకు భంగం కలిగిన సందర్భాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు సాగేందుకు వీలుగా నూతనంగా మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనం ఇప్పటికే నగరానికి చేరుకున్నది. శనివారం ఈ వాహనంలో కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి నగరంలో పరిశీలించిన విషయం తెలిసిందే. ఇందులో మూడు కెమెరాలు ఉండగా ఒకటి పీటీజెడ్ 360 డిగ్రీలలో తిరగనుండగా, మరో రెండు కెమెరాలు చుట్టుపక్కల జరిగే దృశ్యాలను రికార్డు చేస్తాయి. ఇందులో ఉన్న మైకులతో ప్రజలకు తగు సూచనలు, జాగ్రత్తలు, హెచ్చరికలు చేసే వీలుంటుంది. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో సాయంత్రం 7 నుంచి ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ నిర్వహిస్తుండడంతో ఈ వాహనాన్ని వినియోగిస్తున్నారు. కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ప్రత్యేక శిక్షణ పొంది ఈ వాహనానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కరోనా వైరస్ నియంత్రణ చర్యలు, శాంతి భద్రతల్లో తలెత్తే సమస్యలపై సత్వరం స్పందించి సేవలందించడంతో పాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం కమిషనరేట్‌కు ఈ వాహనాన్ని మంజూరు చేసిందని సీపీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.





## సిబ్బందికి బియ్యం పంపిణీ



మాస్కులు అందజేస్తున్న కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** నగరంలో కర్ఫ్యూ ఉన్నందున తన క్యాంపు కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికీ 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్లు అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ తెలిపారు. ఆదివారం ఉదయం బియ్యం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. బియ్యంతో పాటు మాస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. లాక్‌డౌన్ సందర్భంగా వ్యాపారులు నిత్యావసర సరుకులు బ్లాక్ చేయవద్దని, చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో కర్ఫ్యూ ఉన్నందున అందరూ ఇళ్లకే పరిమితం కావాలన్నారు. మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రజలు దగ్గరగా ఉండవద్దన్నారు.

## గుడి చెరువు నుంచి నీటి విడుదల

**వేములవాడ, నమస్తేతెలంగాణ :** కష్టకాలంలోనూ ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమాన్ని మరవడం లేదని వేములవాడ మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవిరాజు పేర్కొన్నారు. ఆదివారం గుడిచెరువు కింద యాసంగి వరికి నీటిని విడుదల చేసి మాట్లాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మధురాజేందర్, ఇరిగేషన్ డీఈ ప్రశాంత్, ఏఈ నవీన్‌కుమార్, సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, రైతు సమన్వయ సంఘం అధ్యక్షులు లైశెట్టి మల్లేశం, పార్టీ పట్టణాధ్యక్షులు పుల్కం రాజు, కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

**వేములవాడ కల్చరల్ :** శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో ఐదో రోజు ఆదివారం స్వామివారికి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం రాజన్నకు, శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచోపనిషత్తులద్వారా అభిషేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్, ఈశ్వరగారి సురేశ్, గోపన్నగారి నాగన్న, మామిడిపెల్లి శరత్, పురాణం నరేందర్, ఒజ్జల ఆదిత్య తదితరులు ఉన్నారు.

## ఆపదలో అండ

**జగిత్యాల రూరల్ /జగిత్యాల క్రైం :** మోతెకు చెందిన గంగారాం అనే వికలాంగుడు ఆదివారం రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిపోగా సర్పంచ్ సురకంటి స్వప్న భర్త రాజేశ్వర్ రెడ్డి తన కారులో జగిత్యాల దవాఖానకు తరలించారు. రాయికల్ మండలం కుమ్మరిపెల్లికి చెందిన ఓ గర్భిణి శనివారం నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108లో జగిత్యాల వైద్యశాలకు తీసుకొచ్చారు. పరీక్షల తర్వాత వైద్యులు ఆదివారం డిశ్చార్జ్ చేశారు. కాగా గ్రామానికి వెళ్లేందుకు వాహనాలు లేకపోవడంతో అదే ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ మహేందర్ వారికి పండ్లు అందించి ఆటోలో స్వగ్రామానికి పంపించారు. మందులకోసం రూ.వెయ్యి అందజేశారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తనివ్వం

**రాయికల్ రూరల్ :** వరి దిగుబడులు చేతికొచ్చే సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రాయికల్ మండలం కొత్తపేట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా ఆదివారం ఉదయం మరమ్మతులు చేపట్టారు. వరి పొట్టకు వచ్చే సమయంలో సాగునీరందక నష్ట పోయే అవకాశమున్నందున వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించామని వివరించారు.

## స్వగ్రామాలకు రప్పించండి

**కొడిమ్యాల :** ఉపాధి కోసం పక్క రాష్ట్రానికి వెళ్లి లాక్‌డౌన్‌తో అక్కడ చిక్కుకుపోయిన పలువురు యువకులు తమను స్వగ్రానికి రప్పించాలని వేడుకుంటున్నారు. కోనాపూర్ గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు ఉపాధి కోసం నెల రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా ధనలక్ష్మీపురానికి బ్లేడ్ ట్రాక్టర్ డ్రైవర్లుగా వెళ్లారు. పనులు లేక ఇబ్బంది పడుతున్నామని తమను స్వగ్రామాలకు రప్పించాలని పులి తిరుపతి,యామ శేఖర్, పొన్నం గణేశ్, మూడపల్లి రాము, ఎనుగందుల నిఖిల్, బండపల్లి జలేందర్, తిర్మలాపూర్‌కు చెందిన సకునూరి వెంకటేశ్ కోరారు.

## ఫ్రీ హోం డెలివరీ కేంద్రాలు గుర్తింపు

**మంచిర్యాల అగ్రికల్చర్ :** మంచిర్యాల జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల పరిధిలో ప్రజలు నిత్యావసర సరుకుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కలెక్టర్ భారతి ఆదేశాల మేరకు 54 ఫ్రీ హోం డెలివరీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వినోద్ కుమార్ తెలిపారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 25, చెన్నూర్‌లో 2, మందమర్రిలో 9, బెల్లంపల్లిలో 2, లక్సెట్టిపేటలో 2, నస్పూర్‌లో 11, క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన మూడు సూపర్ మార్కెట్ల నుంచి నిత్యావసర సరుకులు అవసరమైన వారు పొందవచ్చన్నారు. గుర్తించిన కేంద్రాల మొబైల్ నంబర్‌లకు సరుకుల లిస్ట్, ఇంటి అడ్రస్ పేపర్‌పై రాసి వాట్సప్ చేస్తే సదరు కిరాణం నుంచి సిబ్బంది సరుకులు డెలివరీ చేస్తే సదరు యజమాని డబ్బులు యూపీఐ(గూగల్ పే, ఫోన్ పే, పేటీఎం) ద్వారా అందజేయాల్సి ఉంటుందన్నారు.

# మేమున్నామని..

లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలు, కూలీలు, యాచకులకు సామాజిక సేవా కార్యకర్తలు అండగా నిలుస్తున్నారు. కష్ట కాలంలో తామున్నమంటూ భరోసా ఇస్తున్నారు. పనుల్లేక పస్తులుంటున్న పేదల, భిక్షాటన చేసే వారి కడుపు నింపుతున్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న కార్మికుల ఆకలి తీరుస్తున్నారు. ఇటు నిరంతర సేవలందిస్తున్న పోలీసులకు, పారిశుధ్య కార్మికులకు సైతం అల్పాహారం ఇస్తూ ఉడతా భక్తిని చాటుకుంటున్నారు.

- పేదలు, కూలీలు, యాచకులకు అండగా నిలుస్తున్న దాతలు
- టిఫిన్స్, అన్నదానం, పండ్లు, నిత్యావసర సరుకుల పంపిణీ



మంచిర్యాల టౌన్ : సరుకులు అందిస్తున్నరామగుండం సీపీ సత్యనారాయణ

**కరీంనగర్ జిల్లా..**

**కరీంనగర్ హెల్త్/హుజూరాబాద్‌టౌన్/వీణవంక/సైదాపూర్:** కరీంనగర్‌లోని 'మీ కోసం స్వచ్ఛంద సంస్థ' ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ తనవంతు సహాయంగా వైద్య, పోలీసు, నగరపాలక సంస్థ సిబ్బందికి ఆరు రోజుల నుంచి ప్రతిరోజూ భోజనాలు అందిస్తున్నారు. ఆదివారం ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న సిబ్బందికి ఆహారాన్ని అందజేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని 6వ వార్డులోని పేదలకు టీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ తిరిగి ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారు. వీణవంకలో దినసరి కూలీలకు బీజేపీ నాయకులు 100 కిలోల బియ్యాన్ని అందజేశారు. సైదాపూర్ మండలకేంద్రంలో ఆరుగురు వలస కూలీలకు బీజేపీ ఆధ్వర్యంలో 15రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. హైదరాబాద్ నుంచి కాలినడకన కరీంనగర్‌కు చేరుకున్న ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన పలువురికి కరీంనగర్‌లోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను ట్రాఫిక్ ఏసీపీ శంకర్ పంపిణీ చేశారు. భోజన సదుపాయం కల్పించి కారులో గోదావరిఖనికి పంపించారు. కరీంనగర్‌లోని ప్రముఖ వైద్యుడు పుల్లెల పవన్‌కుమార్ సుమారు 200 మంది పేదలకు ఆహారం పంపిణీ చేశారు.

**జగిత్యాల జిల్లా..**

**జగిత్యాల/ మెట్‌పల్లి/ధర్మపురి, నమస్తే తెలంగాణ/ కోరుట్ల/ కోరుట్లటౌన్/మెట్‌పల్లిటౌన్/మెట్‌పల్లిరూరల్/మేడిపల్లి/ మల్యాల**



ధర్మపురి : భోజనం అందజేస్తున్న నాయకులు

**/సారంగాపూర్ :** ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది ఒడ్డున గల భిక్షకులకు 4వ వార్డు కౌన్సిలర్ పురాణపు కిరణ్మయి-సాంబు దంపతులు ఆదివారం భోజనం అందించారు. ఇంట్లోనే భోజనం ప్యాక్‌చేసి పంపిణీ చేశారు. ధర్మపురి ఎస్ఐ శ్రీకాంత్ కూడా పండ్లు, బిస్కట్లు అందజేశారు. బంగారం దుకాణాల్లో బూడిద సేకరించేవారికి 3వ వార్డు కౌన్సిలర్ సంగబట్ల సంతోషి-దినేశ్ భోజనం అందజేశారు. మేడిపల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ ఆధ్వర్యంలో 60 మంది కూలీలకు అన్నం ప్యాకెట్లను కలెక్టర్ గుగులోత్ రవినాయక్, జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి పంపిణీ చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పులిహోర, భోజనం ప్యాకెట్లను యాచకులు, అనాథలు, కూలీలకు పంపిణీ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో పోలీస్ సిబ్బందికి, టౌన్‌హాల్‌లో ఉంటున్న పేదలకు వందన ఆటోస్టోర్స్ అధినేత సిరిపురం శ్రీనివాస్, 45వ వార్డు కౌన్సిలర్ జగదీశ్ ఆదివారం అల్పాహారం, టీ అందజేశారు. జగిత్యాల హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు నిమిషకవి సాయికృష్ణ, యాచకులకు భోజనం అందజేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి బాల్క అశోక్ జ్యూస్ తన కూతురు విద్య, కొడుకు రాఘవతో కలిసి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులకు బాదం జ్యూస్, అరటి పండ్లు, తాగునీటి బాటిళ్లను అందించారు. కోరుట్ల పట్టణానికి చెందిన నీలి శ్రీనివాస్ నక్కల గుట్ట, మాదాపూర్ రోడ్డు ప్రాంతాల్లో గుడిసెల్లో ఉంటున్న 30 కుటుంబాలకు 10 కిలోల చొప్పున బియ్యం, సరుకుల ప్యాకెట్లను అందించాడు. మల్యాల మండలం బల్వంతాపూర్‌కు చెందిన యువకుడు దొమ్మాటి నవీన్ గ్రానైట్ క్వారీలో కూలీలకు పది రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశాడు. మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలో ఉప సర్పంచ్ పాలెపు రాజగంగారాం రూ. పది వేల విలువ గల నిత్యావసరాలను అందించారు. పారిశుధ్య పనుల కోసం మేడిపల్లి మండలంలోని కొండాపూర్ మాజీ సర్పంచ్ మెన్నేని ధర్మారావు కొడుకు తిరుమల్‌రావు, సర్పంచ్ ద్యావనపెల్లి అభిలాష్‌కు రూ.10,111 విరాళం అందజేశారు. కోరుట్ల మండలం మండలం మాదాపూర్



వేములవాడ : అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

లో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్ విండో అధ్యక్షుడు గడ్డం ఆదిరెడ్డి సహకారంతో గ్రామస్తులకు శానిటేషన్ వస్తువులను పంపిణీ చేశారు. సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన టైలర్ దీటి మౌనిక 230 వరకు మాస్కులు కుట్టి పంపిణీ చేసింది. ఇదే గ్రామానికి చెందిన టైలర్లు గుజ్జెటి మల్లేశం, జమున సైతం మాస్కులు కుట్టి అందిస్తున్నారు. ధర్మపురి పట్టణానికి చెందిన గోలి శ్రీనివాస్ 150 మాస్కులు అందించాడు.

**సిరిసిల్ల జిల్లా..**

**వేములవాడ, నమస్తేతెలంగాణ/ వేములవాడరూరల్ /సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్ / ఇల్లంతకుంట :** వేములవాడలోని సంచార కార్మికులకు కలెక్టర్ ఆదేశాలతో తాసిల్దార్ నక్క వెంకటేశం ఒక్కో కుటుంబానికి 12 కిలోల బియ్యం, గోధుమలను అందజేశారు. మర్రిపల్లిలో వలస కూలీలకు నిత్యావసర సరుకులను రూరల్ ఎస్ఐ సౌమ్యరెడ్డి అందజేశారు. రుద్రవరంలో వలస కూలీలకు 50 కిలలో బియ్యాన్ని సర్పంచ్ ఊరడి రాంరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీచేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలో ఇటుక బట్టీ కార్మికులకు తాసిల్దార్ అంజన్న, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బియ్యం అందజేశారు. తంగళ్లపల్లి మండలం తాడూరులో కార్మికులకు రాజేందర్‌రావు సహాయంతో బియ్యం పంపిణీ చేశారు. సిరిసిల్లలోని యాచకులకు జిల్లెల్లలోని నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో కలిసి పలువురు సభ్యులు ఉప్మా, ఆహార పదార్థాలు అందజేశారు. అపెరల్ కార్మికులకు కౌన్సిలర్ సత్యనారాయణ 50 కిలోల బియ్యం అందజేశారు. సిరిసిల్లలోని సుభాష్‌నగర్‌లో ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులకు టీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో పేద చిరు వ్యాపారులైన ఎగుల్ల గంగ-సురేశ్ దంపతుల కుటుంబానికి ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య బియ్యం, నిత్యావసర వస్తువులను వితరణగా అందించారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో జార్ఖండ్, బీహార్, మహబూబ్‌నగర్ ప్రాంత భవన నిర్మాణ కార్మికులకు సర్పంచ్ జితేందర్ గౌడ్ డబుల్ బెడ్ రూంఇండ్ల నిర్మాణ ప్రాంతంలో ఆశ్రయం కల్పించారు. 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. వేములవాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉచితంగా భోజనాలను అందిస్తున్నామని మున్సిపల్ అధ్యక్షులు మాధవి పేర్కొన్నారు. ఆదివారం సాయిరక్షదాబా, బుడగజంగాల కాలనీ, జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో సంచార జాతులు, నిరుపేదలకు, సంచార జాతులకు ఆమె అన్నపూర్ణ పథకం ద్వారా భోజనాన్ని ఉచితంగా అందజేశారు. కమిషనర్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మధురాజేందర్, సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, కౌన్సిలర్లు విజయ్, శ్రీలత ఉన్నారు.



గోదావరిఖని : అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**పెద్దపలి జిల్లా..**

**ఫెర్టిలైజర్‌సిటీ / సుల్తానాబాద్ :** రామగుండం ట్రాఫిక్ సీఐ రమేశ్‌బాబు ఆదేశాల మేరకు ఖని ట్రాఫిక్ ఏఎస్ఐ చారి, హెడ్ కానిస్టేబుల్ బాయి శ్రీనివాస్ తదితరులు పలువురు అన్నార్థులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురం వెంకటరమణ నేతృత్వంలో పేదలకు అన్నదానం చేపట్టగా, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత ప్రారంభించారు.

**మానవత్వం చాటిన ఖాకీలు..**

గోదావరిఖనిలోని విఠల్‌నగర్‌కు చెందిన స్నేహలత అనే గర్భిణీ పురిటి నొప్పులతో బాధపడుతున్నదని తెలుసుకున్న సీఐ రమేశ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు అంబులెన్స్‌ను తెప్పించి ఏఎస్ఐ మల్లయ్య, హోంగార్డు సారయ్య సహకారంతో ప్రభుత్వ



హుజూరాబాద్‌టౌన్ : కూరగాయలను పంపిణీ చేస్తున్న నేతలు

దవాఖానకు తరలించారు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో తన భర్త ప్రాణపాయ స్థితిలో ఉన్నాడని, సహాయం చేయమని ఓ పేద మహిళ విన్నవించగా, వన్ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కొంత డబ్బు ఇచ్చి వాహన సౌకర్యాన్ని కల్పించారు. స్వతంత్ర చౌక్‌కు చెందిన రాజు అనే వ్యక్తి సోదరి పురిటి నొప్పులతో బాధపడుతుండగా బ్లూకోల్ట్ సిబ్బంది మల్లయ్య, కిషన్ ఆమెను ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు.

**నిత్యావసరాల డోర్‌డెలివరీ**

**సుల్తానాబాద్ :** పట్టణ ప్రజల సౌకర్యార్థం కిరాణ వస్తువులను డోర్ డెలివరీ చేసేందుకు స్థానిక వర్తక సంఘం ముందుకు వచ్చిందని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలకు స్థానిక కిరాణ వర్తక సంఘం సభ్యులు అందజేసిన నిత్యావసర సరుకులను మున్సిపల్ చైర్‌పర్సన్ పంపిణీ చేశారు. నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 9గంటల వరకు మాత్రమే ప్రజలు బయటకు రావాలని సూచించారు.

**మంచిర్యాల జిల్లా..**

**మంచిర్యాల టౌన్/చెన్నూర్, నమస్తే తెలంగాణ/మంచిర్యాల అగ్రికల్చర్/శ్రీరాంపూర్/తాండూర్/కోటపల్లి/మందమర్రి:** కరోనా కల్లోలం నేపథ్యంలో వలస కూలీలు, అనాథలు, యాచకులకు అండగా నిలుస్తామని రామగుండం సీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలో కార్మికులుగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన 60 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా సరుకులు అందించారు. కమిషనరేట్ పరిధిలో దాదాపు 47 వేల మంది వలస కూలీలు ఉన్నట్లు గుర్తించామని.. వీరికి ఇక్కడనే ఉంచాలని తెలిపామన్నారు. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు కాలినడకన వెళ్తుండగా.. వీరికి సీపీ వాహనాన్ని సమకూర్చారు. మంచిర్యాలలోని రైల్వేస్టేషన్ పరిధిలో గల 80 మంది యాచకులకు నల్ల కోటమ్మ, లక్ష్మయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆ




ఆసిఫాబాద్ : కోవ లక్ష్మి సమకూర్చిన ట్రాక్టర్‌లో వెళ్తున్న కూలీలు

ధ్వర్యంలో 13 వార్డు కౌన్సిలర్ నల్ల శంకర్ ఆహార పొట్లాలను అందించారు. అలాగే మంచిర్యాల బస్టాండ్, కూడళ్లలో మంచిర్యాల ఆవోపా, శ్రీ సాయిరాం యూత్ గణేశ్ మండలి, ఫ్రెండ్స్ యానిమల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం ఉచితంగా పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో కూలీలుగా పనిచేస్తున్న దాదాపు 30 మంది పిల్లాపాపలు, ముల్లెమూటతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లకు వెళ్తూ, శ్రీరాంపూర్ చేరుకున్నారు. వీరికి పత్తి గట్టయ్య చారిటీ ట్రస్ట్ చైర్మన్ అధ్యక్షుడు పత్తి వెంకటేశ్ అన్నదానం చేశారు. తాండూర్‌లో చెక్‌పోస్టు వద్ద 60మంది పోలీసులకు తాండూర్ కోఆప్షన్ సభ్యుడు రాంచందర్ భోజన సదుపాయం కల్పించారు. అలాగే కోటపల్లి మండలం రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట వంతెన చెక్‌పోస్టు వద్ద విధులు సిబ్బందికి ఎంపీపీ మంత్రి సురేఖ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు మందమర్రి సీఐ ఎడ్ల మహేశ్, ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో 250 మందికి నిత్యావసర సరుకులను సీపీ సత్యనారాయణ పంపిణీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 575 మంది అనుమానితులను గుర్తించామని, అందులో 60 శాతం మంది క్వా రంటైన్ నుంచి హోంక్వారంటైన్‌కు చేరుకున్నారని తెలిపారు.

**ఆసిఫాబాద్ జిల్లా**

**ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ, కాగజ్‌నగర్ టౌన్, ఆసిఫాబాద్ టౌన్, వాంకిడి :** లాక్‌డౌన్‌తో ఇటు జిల్లాలో ఉపాధి కరువై అల్లాడుతున్న కూలీలు, నిరుపేదలతో పాటు ఇతర రాష్ర్టాలకు వెళ్తున్న కార్మికులకు మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు పలువురు దయార్ద్ర హృదయులు. సికింద్రాబాద్ నుంచి బీహార్ వెళ్తున్న 25 మంది కూలీలు రాష్ట్ర సరిహద్దు వరకు వెళ్లేందుకు జడ్పీ అధ్యక్షురాలు కోవ లక్ష్మి ట్రాక్టర్‌ను సమకూర్చారు. ఖర్చులకు ఆర్థిక సాయంతో పాటు భోజన సౌకర్యం కూడా కల్పించారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వెళ్తూ ఆసిఫాబాద్ చేరుకున్న కూలీలకు ఆర్ఎస్ఎస్ సంస్థ సభ్యులు మసాడే పవన్, సంతోశ్, విలాస్ నిత్యావసర సరుకులు అందజేశారు. వాంకిడి మీదుగా రాజస్థాన్‌కు వెళ్తున్న నలుగురు కూలీలకు పోలీస్, రవాణా శాఖ అధికారులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు. కాగజ్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, లాయర్ కిశోర్ కుమార్ పారిశుధ్య కార్మికులకు పులిహోర ప్యాకెట్లు, తాగునీటి బాటిళ్లను అందజేశారు. కాగజ్‌నగర్ యునిటీ ఆధ్వర్యంలో లారీ చౌరస్తా సమీప కాలనీలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఎస్ఐ తహిసొద్దీన్, యూనిట్ సభ్యులు వసీంతో కలిసి పంచారు. బీజేపీ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత 60 మందికి ఆహార పొట్లాలు అందజేశారు.

## కరీంనగర్‌లో విరాళాలు..



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న పవన్ అప్లయన్స్ నిర్వాహకులు

**కరీంనగర్ హెల్త్/హుజూరాబాద్‌రూరల్ / కరీంనగర్‌రూరల్ /రామడుగు :** జిల్లాలో కరోనా అనుమానితుల కోసం ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన ట్రయేజ్ సెంటర్‌కు ఆదివారం కరీంనగర్‌లోని రెనె దవాఖాన చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను కలెక్టర్ శశాంకకు అందించారు. కరీంనగర్ పవన్ అప్లయన్స్‌కు చెందిన లక్ష్మణ్, రవి, పవన్ సీఎం సహాయ నిధికి రూ.2 లక్షల విరాళంగా చెక్కును కలెక్టర్ శశాంకకు చెక్కును అందజేశారు. కరీంనగర్‌లోని విద్యానగర్ పరిధిలో గల హిందూపురికాలనీలో పారిశుధ్య కార్మికులకు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఉట్కూరి రాధాక్రిష్ణారెడ్డి మాస్కులు పంపిణీ చేశారు. హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ గ్రామంలో మాస్కులు అందించడానికి సర్పంచ్ నేరెళ్ల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో రూ.60 వేల విరాళాలు సేకరించారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఆదివారం గార్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు 2000 దస్తీలను పంపిణీ చేశారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలో కొత్త జయపాల్‌రెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సహాయనిధికి రూ.10 వేలను విరాళంగా అందించారు.

**రీక్రియేషన్ క్లబ్ విరాళం..**

**సుల్తానాబాద్ :** కరోనా వైరస్ నేపథ్యంలో సుల్తానాబాద్ రీక్రియేషన్ క్లబ్ రూ.35వేల విరాళం అందించింది. సీఎంఆర్ఎఫ్‌కు రూ.25 వేల చెక్కును తాసిల్దార్ హన్మంతరావుకు, పారిశుధ్య కార్మికుల రక్షణ, క్లోరినేషన్ కోసం మరో రూ.10 వేల చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, బల్దియా కమిషనర్ శ్యాసుందర్‌రావుకు క్లబ్ ఉపాధ్యక్షుడు డీ కృష్ణమూర్తి అందించారు.

## పోలీసులకు సింగరేణి వాహనాలు

**శ్రీరాంపూర్ :** సింగరేణి యాజమాన్యం పోలీసులకు వాహన సౌకర్యం కల్పించిందని శ్రీరాంపూర్ జీఎం లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల డీసీపీ ఉదయ్‌కుమార్ సూచన మేరకు నస్పూర్, శ్రీరాంపూర్ పోలీసులకు రెండు బొలేరో వాహనాలు ఇచ్చినట్లు తెలిపారు. వీటిని ప్రజలు 100 నంబర్‌కు డయల్ చేసి అత్యవసర సేవలు వినియోగించుకోవచ్చని డీవైజీఎం గోవిందరాజు పేర్కొన్నారు.

## ఎర్రగుట్టలో పెద్దపులి సంచారం

**రెబ్బెన:** రెబ్బెన రేంజ్ పరిధిలోని చిర్రకుంట శివారు ప్రాంతమైన ఎర్రగుట్ట అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించింది. ఆదివారం ఆ ప్రాంతంలో ఆవు మృతి చెంది ఉండగా ఆ పక్కనే పులి అడుగులు కనిపించడంతో రేంజ్ అధికారి పూర్ణిమ నిపుణుల బృందంతో అన్వేషణ చేపట్టారు. ఇక్కడ డిప్యూటీ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్, అడుగుల నిపుణులు సతీశ్, సాయి ఉన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం

**శ్రీరాంపూర్ :** మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు తాళ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం గుర్తు తెలియని యువకుని శవం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీరాంపూర్ సీఐ కోటేశ్వర్, ఎస్ఐ మంగీలాల్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతదేహం కుల్లిపోయి గుర్తు పట్టకుండా ఉందని, చేపల వేటకు వెళ్లి 3,4 నెలల క్రితం చెరువులో పడి ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ఇక డ్రోన్‌తో నిఘా

- రోడ్లపైకి వస్తున్న వారిని గుర్తించేందుకు టెక్నాలజీ ఉపయోగం
- జిల్లాల్లో ఏడో రోజు కొనసాగిన లాక్‌డౌన్
- త్వరలో డ్రోన్ కెమెరాల వినియోగం : సీపీ సత్యనారాయణ

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** జిల్లావ్యాప్తంగా లాక్‌డౌన్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉంది. అపరాద రుసుం విధించినా రహదారులపైకి వస్తున్న వారిని నిలువరించడానికి పోలీసులు డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నారు. ఈ విషయాన్ని సీపీ సత్యనారాయణ ఆదివారం వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఈ టెక్నాలజీ ఉపయోగించి రోడ్లపైన తిరిగే వారిని గుర్తించనున్నారు. ఈ డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు, వాహనాలు గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. కోటపల్లి మండలకేంద్రంలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ ఆధ్వర్యలో వైరస్ నివారణ ద్రావణం(థెంపాస్)ను స్ప్రే చేయించారు.

**అనాథలకు అన్నదానం**

ఏడో రోజైన ఆదివారం అవాంఛనీయ ఘటనలు జరగకుండా లాక్‌డౌన్ జరిగింది. చాలా చోట్ల మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు నిత్యావసరాల కోసం బయటకొచ్చారు. తాత్కాలిక దుకాణాల్లో కూరగాయలు, మటన్, చికెన్ కోసం బారులుదీరారు. కాగా.. జిల్లావ్యాప్తంగా ఆదివారం రామగుండం సీపీ సత్యనారాయణ మందమర్రి, మంచిర్యాల పట్టణంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మంచిర్యాల పట్టణంలో 60 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా సరఫరా చేయగా.. మందమర్రిలో 250 మందికి 10 రోజులకు సరిపడా ఇచ్చారు. ఒక్క మంచిర్యాల పట్టణంలోనే దాదాపు 20 వరకు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.



మంచిర్యాల జిల్లా కోటపల్లిలో థెంపాస్ స్ప్రే చేయిస్తున్న ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్

## • నాగ్‌పూర్ టూ కరీంనగర్ వయా వాంకిడి..



చెట్టు కింద సేద తీరుతున్న విద్యార్థులు

**వాంకిడి :** విద్యాభ్యాసం కోసం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉంటున్న 10 మంది విద్యార్థులు ఇంటిబాట పట్టారు. లాక్‌డౌన్‌తో రవాణా సౌకర్యం లేకపోవడంతో మూడు రోజుల క్రితం కాలినడకన బయల్దేరారు. ఇందులో ఐదుగురు కరీంనగర్, మరో ఐదుగురు ఏపీలోని అనంతపురం జిల్లావాసులుండగా ఆదివారం నాగ్‌పూర్ నుంచి 250 కిలోమీటర్లు ప్రయాణించి ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చేరుకొని కొద్దిసేపు సేదతీరారు. చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, పలువురు ఇచ్చిన ఆహారంతో కడుపు నింపుకుంటూ ముందుకుసాగుతున్నారు.

## స్వస్థలాలకు జిల్లా కూలీలు

**బెజ్జూరు/చింతలమానేపల్లి :** ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన జిల్లాలోని 156 మంది కూలీలు ఆదివారం స్వస్థలాలకు చేరుకున్నారు. ఇందులో బెజ్జూరుకు 118మంది, చింతలమానేపల్లి మండలానికి 38మంది వచ్చారు. వీరంతా కరీంనగర్, హుజూరాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాలలో పనిచేస్తుండగా సొంత గ్రామమైన బెజ్జూరుకు చేరుకునేందుకు అక్కడి అధికారులు వాహనాలు సమకూర్చారు. సుమారు 118 మందిని గమ్యం చేరగా వైద్య సిబ్బంది వారికి పరీక్షలు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా వారిని హోం క్వారంటైన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే జిల్లాలోని చింతలమానేపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన 32 మంది కూలీలు ఖమ్మం నుంచి తిరిగివచ్చారు. వీరికి రవీంద్రనగర్ పీహెచ్‌సీలో పరీక్షలు చేశారు. వీరితో పాటు మంచిర్యాల, జనగామ జిల్లా నుంచి వచ్చిన ఆరుగురు బాబాసాగర్ గ్రామస్తులకు పరీక్షలు చేసి, 14రోజుల పాటు హోం క్వారంటైన్‌లో ఉండాలని ఎంపీడీవో రాజేశ్వర్, తాసిల్దార్ ఖాజా నియాజొద్దీన్ సూచించారు.

**వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్‌డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

**గుడ్ల ధరలు (వందకు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 335.00 | వరంగల్ | 338.00 |
| మెదక్ | 335.00 | కరీంనగర్ | 338.00 |
| రంగారెడ్డి | 335.00 | డజన్ ధర | 54.00 |

# బీవోఐ రుణాలు చౌక

### వడ్డీరేట్లను భారీగా తగ్గించిన బ్యాంక్

**ముంబై, మార్చి 29:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) తమ ఖాతాదారులకు భారీ ఊరటనిచ్చింది. బాహ్య ప్రామాణిక రుణ రేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి వస్తాయని ఆదివారం బ్యాంక్ ప్రకటించింది. 'ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గించి వార్షిక రేటును 7.25 శాతానికి తీసుకొచ్చాం. దీనివల్ల రిజర్వ్ బ్యాంక్ ఇటీవల తగ్గించిన రెపో రేటు ప్రయోజనాన్ని ఖాతాదారులకు యథాతథంగా ఇస్తున్నాం. మా గృహ, వాహన రుణ గ్రహీతలతోపాటు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కస్టమర్లకు లాభం చేకూరగలదు' అని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, బెంచ్‌మార్క్ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ (ఎంసీఎల్‌ఆర్) రేటును కూడా బ్యాంక్ 25 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. ఏడాది నుంచి నెల రోజుల కాల వ్యవధిపై ఈ తగ్గింపు వర్తిస్తుంది. ఏడాది ఎంసీఎల్‌ఆర్ ప్రస్తుతం 7.95% ఉన్నది.

# ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో ఆసరా

### నిల్వలో కొంత మొత్తం ఉపసంహరణకు వెసులుబాటు



**న్యూఢిల్లీ, మార్చి 29:** కరోనా వైరస్‌ను ప్రతిఘటించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో అత్యవసర ఖర్చుల కోసం ఈపీఎఫ్ చందాదారులు తమ సొమ్ములో కొంత మొత్తాన్ని ఉపసంహరించుకొనేందుకు (విత్‌డ్రా చేసుకొనేందుకు) ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) అనుమతిచ్చింది. అంతేకాకుండా కేవైసీ (నో యువర్ కస్టమర్) వివరాలను సమర్పించిన చందాదారులు ఈ లాక్‌డౌన్ సమయంలో ఈపీఎఫ్‌వో సిబ్బంది ప్రమేయం లేకుండా నగదును ఉపసంహరించుకొనేందుకు ఆన్‌లైన్ క్లెయిమ్ సెటిల్మెంట్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి ఉద్యోగ భవిష్యనిధి పథకం-1952ను సవరించేందుకు శనివారం (మార్చి 28న) నోటిఫికేషన్ జారీ చేసినట్టు కేంద్ర కార్మికశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. కొవిడ్-19 మహమ్మారిపై పోరాడేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నామని, ఈపీఎఫ్ ఖాతా నుంచి చందాదారులు మూడునెలల మూలవేతనంతోపాటు కరవుభత్యాన్ని లేదా కనీస నిల్వ నుంచి 75 శాతం మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని, ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని చెల్లిస్తామని కార్మికశాఖ వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ సంస్థలు, కర్మాగారాల్లో పనిచేస్తూ ఈపీఎఫ్ పథకం-1952లో సభ్యులుగా ఉన్న ఉద్యోగులంతా ఈ ప్రయోజనాన్ని పొందేందుకు అర్హులని తెలిపింది. ఇందుకోసం ఈపీఎఫ్ పథకం-1952లోని పేరా 68ఎల్‌లో సబ్‌పేరా (3)ని చేర్చింది. సవరించిన ఈపీఎఫ్ పథకాన్ని శనివారం (మార్చి 20) నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. నగదు ఉపసంహరణ కోసం చందాదారుల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి వారికి చేయూతనివ్వాలని క్షేత్రస్థాయి అధికారులకు ఈపీఎఫ్‌వో ఆదేవాలు జారీచేసింది.

# ఒడిదుడుకుల్లోనే..

### అంతర్జాతీయ పరిణామాలు కీలకం • కరోనా కేసులూ ముఖ్యమే

### ఈ వారం మార్కెట్ సరళిపై నిపుణుల అంచనా

**న్యూఢిల్లీ, మార్చి 29:** అంతర్జాతీయ పరిణామాలు, దేశంలో కరోనా కేసులు ఈ వారం స్టాక్ మార్కెట్ల కదలికలపై ప్రభావం చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ, రిజర్వ్ బ్యాంక్ మారటోరియం ట్రేడింగ్‌పై పరిమిత ప్రభావాన్నే కలిగి ఉంటాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అభిప్రాయపడ్డారు. ఇక తయారీ రంగ పీఎంఐ గణాంకాలు గురువారం విడుదల కానుండగా, శుక్రవారం వీటి ప్రభావం మార్కెట్లపై కొంతమేర ఉండొచ్చని అంటున్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గురువారం మార్కెట్లకు సెలవు. కాగా, మార్చి నెల ఆటో అమ్మకాలు.. ఆ రంగ షేర్లను ప్రభావితం చేస్తాయని విశ్లేషకులు చెప్తున్నారు.


**రూ.1.23 లక్షల కోట్లు పెరిగిన సంపద**

కరోనా అమ్మకాల ఒత్తిడి నుంచి మదుపరులు తేరుకుంటున్నారు. గత వారం సెన్సెక్స్ టాప్-10 సంస్థల్లో ఏడింటి మార్కెట్ విలువ రూ.1,23,039.72 కోట్లు పుంజుకున్నది. టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. అయితే ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.26వేల కోట్లకుపైగా ఆవిరైంది.

**లక్ష కోట్లు వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు**

కరోనా వైరస్.. ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారితీస్తున్న నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. భారతీయ మార్కెట్ల నుంచి ఈ నెలలో ఇప్పటిదాకా రూ.లక్ష కోట్లకుపైగా వెనక్కి తీసుకున్నారు. అంతకుముందు వరుసగా ఆరు నెలలపాటు దేశీయ క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు.. మార్చిలో మాత్రం రివర్స్‌గేర్ వేశారు. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్ల నుంచి రూ.59,377 కోట్లు, రుణ మార్కెట్ల నుంచి రూ.52,811 కోట్లు తరలిపోయాయి.


గౌతమ్ అదానీ


సజ్జన్ జిందాల్


ఉదయ్ కొటక్

# కార్పొరేట్ల దన్ను

- కరోనా కట్టడి కోసం పీఎం-కేర్స్ నిధికి విరాళాల వెల్లువ
- గౌతమ్ అదానీ, జేఎస్‌డబ్ల్యూ రూ.100 కోట్ల చొప్పున సాయం
- రూ.50 కోట్లు ప్రకటించిన ఉదయ్, కొటక్ మహీంద్రా బ్యాంక్

**ముంబై, మార్చి 29:** కరోనా వైరస్ దెబ్బకు అల్లాడిపోతున్న దేశాన్ని ఆదుకునేందుకు కార్పొరేట్లు ముందుకొస్తున్నారు. ఆపత్కాలంలో మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. ప్రధాన మంత్రి-సంరక్షణ నిధి (పీఎం-కేర్స్ ఫండ్)కి ఆదివారం అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ రూ.100 కోట్ల విరాళం ప్రకటించగా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ మరో రూ.100 కోట్లను ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. అలాగే ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.25 కోట్లు, ఆ బ్యాంక్ ఎండీ ఉదయ్ కొటక్ రూ.25 కోట్ల చొప్పున పీఎం-కేర్స్ నిధికి విరాళాలు ప్రకటించారు. అదనంగా మరో రూ.10 కోట్లను మహారాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి కొటక్ మహీంద్రా బ్యాంక్ ఇస్తున్నది. 'రాబోయే కొద్దివారాలు దశాబ్దాల తరబడి మానవత్వానికి ప్రతీకగా నిలవాలి. ప్రాణాలను, ప్రజలను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. విజ్ఞానం, ఔషధాలు వైరస్‌ను అంతమొందిస్తే.. అంతా కలిసి చేసే ఆర్థిక సాయం సంక్షోభాన్ని నివారిస్తుంది' అని ఉదయ్ ట్వీట్ చేశారు.

**కల్యాణ్ జ్యుయెల్లర్స్ రూ.10 కోట్ల సాయం**

కల్యాణ్ జ్యుయెల్లర్స్ కరోనా వైరస్‌పై పోరులో భాగంగా రూ.10 కోట్ల సాయానికి ముందుకొచ్చింది. ఈ లాక్‌డౌన్ సమయంలో స్థానిక, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో నిరుపేదలకు ఆహార, ఇతర నిత్యావసరాలను అందిస్తామని ఓ ప్రకటనలో సంస్థ సీఎండీ టీఎస్ కల్యాణరామన్ చెప్పింది. కాగా, ఇప్పుడున్న పరిస్థితులు తమ వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నప్పటికీ మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ 8వేల ఉద్యోగులకు పూర్తి జీతాలు ఇస్తామని ఈ సందర్భంగా సంస్థ స్పష్టం చేసింది. మరోవైపు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తమ 28 దవాఖానల్లో కరోనా వైరస్ బాధితుల కోసం ఐసోలేషన్ వార్డులను ఏర్పాటుచేసింది. వీటిలో 262 పడకలను సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా దాదాపు వెయ్యి కరోనా కేసులు నమోదవగా, ఇప్పటిదాకా 25 మంది చనిపోయారు. వచ్చే నెల 14వరకు లాక్‌డౌన్ కొనసాగనున్నది. భారత్‌సహా పలు దేశాలకు అలీబాబా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు జాక్ మా.. ఫేస్ మాస్కులు, కరోనా వైరస్ టెస్ట్ కిట్లను అందిస్తున్నారు. ఫేస్‌బుక్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్ సైతం 25 మిలియన్ డాలర్ల సాయాన్ని కొవిడ్-19 నిర్మూలన కోసం ప్రకటించారు.

# ఇంధన కొరత లేదు

### అన్ని ప్లాంట్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి

### వినియోగదారులు ఆందోళనచెందనక్కర్లేదు: ఐఓసీ



**న్యూఢిల్లీ, మార్చి 29:** దేశంలో ఇంధన కొరత లేదని ప్రభుత్వరంగ చమురు సంస్థ ఐఓసీ ప్రకటించింది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరాల విషయమై వినియోగదారులెవరూ ఆందోళనచెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కరోనా వైరస్‌తో పోరాడేందుకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఐఓసీ ఈ ప్రకటన చేసింది. దేశంలో మరో మూడు వారాలకుపైగా సరిపడా ఇంధన నిల్వలున్నాయని, దేశవ్యాప్తంగా అన్ని ఇంధన ప్లాంట్లు, సరఫరా కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని ఐఓసీ చైర్మన్ సంజీవ్ సింగ్ తెలిపారు.

**పితృవియోగ దుఃఖాన్ని దిగమింగుకొని..**

కొవిడ్-19 మహమ్మారిపై పోరాడేందుకు దేశవ్యాప్తంగా 21 రోజులపాటు లాక్‌డౌన్ విధిస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నాడే (మార్చి 24న) సంజీవ్ సింగ్ పితృవియోగంతో విషాదంలో మునిగిపోయారు. అయినప్పటికీ ఆ దుఃఖాన్ని మరుక్షణమే దిగమింగుకొని 24 గంటలు తిరక్కుడానే విధుల్లో చేరిన సంజీవ్ సింగ్.. దేశంలోని ప్రతి మూలకూ నిరంతరాయంగా ఇంధన సరఫరాలు జరిగేలా పర్యవేక్షిస్తున్నారు.

**సౌదీ మంత్రితో ప్రధాన్ చర్చలు**

ప్రస్తుతం అంతర్జాతీయ చమురు మార్కెట్లలో చోటుచేసుకొంటున్న పరిణామాలు, ఎల్పీజీ సరఫరాల విషయమై చమురుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సౌదీ అరేబియా చమురుశాఖ మంత్రి అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్‌తో చర్చలు జరిపారు. భారత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఇంధన సరఫరాలు జరిగేలా చూడాలని ధర్మేంద్ర ప్రధాన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దీనికి అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ సానుకూలంగా స్పందించారు.

**ఎల్పీజీ పంపిణీ సిబ్బంది కోసం..**

వైరస్ విజృంభించిన నేపథ్యంలో ఇంటింటికి గ్యాస్ సరఫరా చేస్తున్న సిబ్బంది కోసం ఐఓసీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ వైరస్ కారణంగా చనిపోతే వారి భార్యకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని తెలిపింది. ఈ సమయంలో అందరూ విధి నిర్వహణలో ఉండాలని కోరింది.

# యమహా, టీవీఎస్ కస్టమర్లకు ఊరట

**చెన్నై, మార్చి 29:** లాక్‌డౌన్ నేపథ్యంలో కస్టమర్ల కోసం వారెంటీ గడువులను యమహా, టీవీఎస్ సంస్థలు పొడిగించాయి. లైఫ్ టైమ్ క్వాలిటీ కేర్ సౌకర్యాన్ని 60 రోజులు పొడిగిస్తున్నట్లు ఇండియా యమహా మోటార్ ఆదివారం ప్రకటించింది. ఏప్రిల్ 15 వరకు ఉచిత సర్వీసు గడువును, జూన్ వరకు సాధారణ వారెంటీని పొడిగిస్తున్నట్లు తెలిపింది. అలాగే మార్చి 15 నుంచి ఏప్రిల్ 15 మధ్య ముగిసే వార్షిక మెయింటెనెన్స్ కాంట్రాక్టులనూ జూన్‌దాకా పొడిగిస్తున్నామన్నది. ఇక టీవీఎస్ మోటార్ సైతం మార్చి, ఏప్రిల్ మధ్య ఉంటే ఫ్రీ సర్వీస్ సదుపాయాన్ని జూన్ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. కస్టమర్ల సహాయార్థం 18002587111 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసింది.

# భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదర్

## శానిటైజర్లు.. నిర్ణీత దూరం

### రిటైల్ ఔట్‌లెట్ల వద్ద కరోనా నియంత్రణ చర్యలు

### పరిమిత సంఖ్యలో కొనుగోలుదారులకు అనుమతి

### నిత్యావసరాలకు లోటురాకుండా ఏర్పాట్లు




**న్యూఢిల్లీ, మార్చి 29:**

కరోనా వైరస్ భయాల మధ్య పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాయి రిటైల్ ఔట్‌లెట్లు. లాక్‌డౌన్ నేపథ్యంలో నిత్యావసరాల కోసం వస్తున్న కొనుగోలుదారులను కొద్దికొద్దిగా లోనికి అనుమతిస్తూ ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తున్నాయి. ప్రవేశ ద్వారం వద్ద కస్టమర్ల చేతులను శానిటైజర్స్‌తో శుభ్రం చేయించిగానీ పంపడం లేదు. రిలయన్స్ ఫ్రెష్, మోర్, వాల్‌మార్ట్, మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఔట్‌లెట్లు.. కస్టమర్ల టెంపరేచర్‌ను సైతం చూస్తున్నాయి. జ్వరం ఉన్నట్లైతే వెనక్కి వెళ్లిపోవాలని సిబ్బంది కోరుతున్నారు. మరి కొన్ని స్టోర్లు మాస్కులు లేని కస్టమర్లను లోనికి అనుమతించడం లేదు. ఇక లోనికి వెళ్లిన వారు కనీస దూరం పాటించాల్సిందే. బిగ్‌బజార్, డీమార్ట్, వాల్‌మార్ట్, మోర్, రత్నదీప్, ఉషోదయ సంస్థలు నిర్ణీత దూరం పాటిస్తూ ప్రత్యేక లైన్లను కస్టమర్ల కోసం నిర్వహిస్తున్నాయి.

**ప్రతిరోజూ శుభ్రం**

ఏరోజుకారోజు స్టోర్లను శానిటైజర్లతో శుభ్రం చేస్తున్న రిటైలర్లు.. కస్టమర్లు ఎక్కువగా తాకే చోట్లను మరింత గట్టిగా కడిగేస్తున్నారు. చివరకు సరుకుల కోసం కస్టమర్లు పట్టుకున్న బుట్టలు, ట్రాలీలనూ నిత్యం శుభ్రపరుస్తున్నారు. 'ఇన్ఫెక్షన్ రాకుండా పప్పులు, చక్కెర, పిండి తదితర పదార్థాలను ముందుగానే ప్యాకేజ్ చేస్తున్నాం. బిల్లింగ్ సమయాన్నీ తగ్గించేలా మొబైల్ చెకౌట్లను ఏర్పాటు చేశాం. టోకెన్ వ్యవస్థను ప్రవేశపెట్టాం' అని మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా తెలిపింది. స్టోర్‌లో రద్దీ ఏర్పడకుండా, ఒకరిని ఒకరు తాకకుండా చర్యలు చేపడుతున్నామని, వెయిటింగ్ చేస్తున్న కస్టమర్లనూ వేర్వేరుగా ఉంచుతున్నామని డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో, ఎండీ నెవిల్లే నోరోన్హా పీటీఐకి తెలిపారు. 20 నుంచి 30 మందిని గ్రూపులుగా విడదీసి వారందరికీ ఓ కలర్ టేప్‌ను వేస్తున్నామని, ఆ కలర్‌తో పిలిచి సదరు గ్రూపును లోనికి వెళ్లనిస్తున్నామని చెప్పారు. బిల్లింగ్ కౌంటర్ల వద్ద కస్టమర్ల మధ్య కనీసం మూడు అడుగుల దూరం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని బిగ్‌బజార్ మాతృ సంస్థ ఫ్యూచర్ గ్రూప్ ప్రతినిధి తెలిపారు.




**శానిటైజర్ల ఎగుమతిపై నిషేధం**

**యావత్** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ నిర్మూలనలో శానిటైజర్లకున్న ప్రాధాన్యం దృష్ట్యా భారత్ నుంచి విదేశాలకు వాటి ఎగుమతులపై నిషేధం విధించింది కేంద్ర ప్రభుత్వం. అన్ని రకాల వెంటిలేటర్ల ఎగుమతిపైనా నిషేధాజ్ఞలు తెచ్చింది. ఇప్పటికే సర్జికల్, డిస్పోజబుల్ మాస్కులు, వీటి తయారీకి ఉపయోగించే ఉత్పత్తుల ఎగుమతిపై కేంద్రం నిషేధం విధించిన విషయం తెలిసిందే. కరోనా వైరస్ నేపథ్యంలో మార్కెట్‌లో హ్యాండ్ శానిటైజర్లు, మాస్కులకు విపరీతంగా డిమాండ్ కనిపిస్తున్నది.

# ఆట

## గంభీర్ రూ.కోటి విరాళం


గంభీర్


ఈషా సింగ్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌పై పోరాటం కోసం టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్.. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి పీఎం - కేర్స్ నిధికి రూ.కోటిని విరాళంగా ప్రకటించాడు. దీంతో పాటు నెల వేతనాన్ని కేంద్ర సహాయ నిధికి అందించనున్నట్టు ట్విట్టర్‌లో ప్రకటించాడు. తూర్పు ఢిల్లీ ఎంపీగా ఉన్న గంభీర్ ఇదివరకే రూ.50లక్షలను ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద ప్రధానమంత్రి సహాయ నిధికి అందజేశాడు. భారత టెస్టు స్పెషలిస్ట్ అజింక్య రహానే మహారాష్ట్ర సీఎం సహాయ నిధికి రూ.10లక్షలను విరాళమిచ్చాడు.


**15ఏండ్ల ఈషా విరాళం రూ.30వేలు**

కరోనాపై యుద్ధానికి సాయం చేసేందుకు తెలంగాణ యువ షూటర్ ఈషా సింగ్ సైతం ముందుకొచ్చింది. ప్రధానమంత్రి కేర్స్ నిధికి ఆమె రూ.30వేలు విరాళమిచ్చింది. దీనికి స్పందించిన కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు.. ఈషా సింగ్‌ను రియల్ చాంపియన్ అంటూ అభినందించారు. అలాగే టీమ్‌ఇండియా టీనేజ్ మహిళా క్రికెటర్ రిచా ఘోష్ పశ్చిమ బెంగాల్ సీఎం సహాయ నిధికి రూ.లక్షను అందించింది.

**హెచ్‌సీఏ రూ.50లక్షలు**

కరోనాను ఎదుర్కొనేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) రూ.50లక్షలను ప్రధానమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటించింది. కర్ణాటక క్రికెట్ సంఘం రూ.50లక్షలను పీఎం-కేర్స్‌కు, రూ.50లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించింది.

# అందరి శత్రువును ఓడిద్దాం


ఛెత్రీ

**కౌలాలంపూర్:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రీ కోరాడు. డబ్ల్యూహెచ్‌వో, ప్రభుత్వాలు, వైద్య సిబ్బంది సూచనలు పాటించి ప్రపంచం మొత్తానికి ఉమ్మడి శత్రువైన కరోనాను ఓడిద్దామని ప్రజలకు పిలుపునిచ్చాడు. కరోనాపై పోరాటానికి ఆసియా ఫుట్‌బాల్ సంఘం (ఏఎఫ్‌సీ) నిర్వహిస్తున్న ప్రచారంలో ఛెత్రీ భాగస్వామ్యమయ్యాడు.

# ఆసీస్‌తో సమరానికి సిద్ధమవుతున్నా..

- ఫిట్‌నెస్, నైపుణ్యం మెరుగుదలపై దృష్టిపెట్టా
- 2005 యాషెస్ వీడియోలు చూస్తున్నా
- టీమ్‌ఇండియా టెస్ట్ స్పెషలిస్ట్ హనుమ విహారి

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ నేపథ్యంలో.. ఇంట్లోనే ఉంటూ ఫిట్‌నెస్‌తో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకునే పనిలో ఉన్నానని టీమ్‌ఇండియా టెస్టు స్పెషలిస్ట్, తెలుగు క్రికెటర్ హనుమ విహారి చెప్పాడు. ఈ ఏడాది చివర్లో జరిగే ఆస్ట్రేలియా పర్యటన కోసం ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నానని ఆదివారం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 'కౌంటీ క్రికెట్‌తో పాటు ఈ ఏడాది చివర్లో జరిగే ఆస్ట్రేలియా పర్యటన కోసం ఫిట్‌నెస్, నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడంపై ఈ సమయంలో ఏకాగ్రత పెడుతున్నా. సానుకూలంగా, బిజీగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నా. నా వరకు మరో నాలుగు నెలల వరకు ఆట ఉండే అవకాశం లేదు. ఇంగ్లిష్ కౌంటీ చాంపియన్‌షిప్ కోసం ఓ జట్టుతో ఒప్పందం చేసుకున్నా.. అది జరుగుతుందో లేదో' అని విహారి చెప్పాడు.

**దోశలు ఎక్కువగా తింటున్నా..**

ఇంటి ఆహారం అవడంతో ఎక్కువగా తింటున్నానని హనుమ విహారి చెప్పాడు. దీనికి తగ్గట్టుగా వ్యాయామం చేస్తునానన్నాడు. 'ఇంటి ఆహారం కావడంతో కాస్త గతి తప్పి తింటున్నా. ఇందుకోసం కాస్త మోసం చేసుకుంటున్నా. సాధారణంగా తినే దానికన్నా దోశలు మరిన్ని ఎక్కువగా తింటున్నా. అయితే వ్యాయామం చేసేందుకు ఎక్కువ సయమం దొరకడంతో ఎక్స్‌ట్రా క్యాలరీలను కరిగించేస్తున్నా. ఈ విరామం వల్ల మే 19న నా తొలి పెళ్లిరోజును భార్యతో కలిసి జరుపుకోబోతున్నా. లేకపోతే క్రికెట్‌లో బిజీగా ఉండేవాడిని' అని విహారి చెప్పాడు.

**బోర్ కొట్టకుండా పరిష్కారముంది**

కరోనా నేపథ్యంలో స్వీయ నిర్బంధం తప్పనిసరి అని విహారి చెప్పాడు. దీంతో బయటకు వెళ్లడం, స్నేహితులను కలవడం కుదరకపోయినా.. బోర్ కొట్టకుండా ఉండేందుకు తన వద్ద పరిష్కారముందన్నాడు. '2005 యాషెస్ వీడియో చూస్తున్నా. అదే నా ఫేవరెట్. ఎన్నిసార్లు చూశానో లెక్కేలేదు. పరిస్థితులు చక్కబడే వరకు స్వీయ నిర్బంధంలోనే ఉండాల్సిన అవసరం ఉంది' అని విహారి చెప్పాడు. అలాగే యోగా చేయాలని కూడా ప్రణాళిక వేసుకున్నట్టు వెల్లడించాడు.


హనుమ విహారి

### జాఫర్ జట్టుకు కెప్టెన్‌గా ధోనీ



**న్యూఢిల్లీ:** తన ఆల్‌టైం బెస్ట్ ఐపీఎల్ జట్టును టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ ఆదివారం ప్రకటించాడు. ఆ టీమ్‌కు చెన్నై సూపర్ కింగ్స్ సారథి మహేంద్ర సింగ్ ధోనీని కెప్టెన్‌గా ఎంపిక చేశాడు. భారత్ నుంచి విరాట్ కోహ్లీ, రైనా, హార్దిక్ పాండ్య, అశ్విన్, బుమ్రాకు.. విదేశీ ఆటగాళ్లుగా క్రిస్ గేల్, రసెల్, రషీద్ ఖాన్, మలింగకు జాఫర్ తన జట్టులో చోటిచ్చాడు. కాగా, జీవితంలో రూ.30 లక్షలు సంపాదిస్తే చాలని, రాంచీలో ప్రశాంతంగా జీవించొచ్చని కెరీర్ ప్రారంభంలో ధోనీ భావించాడని జాఫర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు.

# జోగిందర్.. రియల్ హీరో

- మాజీ క్రికెటర్‌పై ఐసీసీ ప్రశంస



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం హర్యానాలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న జోగిందర్ శర్మను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) ప్రశంసించింది. కరోనా సంక్షోభం కారణంగా లాక్‌డౌన్‌లో పని చేస్తున్న అతడిని 'రియల్ హీరో' అంటూ ఆదివారం ట్వీట్ చేసింది. 'క్రికెట్ కెరీర్ తర్వాత పోలీస్‌గా మారిన జోగిందర్ శర్మ.. ప్రపంచం ఆరోగ్య సంక్షోభం ఉన్న సమయంలోనూ పనిచేస్తున్నాడు. 2007: ప్రపంచకప్ హీరో.. 2020: రియల్ హీరో' అంటూ ఐసీసీ ట్వీట్ చేసింది. 2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్ చివరి ఓవర్లో పాక్ బ్యాట్స్‌మన్ మిస్బాను ఔట్ చేసి టీమ్‌ఇండియాను జోగిందర్ గెలిపించిన సంగతి తెలిసిందే.

# వచ్చే ఏడాది జూలైలోనే..

- టోక్యో ఒలింపిక్స్ ప్రారంభం!
- జపాన్ మీడియా వెల్లడి



**టోక్యో:** కరోనా వైరస్(కొవిడ్-19) కారణంగా ఏడాది పాటు వాయిదా పడిన టోక్యో ఒలింపిక్స్ షెడ్యూల్ ఎలా ఉంటుందో అన్న అంశంపై అన్ని క్రీడా సమాఖ్యలతో పాటు అథ్లెట్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జూలైలోనే టోక్యో విశ్వక్రీడలు ప్రారంభమవుతాయని జపాన్ మీడియా ఆదివారం వెల్లడించింది. 2021 జూలై 23 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు విశ్వక్రీడలు జరుగుతాయని జపాన్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే తెలిపింది.

**పెద్ద తేడా ఉండదు: యషిరో**

ఈ ఏడాది షెడ్యూల్‌తో పోలిస్తే వచ్చే ఏడాది విశ్వక్రీడలు నిర్వహించే తేదీల్లో పెద్ద తేడా ఉండకపోవచ్చని టోక్యో ఒలింపిక్స్ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు యషిరో మోరీ చెప్పారు. 'క్రీడలు వేసవిలోనే జరగాలి. జూన్ - సెప్టెంబర్ మధ్య నిర్వహించాలనుకుంటున్నాం' అని యషిరో చెప్పారు. ప్రస్తుతం ఐవోసీతో చర్చిస్తున్న ఆయన.. వారంలోగా నిర్ణయం ఓ కొలిక్కి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు జరగాల్సిన విశ్వక్రీడలను.. కరోనా వైరస్ విజృంభించడంతో వచ్చే ఏడాదికి వాయిదా వేస్తూ ఐవోసీ గత గురువారం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
సోమవారం 30 మార్చి 2020

### సామాజిక దూరం- సామాజిక మాధ్యమాలకు దూరం రెండూ పాటించాలి!

- కరోనా కారణంగా సామాజిక దూరం పాటిస్తున్నాం, పోటీ పరీక్షల అభ్యర్థులు సామాజిక మాధ్యమాలకు కూడా దూరం పాటిస్తే మంచిది. అదేపనిగా కరోనాపై పోస్టింగ్స్ చూస్తూ గడిపేస్తే విలువైన సమయం వృథా అయిపోతుంది. వారం రోజులు, నెల రోజులు అలా గడిచిపోతాయి. ఫోకస్ కోల్పోతాం. బద్ధకం ఆవహిస్తుంది. మళ్లీ ఏకాగ్రత కుదరాలంటే చాలా సమయం పడుతుంది. ఒకసారి పరీక్ష మిస్సయితే ఒక ఏడాది కోల్పోవాల్సి వస్తుంది. అందుకే రోజులో రెండు మూడు సార్లకు మించి సోషల్ మీడియా వైపు చూడకపోవడం మంచిది.


### సాకులు వెతకొద్దు

- చాలామంది విద్యార్థులు తమ సొంత ప్రదేశాలకు వెళ్లిపోయారు. అక్కడికెళ్లిన తర్వాత బుక్స్ అందుబాటులో లేవనో.. నోట్స్ హాస్టల్‌లో మర్చిపోయామనో ఇలా రకరకాల సాకులు వెతుక్కుంటుంటారు. కానీ గుర్తుంచుకోండి సెల్‌ఫోన్, ఇంటర్నెట్ మీ చేతిలో ఉన్నంతసేపు ఈ ప్రపంచంలోని సమస్త సమాచారం మీ గుప్పిట్లో ఉన్నట్లే. దాన్ని మీ పరీక్ష కోసం ఉపయోగించుకోండి.



**మనకు నచ్చనిది ఏదైనా జరుగుతున్నప్పుడు నిజం కూడా భ్రాంతి అనిపిస్తుంటుంది. ప్రపంచ యవనికపై, నడుస్తున్న చరిత్రలో, ప్రస్తుతం జరుగుతున్న సంగతి ఇదే. మొన్నటి వరకు వాయువేగంతో తిరిగిన భూగోళం ఇప్పుడు ఒక్కసారిగా ఆగిపోయింది. ఆర్థిక సంపద కోసం, ఆయుధ సంపత్తి కోసం నిత్యం పోటీపడ్డ దేశాలు ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో చిక్కుకుపోయాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఛిద్రమైంది. జన జీవితం ధ్వంసమయ్యింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఊపిరి కోసం ఒక నిశ్శబ్ద యుద్ధం జరుగుతుంది. ఈ ప్రపంచం, పరిస్థితులు, పరిణామాలు ఎలా ఉన్నా పోటీ పరీక్షల అభ్యర్థులు, ముఖ్యంగా సివిల్స్ అభ్యర్థులు మాత్రం ఈ సమయంలోనూ సమరం సాగించాలి. ఎందుకంటే మనం వేకువని కూడా నిద్రలేపే సామర్థ్యం ఉన్న బాధ్యతాయుత పౌరులం. జీవితంపై గెలుపు కోసం, జాతి సేవలో ఆనందం కోసం బయల్దేరిన బహుదూరపు బాటసారులం.**

# సడలనీకుమా సంకల్పం



### లాక్‌డౌన్ కామన్ కదా!

- కరోనా ఎన్నాళ్లు ఉంటుందో తెలియదు. లాక్‌డౌన్ ఎంతకాలం అనే దానిపై స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇవన్నీ మన చేతుల్లో లేని విషయాలు. ఇంట్లోనే సురక్షితంగా ఉండాలి. అయినా సివిల్స్ కోసం ప్రిపేరయ్యే అభ్యర్థులకు లాక్‌డౌన్ కొత్తేం కాదు కదా! ఎందుకంటే సివిల్స్ ప్రిపరేషన్‌లో భాగంగా దాదాపు రెండు మూడేండ్లు పుస్తకాలే ప్రపంచంగా ఉండాలి. సామాజిక జీవనం కాస్త తగ్గించాలి. ఇది ఎలాగూ రోజూ ఉండేదే. కాబట్టి మళ్లీ ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తగా ఏదో జరిగిందనుకోకూడదు. పోటీ పరీక్షల అభ్యర్థికి లాక్‌డౌన్ కామన్ అనే సానుకూల దృక్పథంతో ఉండాలి.

### అన్నీ సరే..అసలు ఎగ్జామ్ ఉంటుందా ?

- ప్రస్తుతానికి ఇది అనవసరమైన, అప్రస్తుతమైన విషయం, దాదాపు రెండు నెలల తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందనేది ఎవరూ చెప్పలేని సందిగ్ధ స్థితి. కాని ఏదో ఒక రోజు, మీ పరీక్ష మీరే రాయాలి. దాని కోసం మీరే చదవాలి. అందుకే ఎక్కువగా ఆలోచిస్తూ.. సమయాన్ని వృథా చేయొద్దు. ధ్యాస మొత్తం పుస్తకాలపైనే ఉంచాలి. ఎప్పటికైనా అది మీకు పనికొస్తుంది.

### అందరూ అదే ఆలోచిస్తున్నారు కదా!

- అందరు వేరు.. మీరు వేరు.. రాజనీతిశాస్త్రవేత్త హన్నా అరెండ్ ప్రకారం ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దానిగురించే విపరీతంగా శోధిస్తూ, చర్చిస్తూ కాలం వెళ్లదీస్తే నష్టం తప్పితే ఏమీ మిగలదు. కానీ సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తూ ఆచరణాత్మకంగా ముందుకు సాగితే ఫలితం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పుడు కరోనా విషయంలోనూ అంతే. దానిపై చర్చలతో గడపటం కంటే మనం ప్రిపరేషన్‌లో గడపడం ఉత్తమం. ఏదో ఒక రోజు ఇప్పుడు కరోనాపై పోరు సాగిస్తున్న సివిల్ సర్వెంట్ల మాదిరిగా మనం కూడా ఈ దేశసేవలో నిమగ్నమవచ్చు. మరో విపత్తేదో ముంచుకొచ్చినప్పుడు ఈ దేశం కోసం మన వంతు చేయూతనందివచ్చు.

### గతంలో కాదు.. వర్తమానంలో బతుకుదాం!

- ఒంటరిగా కూర్చుని చదువుతున్నప్పుడు రకరకాల ఆలోచనలు నిరంతర ప్రవాహంలా వస్తుంటాయి. ఇందులో ఎక్కువ భాగం గతానికి సంబంధించినవే ఉంటాయి. ఆలోచన అనుకూలమైనదైనా.. ప్రతికూలమైనదైనా.. గతం గతమే. గతాన్ని తలుచుకుంటూ వర్తమానాన్ని వృథా చేసుకోవడం తెలివైన లక్షణం కాదు. గతం భయంకరమైన అపజయాన్ని మిగిల్చినా సరే ఇప్పుడది అనవసరమైంది. ఇప్పుడున్న సమయాన్ని, ఈ క్షణాన్ని పక్కాగా ఉపయోగించుకుంటే చాలు బంగారు భవిష్యత్‌కు బాట పడుతుంది. మీపై మీ నమ్మకం, మీ తెగువ కచ్చితంగా మిమ్మల్ని గెలిపిస్తాయి. అంతేకాదు ప్రముఖ రచయిత పౌలో కోయిలో అభిప్రాయంలో మనమేదైనా సాధించాలని బలంగా నమ్మినప్పుడు యావత్ విశ్వం కూడా మనకు సహకరిస్తుంది.

### ఇప్పుడేం చేయాలి? ఎలా సాగాలి?

- ఎగ్జామ్ వరకూ పక్కాగా ప్లాన్ వేసుకోవాలి. ప్రతి రోజూ దాన్ని కచ్చితంగా అమలు చేయాలి. ముఖ్యంగా రివిజన్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. క్వశ్చన్స్ ప్రాక్టీస్ చేయడంలో నిర్లక్ష్యం చూపొద్దు. రోజులో కొంత భాగం చదవడానికి కేటాయిస్తే.. మిగతా భాగం ప్రాక్టీస్‌కు కేటాయించాలి. ఎగ్జామ్ ముందు రోజు వరకూ ఇదే పద్ధతి అనుసరిస్తే ఎలాంటి పరీక్షలోనైనా విజయం సాధించవచ్చు.
- ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటరిగా గడుపుతూ ఇవన్నీ ఆచరించడం కొంచెం కష్టంగానే అనిపించవచ్చు. కానీ చిన్న చిన్న తాత్కాలిక ఆనందాలు వదులుకుంటే మరుపురాని మర్చిపోలేని విజయాలు మన సొంతమవుతాయి. అవి దేశ సేవలో పాల్గొనే రహదారులని నిర్మిస్తాయి. అప్పుడు మన తోపాటు, మనవాళ్లకు ఆనందం. ఈ జీవితానికి పరమార్థం దక్కుతాయి.

మల్లవరపు బాలలత
సీఎస్‌బీ సివిల్స్ అకాడమీ,
హైదరాబాద్



# వీక్లీ రౌండప్

## National

### రైతు ఆత్మహత్యలులేని రాష్ర్టాలు

- దేశంలోని 9 రాష్ర్టాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో గత ఐదేండ్లుగా రైతు ఆత్మహత్యలు లేవని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ మార్చి 20న రాజ్యసభకు వెల్లడించారు. 2014-18 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 31,645 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బీహార్, గోవా, నాగాలాండ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, చండీగఢ్, ఢిల్లీ, డామన్, లక్షద్వీప్ దీవుల్లో మాత్రమే ఒక్క రైతు కూడా బలవన్మరణానికి పాల్పడలేదు. 13 రాష్ర్టాల్లో ఐదేండ్లుగా రైతు ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఆత్మహత్యల్లో వీటి వాటా 99.51 శాతం. అత్యధికంగా మహారాష్ట్రలో 12,813 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా.. కర్ణాటక రెండో స్థానంలో ఉంది.

### పీఎల్ఐ పథకానికి కేబినెట్ ఆమోదం

- దేశీయంగా వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించడానికి రూ.3,420 కోట్లతో ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మార్చి 21న జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పీఎల్ఐ పథకం ద్వారా వచ్చే ఐదేండ్లలో రూ.68,437 కోట్ల విలువైన వైద్య పరికరాలను ఉత్పత్తి చేయవచ్చని ప్రభుత్వం అంచనావేస్తుంది. అంతేకాకుండా ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలకు రూ.40,995 కోట్ల పీఎల్ఐ ఇవ్వడానికి కేంద్రం ఆమోదం తెలపింది. మేకిన్ ఇండియా హబ్‌ను రూపుదిద్దడం కోసం ఎలక్ట్రానిక్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి వచ్చే ఐదేండ్లలో రూ.41 వేల కోట్లు కేటాయించనున్నారు. దీంతో ఆయా రంగాలకు ఆర్థికంగా ఊతం వచ్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని కేంద్రం భావిస్తుంది.

### ఆర్‌బీఐ వార్ రూమ్

- కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులోనైనా కార్యకలాపాలు నిలిచిపోకుండా ఉండేందుకు వార్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్‌బీఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మార్చి 22న వెల్లడించింది. బిజినెస్ కంటిన్‌జెన్సీ ప్లాన్ (బీసీపీ)లో భాగంగా ఇలా వార్ రూమ్‌ను ఒక కేంద్ర బ్యాంక్ నెలకొల్పడం ప్రపంచంలోనే తొలిసారి. ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు అత్యంత ముఖ్యమైన 90 మంది ఉద్యోగులతో ఈ వార్ రూమ్ కార్యకలాపాలు సాగుతాయి. ఇందులో ఏ సమయంలో చూసినా 45 మంది విధులు నిర్వహిస్తుంటే, మిగిలిన వారు రిజర్వ్‌లో ఉంటారు. ఈ కేంద్ర కార్యకలాపాలు మార్చి 19న ప్రారంభమయ్యాయి.



### కొవిడ్-19 టెస్టింగ్ కిట్

- కొవిడ్-19 (కరోనా వైరస్)ను పరీక్షించేందుకు 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా టెస్టింగ్ కిట్‌ను అభివృద్ధి చేశారు. పుణెలోని మై ల్యాబ్ డిస్కవరీ సొల్యూషన్స్ సంస్థ దీన్ని రూపొందించింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) దీనికి మార్చి 24న అనుమతి ఇచ్చింది.

### కరోనా బాధితుల కోసం ఆస్పత్రి

- దేశంలో తొలిసారిగా ముంబైలో ప్రత్యేకంగా కరోనా వైరస్ బారినపడినవారి కోసం ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు రిలయన్స్ సంస్థ మార్చి 23న ప్రకటించింది. ముంబై నగరపాలక సంస్థ భాగస్వామ్యంతో సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ ఫౌండేషన్ ఆస్పత్రి కేవలం రెండు వారాల వ్యవధిలోనే 100 పడకల కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ముంబైలోని సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో సిద్ధమైన ఈ కేంద్రం పూర్తిగా కొవిడ్-19 రోగులకు మాత్రమే వైద్యసేవలందిస్తుంది. దీని ఖర్చు మొత్తాన్ని రిలయన్స్ ఫౌండేషన్ భరిస్తుంది. ఇందులో నెగెటివ్ ప్రెజర్ రూమ్ కూడా ఉంది.

## Persons

### శానిటైజర్ రోబో

- శానిటైజర్ ద్రావణాన్ని పంపిణీ చేసే రోబోను తయారు చేసినట్లు దుబాయ్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయ విద్యార్థి సిధ్ సంఘ్వీ మార్చి 21న తెలిపాడు. రోబో ముందు 30 సెంటీమీటర్ల పరిధిలో చేతులు ఉంచితే అది శానిటైజర్‌ను డిస్పెన్స్ చేస్తుంది. స్టెమ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దీన్ని ఆవిష్కరించినట్లు సిధ్ చెప్పాడు.

### కెన్నీ రోజర్స్ మృతి


- అమెరికన్ ప్రముఖ గాయకుడు కెన్నీ రోజర్స్ మార్చి 21న మరణించారు. 1938, ఆగస్ట్ 21న జన్మించిన ఆయన ఆరుసార్లు కంట్రీ మ్యూజిక్ అవార్డ్స్ విజేతగా నిలిచారు. మూడుసార్లు గ్రామీ అవార్డు అందుకున్నారు.

### మధ్యప్రదేశ్ సీఎంగా చౌహాన్

- మధ్యప్రదేశ్ రాష్ట్ర సీఎంగా బీజేపీ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ మార్చి 23న ప్రమాణం చేశారు. సీఎంగా ఆయన ఎంపిక కావడం ఇది నాలుగోసారి. గవర్నర్ లాల్జీ టాండన్ ప్రమాణం చేయించారు. మొదటిసారిగా 2005లో చౌహాన్ మధ్యప్రదేశ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.

### ఎబెల్ అవార్డులు

- నార్వేజియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ 2020 ఏడాదికి ఎబెల్ బహుమతి విజేతలను మార్చి 18న ప్రకటించింది. గణిత సైంటిస్టులైన హిలెల్ ఫ్రస్టెన్‌బర్గ్, గ్రెగరీ మార్గులిస్‌లకు ఈ అవార్డు లభించింది. సంభావ్యత, సమూహవాదం, సంఖ్యావాదం వంటి ఉమ్మడి అంశాలపై నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించినందుకు ఈ అవార్డు దక్కింది. అమెరికన్-ఇజ్రాయెల్‌కు చెందిన ఫ్రస్టెన్‌బర్గ్ హిబ్రూ యూనివర్సిటీ ఆఫ్ జెరూసలేంలో గణిత శాస్త్రవేత్త. ఇతడు వోల్ఫ్ ప్రైజ్‌ను కూడా గెలుచుకున్నాడు. గ్రెగరీ మార్గులిస్ రష్యా-అమెరికన్ గణిత శాస్త్రవేత్త. ఇతడు ఫీల్డ్స్ మెడల్, వోల్ఫ్ అవార్డులను కూడా అందుకున్నాడు. దీంతో ఈ మూడు బహుమతులను అందుకున్న ఐదో వ్యక్తిగా గ్రెగరీ రికార్డులకెక్కాడు.




### హెమింగ్‌వే అవార్డు

- ఇండియా-అమెరికన్ రచయిత రుచికా తోమర్ 2020 ఏడాదికిగాను పెన్/హెమింగ్‌వే అవార్డుకు మార్చి 23న ఎంపికయ్యారు. ఆమె రచించి 'ఏ ప్రేయర్ ఫర్ ట్రావెల్లర్స్' అనే నవలకుగాను ఈ అవార్డు లభించింది. పెన్ అమెరికా సంస్థను 1922లో న్యూయార్క్‌లో స్థాపించారు. ఈ బహుమతిని ప్రఖ్యాత రచయిత ఎర్నెస్ట్ హెమింగ్‌వే జ్ఞాపకార్థం అతడి కుటుంబం, ఎర్నెస్ట్ హెమింగ్‌వే ఫౌండేషన్ 1976 నుంచి ఇస్తున్నాయి. ఈ బహుమతి కింద 25వేల డాలర్ల నగదును అందజేస్తారు.

## Telangana

### కేంద్ర పన్నుల్లో వాటా

- ఐదేండ్లలో కేంద్రం పన్నుల వాటా రూపంలో తెలంగాణకు రూ.78,440.74 కోట్లు కేటాయించామని కేదం్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ మార్చి 23న తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,38,530.64 కోట్లు కేటాయించారు. గ్రాంట్ల కింద తెలంగాణకు రూ.11,361.52 కోట్లు ఇవ్వగా.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.37,346.39 కోట్లు ఇచ్చారు.

## International



### కరిగిపోయిన 60 వేల కోట్ల టన్నుల మంచు

- ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం అయిన గ్రీన్‌లాండ్‌లో గతేడాది రెండు నెలల ఎండలకు 60 వేల కోట్ల టన్నుల మంచు కరిగిపోయినట్లు మార్చి 21న నాసా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ సముద్ర మట్టాలను 2.2 మిల్లీమీటర్ల మేర పెంచడానికి గ్రీన్‌లాండ్‌లో కరిగిన మంచు మాత్రమే సరిపోతుందని, దీంతో భారీ నష్టం కలుగుతందని తెలపింది. గ్రావిటీ రికవరీ అండ్ క్లైమేట్ ఎక్స్‌పెరిమెంట్ ఫాలో ఆన్ (గ్రేస్-ఫో) మిషన్ అనే కొత్త ఉపగ్రహ వ్యవస్థ ద్వారా ఈ వివరాలు తెలిశాయి. 2017 నుంచి ఇది పనిచేస్తుంది. ఇది గురుత్వాకర్షణ-సెన్సింగ్ ఉపగ్రహాలకు అనుగుణంగా ఉంటుంది.

### క్రొయేషియాలో భూకంపం

- క్రొయేషియా రాజధాని జగ్రెబ్‌లో మార్చి 22న భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. 40 ఏండ్లలో ఇదే అతిపెద్ద భూకంపం అని ఆ దేశ ప్రధాని అండ్రెజ్ ప్లెంకోవిక్ తెలిపారు.

### ఆఫ్ఘనిస్థాన్‌లో గురుద్వారాపై దాడి

- ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఓ గురుద్వారాపై ఐసిస్ ఉగ్రవాదులు మార్చి 25న దాడి చేశారు. షోర్ బజార్‌లోని గురుద్వారాలో 150 మంది ప్రార్థనలు చేస్తుండగా.. తుపాకులు పేల్చుతూ, బాంబులు విసురుతూ బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో 25 మంది మరణించగా, 8 మంది గాయపడ్డారు. అక్కడికు చేరుకున్న ఆఫ్ఘనిస్థాన్ సైనిక బలగాల కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించారు. దాదాపు 80 మంది మహిళలు, పిల్లలను కాపాడారు.

### కరోనా కోసం 2 బిలియన్ డాలర్ల నిధి

- ప్రపంచవ్యాప్తంగా కరోనాను ఎదుర్కొనేందుకు 2 బిలియన్ డాలర్ల అత్యవసర నిధిని ఐక్యరాజ్య సమితి మార్చి 26న ప్రకటించింది. ప్రపంచంలోని పేద దేశాలకు ఇది ఉపయోగపడుతుంది. దీన్ని సరిగ్గా వినియోగించుకుంటే చాలామంది ప్రజల ప్రాణాలను కాపాడవచ్చు. ఇప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే పెనుముప్పుగా మారుతుంది. అన్ని దేశాలకు చెప్పేది ఒక్కటే.. ఈ హెచ్చరికలను ఆలకించండి అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు.

## Sports

### బరోడా క్రికెట్ జట్టు కోచ్ అతుల్ సస్పెండ్

- భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బరోడా మహిళల జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న అతుల్ బెదాడే సస్పెండ్ అయ్యాడు. తాను కోచ్‌గా వ్యవహరిస్తున్న టీమ్ క్రికెటర్లతో అతుల్ అసభ్యకరంగా ప్రవర్తించినందునే సస్పెండ్ నిర్ణయం తీసుకున్నట్లు బరోడా క్రికెట్ సంఘం (బీసీఏ) మార్చి 21న తెలిపింది. అతడిని సస్పెండ్ చేసినా దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని బీసీఏ వెల్లడించింది. అతడు 1994లో భారత్ తరపున 13 వన్డేలు ఆడి 22.57 సగటుతో 158 పరుగులు చేశాడు.

### మాడ్రిడ్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లొరెంజో మృతి

- ప్రపంచ ఫుట్‌బాల్ విఖ్యాత క్లబ్‌గా పేరొందిన రియల్ మాడ్రిడ్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లొరెంజో సాంజ్ మార్చి 22న మరణించాడు. 76 ఏండ్ల అతడు కరోనా వైరస్ బారినపడి చికిత్స తీసుకుంటూ మృతిచెందాడు. 1995 నుంచి 2000 వరకు రియల్ మాడ్రిడ్ క్లబ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన హయాంలో రియల్ మాడ్రిడ్ జట్టు 1998, 2000లో ప్రతిష్ఠాత్మక చాంపియన్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 118 ఏండ్ల చరిత్ర ఉన్న మాడ్రిడ్ క్లబ్ స్పెయిన్ దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నీ లా లిగాలో 33 సార్లు, యూరోప్ దేశాల్లోని క్లబ్ జట్ల మధ్య జరిగే చాంపియన్స్ లీగ్ టోర్నీలో 13 సార్లు విజేతగా నిలిచింది.

### ఒలింపిక్స్ క్రీడలు వాయిదా




- ప్రపంచవ్యాప్తంగా క్రీడా లోకం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒలింపిక్స్ క్రీడలను వాయిదా వేస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ), జపాన్ ప్రభుత్వం మార్చి 26న ప్రకటన విడుదల చేశాయి. కరోనా వైరస్ తీవ్రంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో, జూలై లోగా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే అవకాశం లేకపోవడంతో జపాన్ రాజధాని టోక్యోలో జరగాల్సిన 32వ ఒలింపిక్స్ క్రీడలు ఏడాదిపాటు వాయిదా వేశారు. 1896లో తొలిసారి ఒలింపిక్స్ జరిగాయి. అప్పటి నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించకుండా వాయిదా వేయడం ఇదే తొలిసారి. గతంలో మూడుసార్లు ప్రపంచ యుద్ధాల సమయంలో అసలు ఒలింపిక్స్ జరగనే లేదు. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా 1916లో, రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1940, 1944లలో జరగాల్సిన ఒలింపిక్స్‌ను రద్దు చేశారు. 2019 చివరి నాటికి నిర్వాహకులు అంచనా వేసిన వ్యయం 12.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.96 వేల కోట్లు). క్రీడలను చూసేందుకు వచ్చే విదేశీ అభిమానుల ద్వారా సుమారు 2.28 బిలియర్ డాలర్ల (రూ.17 వేల కోట్లు) ఆదాయాన్ని జపాన్ ఆశించింది. జపాన్ కంపెనీలే 3.3 బిలియన్ డాలర్ల (రూ.25 వేల కోట్లు) స్పాన్సర్‌షిప్ ఇస్తున్నాయి. ఇతర అంతర్జాతీయ కంపెనీలతో భారీ మొత్తాలకు ఒప్పందాలు జరిగాయి. మొత్తంగా మరో 6 బిలియన్ డాలర్ల (రూ.46 వేల కోట్లు) వరకు జపాన్‌కు నష్టం జరగవచ్చని అంచనా.

### జాతీయ చాంపియన్‌షిప్ వాయిదా

- కరోనా నేపథ్యంలో దేశం మొత్తం లాక్‌డౌన్ విధించడంతో జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను వాయిదా వేస్తున్నట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం మార్చి 26న వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 27 నుంచి మే 3 వరకు ఈ టోర్నీ జరగాల్సి ఉండగా.. ప్రస్తుత పరిస్థితుల్లో దురదృష్టవశాత్తు టోర్నీని వాయిదా వేస్తున్నట్లు 'బాయ్' కార్యదర్శి అజయ్ సింఘానియా తెలిపారు. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను మరింతకాలం పొడిగించింది. దీంతో జాతీయ సీనియర్స్‌తోపాటు ఇంటర్ జోనల్ చాంపియన్‌షిప్‌నూ వాయిదా వేశారు.

### భారత మాజీ ఫుట్‌బాలర్ అబ్దుల్ మృతి

- భారత దిగ్గజ మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అబ్దుల్ లతీఫ్ మార్చి 26న మరణించారు. 1968లో బర్మాపై అంతర్జాతీయ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన లతీఫ్ 1970 ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడు. కర్ణాటకలోని మైసూర్‌లో జన్మించిన ఆయన జాతీయ స్థాయి టోర్నీ సంతోష్ ట్రోఫీ (1966, 1968, 1970)లో బెంగాల్‌కు ప్రాతినిథ్యం వహించారు. వీటితోపాటు కోల్‌కతా విఖ్యాత క్లబ్‌లు మోహన్ బగాన్, మహ్మదాన్ స్పోర్టింగ్ జట్లకూ ఆడారు. రిటైర్‌మెంట్ ప్రకటించాక మహ్మదాన్, అస్సాం జట్లకు కోచ్‌గా వ్యవహరించారు.